


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 22 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 14 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-



## ప్రపంచానికి మరింత మంది ట్రంప్‌లు కావాలి

- ఇజ్రాయెల్ కనెసెట్ స్టాండింగ్ ఓవేషన్
- వచ్చే ఏడాది ఆయన పేరును నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదిస్తా
- బందీల విడుదలకు కృషి చేసిన ట్రంప్‌ను యూదు ప్రజలు వేల సంవత్సరాల పాటు గుర్తుంచుకుంటారు
- శాంతి స్థాపన కోసం ఆయన చేస్తున్నంతగా ఎవరూ చేయడం లేదు


6



## భూటాన్ వల్లే బెంగాల్‌లో వరదలు.. పరిహారం చెల్లించాలి

- "భూటాన్ నుంచి ముంచుకొచ్చిన నదీ జలాల కారణంగానే మాకు నష్టం జరిగింది
- రాష్ట్ర ప్రభుత్వమే అన్ని సహాయక, పునరావాస చర్యలు చేపడుతోంది
- ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

# రాజధాని అభివృద్ధి యాత్ర ఆరంభం





- అంతా కలిసి ప్రజారాజధానిగా అభివృద్ధి చేద్దాం
- రైతుల త్యాగానికి రెట్టింపు ఫలాలు అందించే పూచీ నాది
- మీరు అందించిన సహకారం మరచిపోలేను
- గత పాలకులు చేసిన అవమానాలు మరవొద్దు..
- ఎన్డీయే ప్రభుత్వం శాశ్వతంగా ఉండాలి

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాజధాని అమరావతి రైతులు చేసిన త్యాగానికి రెట్టింపు ఫలాలు దక్కేలా చేస్తామని, అమరావతి ఓ మునిసిపాలిటీగా మిగిలిపోకూడదని సీఎం చంద్రబాబు అన్నారు. సీఆర్‌డీఏ భవనం ప్రారంభం ద్వారా రాజధాని అభివృద్ధి యాత్ర ఆరంభమైందని సీఎం అన్నారు. భూ సమీకరణ విధానాన్ని విజయవంతం చేసి చరిత్ర సృష్టించిన అమరావతి రైతులను మరచేది లేదని, భూములిచ్చిన రైతులతో త్వరలో ప్రత్యేకంగా సమావేశమవుతానని చంద్రబాబు ప్రకటించారు. అంతా కలిసి రాజధానిని అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు. రాజధాని అమరావతిలో జీం7 విధానంలో నిర్మించిన సీఆర్‌డీఏ భవనాన్ని సీఎం చంద్రబాబు రాజధాని రైతులతో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇంటికో పారిశ్రామికవేత్త విధానం అమరావతి నుంచే ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. ఆయన ప్రసంగిస్తూ.. "రాజధాని నిర్మాణానికి భూమి కోసం ఎదురు చూస్తున్న సమయంలో అమరావతి రైతులు నాకు దారి చూపారు. రాజధాని నిర్మాణానికి తీసుకొచ్చిన భూ సమీకరణ అనే కొత్త విధానాన్ని విజయవంతం చేసిన చరిత్ర అమరావతి రైతులదే. వారు అందించిన సహకారం నా జీవితంలో ఎప్పటికీ మరచిపోలేను. విభజన తరువాత రాజధాని కూడా లేకుండా రాష్ట్రం ఏర్పడింది. రాజధాని నిర్మాణానికి భూమి కావాలని.. ప్రణాళికలకు అనుగుణంగా రాజధాని నిర్మించగలరా? అని చాలామంది అనుమానించారు. సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతి నిర్మాణం ప్రారంభించాం. మీరు పడిన కష్టాలు, - మిగతా 2లో

## పెట్టుబడులు.. రాష్ట్ర బ్రాండింగ్ పెంచడమే లక్ష్యం



2

- విశాఖలో నవంబరు 14, 15 తేదీల్లో సదస్సు
- జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానాలు
- సదస్సు నిర్వహణపై అధికారులతో సీఎం సమీక్ష

# నకిలీ మద్యం తయారీ వైకాపా కుట్రే

- ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలలో కేంద్రాలు ఏర్పాటు చేయించింది మాజీ మంత్రి జోగి రమేష్
- ఎక్సైజ్ సిబ్బందికి సమాచారమిచ్చి, దాడులు చేయించిందీ ఆయనే
- ఆ మకిలిని కూటమి ప్రభుత్వానికి ఆపాదిస్తూ దుష్ప్రచారం
- నకిలీ మద్యం తాగి రాష్ట్రమంతటా చనిపోయారంటూ జగన్ సొంత మీడియాలో అసత్య కథనాలు
- రూ.3 కోట్లు ఇస్తామని ప్రలోభపెట్టి నన్ను పావుగా మార్చుకున్నారు




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'జగన్ జమానాలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో నాటి ప్రభుత్వ పెద్దల పాత్రపై వెలుగుచూస్తున్న సంచలన నిజాల నుంచి ప్రజల దృష్టి మరల్చాలి. అదే సమయంలో కూటమి ప్రభుత్వంలో ఊరూరా నకిలీ మద్యం తయారీ జరిగిపోతోందంటూ పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేయాలి. దీని కోసం తమ మనిషి ద్వారా నకిలీ మద్యం తయారీ కేంద్రం తెరిపించి, ఆ సమాచారాన్ని ఎక్సైజ్ అధికారులకు లీక్ చేయించాలి. దాన్ని తెదేపా నాయకులకు ఆపాదించాలి. ఈ నకిలీ మద్యం తాగి రాష్ట్రమంతటా అనేక మంది చనిపోయారంటూ ఆ - మిగతా 2లో



## ఓటర్ల జాబితాల తారుమారుపై సిట్‌కు సుప్రీం నో

కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ)ని ఆశ్రయించాలని సూచన


6

# డీజీపీ నిద్రపోతున్నారా.. పోలీసు శాఖను మూసేయాలి!

- కోర్టు ఆదేశాన్ని అమలు చేయడం తెలియదా?
- మీకెంత మాత్రం బాధ్యత లేదు
- నిందితులకు సహకరిస్తున్నారు
- మేం రికార్డుల సీజ్‌కు ఆదేశాలిచ్చాం..
- ఆ ఆదేశాలను అమలు చేసే వారే సీఐడీలో లేరా?
- ఈ నిర్లక్ష్యానికి డీజీపీనే నిందించాలి
- పోలీసుల తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

కేసుల దర్యాప్తు, హైకోర్టులఉతర్వుల అమలు విషయంలో పోలీసుల పనితీరుపై తరచూ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్న హైకోర్టు, 'డీజీపీ నిద్రపోతున్నారా?' అంటూ మరో సారి ఘాటుగా వ్యాఖ్యానించింది. ఒక కేసుకు సంబంధించి రికార్డులన్నింటినీ తక్షణమే సీజ్ చేయాలన్న తమ ఆదేశాలను సీఐడీ అమలు చేయకపోవడంపై హైకోర్టు నిప్పులు చెరిగింది. రికార్డులను సీజ్ చేయాలని తాము గత నెల 19న ఆదేశాలు ఇస్తే, ఇప్పటి వరకు - మిగతా 2లో





6

## గుజరాత్‌లో ఆర్థిక పారదర్శకత సున్నా

- ఏండ్లకేండ్లుగా ఆడిట్ అనేదే ఎరుగని 8 మునిసిపాలిటీలు
- రూ. 2 లక్షల కోట్ల నిధుల ఖర్చు లెక్కలపై కొరవడిన స్పష్టత
- సమాచార హక్కు చట్టం ద్వారా పలు విషయాలు వెలుగులోకి
- గుజరాత్ రోల్ మాడల్ కాదు.. లూట్ మాడల్: నెటిజన్ల ఫైర్

# రాజధాని అభివృద్ధి యాత్ర ఆరంభం


-మొదటిపేజీ తరువాయి
చేసిన త్యాగాలు చూశాను. ఆ త్యాగాలకు తగిన ఫలితాలు మీకు అందేలా అన్ని విధాలుగా సహకరిస్తానని మాట ఇస్తున్నా. ఎంతో మంచి ప్రాంతమిది. పక్కనే జీవజలాలు పారే కృష్ణా నది. బంగారం పండించే భూములివి. గ్రీనరీకి కొరత ఉండదు. ఇలాంటి అనుకూలతలెన్నో ఉన్న సిటీ అమరావతి. ఈ ప్రాంతాన్ని కాలుష్యరహితంగా అభివృద్ధి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రాజధాని అభివృద్ధి కోసం రోజూ వేంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నా. నా ఆలోచన ఎప్పుడూ ప్రజల భవిష్యత్తు కోసమే.

**కేంద్రమంత్రి, రాష్ట్రమంత్రి, స్థానిక ఎమ్మెల్యేకు..మీ సమస్యల పరిష్కార బాధ్యత**

రాజధాని రైతుల సమస్యలు పరిష్కరించే బాధ్యత కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తీసుకోవాలి. వారు రైతులతో మాట్లాడుతుంటారు. అప్పటికీ పరిష్కారం కాని సమస్యలేమైనా ఉంటే నేను చూస్తా. సీఆర్‌డీఏ భవన ప్రారంభం ద్వారా రాబోయే రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలు మరిన్ని అందుబాటులోకి రానున్నాయి' అని సీఎం తెలిపారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్ర, కొలికపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**పనులు పరుగులు పెట్టించాలి: సీఎం**

రాజధాని నిర్మాణాలకు సమయాన్ని నిర్దేశించుకుని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సీఆర్‌డీఏ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన భవనంలోని ప్రతి ఫ్లోర్ పరిశీలించారు. ఏ అంతస్తులో ఏయే కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజధాని నిర్మాణ పనులపై సమీక్షించారు. పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులను



ఆదేశించారు. 'ప్రస్తుతం వర్షాల కారణంగా నిర్మాణ పనులకు ఇబ్బందులు వచ్చినా...వర్షాకాలం పూర్తయ్యాక పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలి. ఆర్థికపరమైన ఇబ్బందులు లేవు. ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్థికశాఖకు చెబుతాను' అని సీఎం అన్నారు. ఈ సమావేశంలో సీఆర్‌డీఏ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

**ఆ తప్పులు పునరావృతం కాకూడదు**

ఒకసారి జరిగిన తప్పునకు మీరు, నేనే కాదు.. రాష్ట్రం ఎంతగా నష్టపోయిందో అందరికీ తెలుసు. అలాంటి తప్పు మళ్లీ జరగకూడదు. కూటమి ప్రభుత్వం శాశ్వతంగా ఉండాలి. పవన్ కల్యాణ్, భాజపాలతో కలిసి ముందుకెళుతున్నాం. మీరంతా సహకరించాలి. గత పాలకులు చేసిన అవమానాలు, ఛీత్కారాలు, వేధింపులు ప్రతి ఒక్కరి మనసులో ఉండాలి. మన ఐకమత్యం రాజధాని బ్రహ్మాండమైన నగరంగా అభివృద్ధి చెందడానికి దోహదం చేయాలి.

**జాక్‌పాట్ ఎంపీ.. పెమ్మసాని**

'మీ ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌కు జాక్‌పాట్ తగిలి కేంద్ర మంత్రి అయ్యారు. చిన్న వయసులోనే సునాయాసంగా ఎంపీగా ఎన్నిక కావడం, ఆ తరవాత కేంద్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్‌తో మంత్రి కావడం...ఇదంతా ఒక సక్సెస్ స్టోరీ. మీలాగా, నా మాదిరిగా సాధారణ కుటుంబంలో పుట్టారు. చదువుకుని అమెరికా వెళ్లి డాక్టర్‌గా ఉండి అక్కడో ఐటీ కంపెనీ పెట్టారు. బాగా డబ్బులు సంపాదించి ప్రజా సేవ చేయడానికి మళ్లీ ఇక్కడికి వచ్చారు. ప్రజాసేవ చేయడానికి ఇంత తొందరగా ఎంపీ, మంత్రి పదవులు రావు. ఆయన మీ ఎంపీ కావడం మీ అందరి అదృష్టం. అభివృద్ధి చేయాలనే తపన ఆయనలో ఉంది. ప్రపంచాన్ని చూశారు. దేశంలో మంత్రిగా ఉన్నారు. ఆయనకు చెబుతున్నా...ఎవరైతే ఈ ప్రాంతంలో భూములు ఇచ్చారో వారిని ప్రయోజకులుగా తయారు చేయడానికి ప్లాన్ తయారు చేయాలి' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**పునాది చాలా పటిష్ఠం.. అందుకే నిలిచింది**

అమరావతి ఒక మునిసిపాలిటీగా మిగిలిపోకూడదంటే అందుకు తగ్గ మౌలిక సదుపాయాలు అవసరం. పరిపాలనకు ఇది కేంద్ర బిందువుగా ఉంటుంది. రాజధాని పునాది చాలా పటిష్ఠంగా ఉంది. దేశంలోని పవిత్ర దేవాలయాలు, మసీదులు, చర్చిల నుంచి మట్టి, జలాలు తెచ్చి శంకుస్థాపన చేశాం. ప్రధాని మోదీ పార్లమెంట్ మట్టి, యమునా జలాలు తెచ్చారు. అందుకే గత పాలకులు ఎన్ని కుట్రలు చేసినా అమరావతి నిలిచింది.

గత ప్రభుత్వంలో మీరు పడ్డ కష్టాలు చూశాను. మిమ్మల్ని నానా హింసలు పెట్టారు. రాజధానిని ఎడారి, శ్మశానం అన్నారు. వేశ్యల రాజధాని అని మాట్లాడారు. ఆడపిల్లలకు జరిగిన అవమానాలు చూశాను. మహిళా రైతులు రోడ్లెక్కి పోరాడారు. అనేక ఉద్యమాలు చేశారు. మీరు చేసిన ఉద్యమానికి మద్దతుగా నేను కూడా జోలె పట్టి అండగా నిలిచాను. ఆ ఉద్యమం ఫలితంగానే ఈరోజు ఇక్కడ కూర్చోగలిగాం. మనం పడిన కష్టాలు మరచిపోతే భవిష్యత్తులో ఇబ్బంది పడతాం

# నకిలీ మద్యం తయారీ వైకాపా కుట్రే

-మొదటిపేజీ తరువాయి
పత్రిక, ఛానల్‌తో పాటు బ్లూ మీడియాలో హోరెత్తించాలి. దాన్ని అడ్డం పెట్టుకుని ఆందోళనలు చేయాలి. కూటమి ప్రభుత్వంపై బురదజల్లి, ప్రజల్లో వ్యతిరేకత సృష్టించాలి' అనే కుట్రను వైకాపా నేతలు పకడ్బందీగా అమలు చేశారు. ములకలచెరువు, ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం తయారీ కేసుల్లో నిందితుడైన అద్దేపల్లి జనార్దనరావు (ఏ1)ను దీనికి పావుగా వాడుకున్నారు. వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్‌ది ఈ కుట్రలో ప్రధాన పాత్ర. ఎక్సైజ్ శాఖ అధికారుల విచారణలో అద్దేపల్లి జనార్దనరావు ఈ కుట్ర కోణం మొత్తాన్ని పూసగుచ్చినట్లు వివరించారు. ఆర్థికంగా పూర్తిగా దెబ్బతిన్న తనకు రూ.3 కోట్లు ఇస్తామని ప్రలోభపెట్టి.. ఈ కుట్రంతా అమలు చేయించారని వెల్లడించారు. ఆయన నేరాంగీకార వాంగ్మూలం వీడియో సోమవారం వెలుగులోకి వచ్చింది.

**నాడు జోగి రమేష్ నేతృత్వంలో..**

చిన్నప్పటి నుంచి జోగి రమేష్ నాకు బాగా తెలుసు. వైకాపా హయాంలో రమేష్ మంత్రిగా పని చేసినప్పుడు ఆయన నేతృత్వంలోనే నకిలీ మద్యం తయారు చేశా. ఆయన ఆధ్వర్యంలోనే హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన మద్యాన్ని నా బార్‌లో విక్రయించేవాణ్ని. కూటమి అధికారంలోకి వచ్చాక కఠినంగా వ్యవహరిస్తుండటంతో నకిలీ మద్యం దందా ఆపేశాను.  ఈ ఏడాది ఏప్రిల్‌లో జోగి రమేష్ తన తమ్ముడి ద్వారా నన్ను పిలిపించారు. వైకాపాకు మైలేజీ రావాలంటే తెదేపాపై బురదజల్లాలని, కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయాలని నాతో చెప్పారు. వైకాపా హయాంలో నకిలీ మద్యం తయారు చేసినట్లుగానే మళ్లీ మొదలుపెట్టాలని ఆదేశించారు. తంబళ్లపల్లె నియోజకవర్గ పరిధిలో ఈ నకిలీ మద్యం తయారీ చేపట్టాలన్నారు. ఎందుకని అడిగితే 'తంబళ్లపల్లె నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి నీ క్లాస్‌మేట్ కదా. ఆ నియోజకవర్గం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉండేది. ముఖ్యమంత్రి చంద్రబాబుపై దుష్ప్రచారం చేయాలంటే అక్కడే నకిలీ మద్యం తయారు చేయాలి' అని రమేష్ చెప్పారు.

**సమాచారమిచ్చి.. దాడులు చేయించింది వైకాపా నేతలే**

నకిలీ మద్యం ప్లాంటు సిద్ధం చేసి రెండు, మూడు నెలలపాటు సరకు తయారు చేసి నిల్వ పెట్టాలని, సమయం చూసి సమాచారాన్ని ఎక్సైజ్ అధికారులకు చేరవేసి.. ఆ ప్లాంట్‌పై దాడులు జరిగేలా చూస్తామని జోగి రమేష్ చెప్పారు. దాని ఆధారంగా రాష్ట్రమంతటా నకిలీ మద్యం తయారీ కేంద్రాలు నడుస్తున్నాయంటూ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తామన్నారు. 'నీకేం కాదు. అన్నీ మేం చూసుకుంటాం' అని భరోసా ఇచ్చారు. సిద్ధా అనే వ్యక్తి ద్వారా నేను ములకలచెరువులో గది అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారీ ప్లాంట్ పెట్టాను. స్పిరిట్, నకిలీ లేబుళ్లు, క్యాప్‌లు వంటివి బాలాజీ అనే వ్యక్తి ద్వారా తెప్పించాను. రెండు, మూడు నెలలపాటు నకిలీ మద్యం తయారు చేయించారు. అక్కడ పనిచేసే మనుషులు వెళ్లిపోతామంటున్నారని.. త్వరగా ఏదో ఒకటి తేల్చాలని జోగి రమేష్‌తో అన్నాను. 'సెప్టెంబరు 20 తర్వాత దాడి చేయిద్దాం. ఈలోగా నీ స్నేహితుడు జయచంద్రారెడ్డి ఎక్కడున్నాడో కనుక్కొని.. అతని దగ్గరికి వెళ్లిపో' అని ఆయన సమాధానమిచ్చాడు.

'తంబళ్లపల్లె పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకానాథ్‌రెడ్డి, మిథున్‌రెడ్డిల సొంతం.  జయచంద్రారెడ్డికి ఎన్నికల్లో టికెట్ ఇవ్వరు. ఇచ్చినా గెలవడు. కాబట్టి అతను ఆఫ్రికాలోనే వ్యాపారం చేసుకుంటాడు. నువ్వు అతనితో మాట్లాడుకుని అక్కడికి వెళ్లి వ్యాపారం చేసుకో' అని జోగి రమేష్ నాకు చెప్పారు.

గత నెల 24న ఆఫ్రికాకు వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్నా. 23న జోగి రమేష్ నన్ను ఇంటికి పిలిపించారు. ఆ సమయంలో ఆయన పీఏ రాము, నాగిరెడ్డి, స్వామి ఉన్నారు. వారంతా వెళ్లిపోయాక రమేష్ నాతో మాట్లాడారు. తర్వాత కొల్లేరు ప్రాంతానికి చెందిన సురేష్‌తో ఎక్సైజ్ శాఖకు సమాచారం ఇప్పించి ములకలచెరువులోని నకిలీ కేంద్రంపై దాడి చేయించారు. సరకు పట్టించి, దాన్ని కూటమి ప్రభుత్వానికి ఆపాదిస్తూ దుష్ప్రచారం మొదలుపెట్టారు. సీఎం చంద్రబాబు వెంటనే తెదేపా ముఖ్య నాయకులను సస్పెండ్ చేయటంతో ఆ విషయం హైలైట్ కాలేదు. దీంతో జోగి రమేష్ ఆఫ్రికాలో ఉన్న నాకు మళ్లీ కాల్ చేశారు. ఇబ్రహీంపట్నంలోని నా బార్ ఎదురుగా ఉన్న గోదాములో నకిలీ మద్యం తయారీ జరుగుతున్నట్లు క్యాన్లు, సరకు పెట్టాలని సూచించారు. సాక్షి పత్రిక, టీవీ ఛానల్ ప్రతినిధులతో పాటు వైకాపా నాయకుల్ని అక్కడికి తీసుకొచ్చి దుష్ప్రచారం చేయిస్తానన్నారు. అంతకు ముందు రోజు రాత్రి రమేషే తన మనుషుల ద్వారా అక్కడ నకిలీ మద్యం పెట్టించారు.

**ఆర్థిక ఇబ్బందులతోనే జోగి కుట్రలో భాగమయ్యా**

నా ఆర్థిక ఇబ్బందులన్నీ తొలగిస్తామని జోగి రమేష్ చెప్పారు. ఆఫ్రికాలో డిస్టిలరీ ఏర్పాటుకు రూ.3 కోట్లు ఇస్తామని ప్రలోభపెట్టారు. నా సోదరుడికీ ఇబ్బందుల్లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు బాగా పెరిగిపోవటం, ఇంటితో సహా ఆస్తులన్నీ వేలానికి వచ్చేశాయి. దీంతో ఆయన ప్రలోభాలకు ఆశపడి ఈ కుట్రలో భాగమయ్యాను. ఇబ్రహీంపట్నంలో పట్టుబడ్డ నకిలీ మద్యం వల్ల ప్రభుత్వానికి బాగా చెడ్డపేరొచ్చిందని.. నువ్వు ఆఫ్రికా నుంచి రావాల్సిన అవసరం లేదని, మేమే అన్నీ చూసుకుంటామని జోగి రమేష్ నాకు చెప్పారు. ముందస్తు బెయిల్ పిటిషన్ వేయిస్తామని హామీ ఇచ్చారు. కానీ అవేమీ చేయలేదు. ఈలోగా నా తమ్ముణ్ని అరెస్టు చేశారు. దీంతో వారు నన్ను మోసం చేశారని అర్థమై లొంగిపోవాలని నిర్ణయించుకున్నా. అందుకే ఈ కుట్రను బహిర్గతం చేశాను. తంబళ్లపల్లె నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జిగా పనిచేసిన జయచంద్రారెడ్డికి ఈ నకిలీ మద్యం తయారీతో ఎలాంటి సంబంధమూ లేదు.

# పెట్టుబడులు.. రాష్ట్ర బ్రాండింగ్ పెంచడమే లక్ష్యం

అమరావతి

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవడంతో పాటు కొత్త ఆలోచనలకు సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదిక కావాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. గ్లోబల్ టెక్ ట్రాన్స్‌ఫర్మేషన్, ప్రపంచ వాణిజ్యంలో దేశ వాటా పెరగడం సదస్సు లక్ష్యంగా ఉండాలని అధికారులకు సూచించారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై సచివాలయంలో అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'భాగస్వామ్య సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రధాని మోదీని ఆహ్వానిస్తాం. వివిధ దేశాల వాణిజ్య మంత్రులు, లీడింగ్ గ్లోబల్ సీఈవోలకూ ఆహ్వానాలు పంపాలి. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, పాలసీ రూపకర్తలు, విద్యావేత్తలను భాగస్వాములను చేయాలి. అతిథులకు అన్ని సౌకర్యాలతో ఆతిథ్యం ఇవ్వాలి. విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి' అని పేర్కొన్నారు. 2016, 2017, 2018లో మూడుసార్లు విశాఖలోనే సదస్సులు నిర్వహించామని.. ఇది నాలుగోసారని తెలిపారు. మంత్రులు లోకేశ్, నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఐఐ డైరెక్టర్ జనరల్ బెనర్జీ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**రాష్ట్ర ఆకాంక్షలు ప్రతిబింబించాలి**

గ్రీన్ ఎనర్జీ రంగంలో దేశానికే ఆదర్శంగా రాష్ట్రం నిలుస్తోందని సీఎం పేర్కొన్నారు. 'గూగుల్ వంటి అంతర్జాతీయ సాంకేతిక దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయి. రాష్ట్రం కృత్రిమ మేధ, ఇన్నోవేషన్ హబ్‌గా మారనుంది. ఈ అంశాలు, ఆకాంక్షలు సదస్సులో ప్రతిబింబించాలి' అని అన్నారు. సమయం తక్కువ ఉన్నందున సదస్సు ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.  సదస్సులో 13 సెషన్లు: ఈ సదస్సును మొత్తం 13 సెషన్లుగా నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. 'ట్రేడ్, జియో ఎకనమిక్ ఫ్రేమ్ వర్క్, టెక్నాలజీ ఇన్నోవేషన్, డిఫెన్స్, ఏరోస్పేస్, హెల్త్‌కేర్, బయోటెక్నాలజీ, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, సరకు రవాణా, సప్లయ్ చైన్, సస్టెయినబిలిటీ, క్లీన్ ఎనర్జీ, లెవరేజింగ్ టెక్నాలజీ అంశాలపై సెషన్లు ఉంటాయి. జీ20 దేశాలు, మధ్య ప్రాచ్యం, ఐరోపా, పశ్చిమాసియా దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది' అని పేర్కొన్నారు. 29 మంది వాణిజ్య మంత్రులు, 80 మంది దేశ, విదేశీ సీఈవోలు, 40 దేశాల నుంచి ప్రతినిధులు, 13 మంది కేంద్ర మంత్రులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు.

**'నకిలీ' మద్యాన్ని మనకు అంటించే కుట్ర**

అప్పట్లో వివేకానందరెడ్డి హత్య కేసును మన మీద తోసేందుకు కుట్ర చేసినట్లే ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి నకిలీ మద్యం వ్యవహారాన్ని తెదేపాపై తోసేసేందుకు కుట్రలు చేస్తున్నారని, ఇలాంటి నేరపూరిత రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండి తిప్పి కొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెదేపా ఎంపీలకు సూచించారు. ఆయన సోమవారం ప్రధానమంత్రితో భేటీ తర్వాత ఇక్కడి 1-జనపథ్‌లోని నివాసంలో ఎంపీలతో మాట్లాడారు. "వైకాపా నేరపూరిత రాజకీయాలకు పెట్టింది పేరుగా మారింది. వాళ్లు నేరాలు చేసి వాటిని తెలుగుదేశంపై నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. తొలినుంచీ ఇది వారికి పరిపాటిగా మారింది.

## డీజీపీ నిద్రపోతున్నారా.. పోలీసు శాఖను మూసేయాలి!

-మొదటిపేజీ తరువాయి
వాటిని అమలు చేయకపోవడంపై మండిపడింది. రికార్డులను సీజ్ చేయాలని తాము సీఐడీ ఐజీని ఆదేశించామని, అయితే సీఐడీ ఐజీ పోస్టులేదంటూ ఈ నెల 6న అనుబంధ పిటిషన్ దాఖలు చేయడమేమిటని ఆక్షేపించింది. సెప్టెంబర్ 19న ఆదేశాలిస్తే, అక్టోబర్ 6వ వరకు ఏం చేస్తున్నారని



ప్రశ్నించింది. డీజీపీ నిద్రపోతున్నారా? అంటూ మండిపడింది. తమ ఆదేశాలను అమలు చేయాలన్న చిత్తశుద్ధి ఉండి ఉంటే ఐజీ లేకున్నా, మరో అధికారి చేత తమ ఆదేశాలను అమలు చేసి ఉండేవారని పేర్కొంది. గతంలో ఓ కేసులో ఇదే కోర్టు సీఐడీ ఐజీకి ఆదేశాలు ఇచ్చిందని, ఆ ఆదేశాలు అమలయ్యాయని గుర్తు చేసింది. అప్పుడు ఉన్న ఐజీ పోస్టు ఇప్పుడు ఎందుకు లేకుండా పోతుందని ప్రశ్నించింది. కోర్టు ఆదేశాల అమలు చేయనప్పుడు పోలీసు శాఖను మూసివేయాలని ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. కోర్టు ఆదేశాలను అమలు విషయంలో పోలీసులు వారి బాధ్యతను పూర్తిగా విస్మరించారని అభిప్రాయపడింది.  కోర్టు ఆదేశాల అమల్లో జాప్యం చేయడం ద్వారా ఉద్దేశపూర్వకంగా నిందితులకు సహకరించినట్లు ఉందని తెలిపింది. తమ ఆదేశాలను అమలు చేయకపోవడం వల్ల నిందితులు ఇప్పటికే రికార్డులను తారుమారు చేసే ఉంటారని వ్యాఖ్యానించింది.

అయినా కూడా మీరు (పోలీసులు) చోద్యం చూస్తూనే ఉంటారంది. ఈ కేసులో పోలీసుల నిర్లక్ష్యం చాలా విషయాలను చెబుతోందని ఘాటుగా వ్యాఖ్యానించింది. పోలీసు శాఖ మొత్తం నిస్సారంగా, నిరుపయోగంగా మారిపోయిందని తెలిపింది. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి  పరకామణి నుంచి రూ. 72,000 విలువైన 900 అమెరికన్ డాలర్లను దొంగిలించిన ఘటనకు సంబంధించి తిరుమల వన్‌టౌన్ పోలీసులు నమోదు చేసిన కేసులో తాము కేవలం రికార్డుల సీజ్‌కు మాత్రమే ఆదేశాలిచ్చామని, దర్యాప్తునకు ఇవ్వలేదని గుర్తు చేసింది. అలాంటప్పుడు రికార్డులను సీజ్ చేయాలన్న ఆదేశాలను సీఐడీలో ఏ అధికారి అయినా అమలు చేసి ఉండొచ్చునంది. ఈ నిర్లక్ష్యానికి డీజీపీనే నిందించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మొత్తం వ్యవహారంలో తాము పోలీసుల తీరుపై చాలా అసంతృప్తిగా ఉన్నామంది. గతంలో తాము ఆదేశించిన విధంగా రికార్డులను సీజ్ చేయాలని, అలాగే ఈ విషయంలో టీటీడీ బోర్డు తీర్మానాలకు సంబంధించిన రికార్డులను కూడా జప్తు చేయాలని సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్‌ని ఆదేశించింది. వీటన్నిటినీ సీల్డ్ కవర్‌లో ఉంచి హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడిషియల్) ద్వారా తమ ముందు ఉంచాలని డీజీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## అమెరికా వెళ్లేందుకు అనుమతి కోరుతూ మిథున్‌రెడ్డి పిటిషన్



విజయవాడ

ఐక్యరాజ్య సమితి నిర్వహించే జనరల్ అసెంబ్లీ 80వ సెషన్‌కు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి తరఫున చంద్రగిరి విష్ణువర్ధన్ సోమవారం ఏసీబీ కోర్టు న్యాయమూర్తిని అభ్యర్థించారు. ఈ నెల 20 నుంచి వచ్చేనెల 5 వరకు న్యూయార్క్‌లో నిర్వహించే సమావేశాలకు వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీ మిథున్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఇప్పటికే ఈనెల 27 నుంచి 31వరకు అమెరికా పర్యటన నిమిత్తం మిథున్‌రెడ్డి పాస్‌పోర్టును అప్పగిస్తూ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశారు. అయితే ఈనెల 20నుంచి వచ్చేనెల 5వరకు అమెరికా వెళ్లి వచ్చేందుకు అనుమతించాలని మిథున్‌రెడ్డి తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రాసిక్యూషన్‌ను ఆదేశిస్తూ, న్యాయమూర్తి విచారణను మంగళవారానికి వాయిదావేశారు.

**విచారణకు సహకరిస్తున్నా రిమాండ్ పొడిగింపు**

మద్యం అక్రమ కేసులో రాజ్ కేసిరెడ్డి, చాణక్య, శ్రీధర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేష్ నాయుడు, బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ రిమాండ్ సోమవారం ముగిసింది. దీంతో పోలీసులు వారందరినీ ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరిచారు. వీరితోపాటు బెయిల్‌పై ఉన్న మిథున్‌రెడ్డి, పైలా దిలీప్, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి కూడా ఏసీబీ న్యాయస్థానంలో హాజరుయ్యారు. నిందితుల తరఫున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఈ కేసులో రిమాండ్ ముగుస్తున్న ప్రతీసారి ఏవిధమైన మార్పులు లేకుండా ఒకేవిధమైన రిమాండ్ పొడిగింపు నోటీసును న్యాయస్థానంలో ప్రవేశపెడుతున్నారని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. ఇప్పటివరకు ఈ కేసులో సిట్ 35 రూపాయలు కూడా స్వాధీనం చేసుకోలేదన్నారు. నిందితులందరిపై చార్జిషీటు దాఖలుచేసినా 200 రోజుల నుంచి వారందరినీ జైలులోనే ఉంచారన్నారు. వారిని విడుదల చేయాల్సిందిగా న్యాయమూర్తిని అభ్యర్థించారు. దీనిపై ప్రాసిక్యూషన్ వాదనలు విన్న ఏసీబీ కోర్టు న్యాయమూర్తి భాస్కరరావు నిందితులకు ఈ నెల 16 వరకు రిమాండ్‌ను పొడిగించారు.

**చెవిరెడ్డి భాస్కరరెడ్డి మధ్యంతర బెయిల్ పిటిషన్**

చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వెన్నుపూస సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని, ఆయన మంతెన సత్యనారాయణరాజు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరేందుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని న్యాయవాది వాణి ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.


**సెల్‌ఫోన్ తెరిచేందుకు అనుమతి**

మద్యం అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న చెరుకూరి వెంకటేష్ నాయుడు వద్ద సీజ్ చేసిన సెల్‌ఫోన్‌లో మరిన్ని ఆధారాలున్నాయని పేర్కొంటూ సెల్‌ఫోన్‌ను తెరిచేందుకు బయోమెట్రిక్‌కు అనుమతించాలని సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం దీనికి అనుమతిస్తూ సోమవారం ఆదేశాలు జారీచేసింది.

**ఐపీఎస్ సంజయ్ బెయిల్ పిటిషన్ తిరస్కరణ**

అగ్నిమాపకశాఖ డీజీగా ఉన్న కాలంలో నిధుల అవకతవకలకు పాల్పడ్డారనే అభియోగంపై రిమాండ్‌లో ఉన్న ఐపీఎస్ సంజయ్ బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ న్యాయస్థానం తిరస్కరించింది.

# విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం, 14 అక్టోబర్ 2025




www.viswamvoice.com

## కౌలు రైతులకు రుణాల మంజూరులో పారదర్శకత


### ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి.. : కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో కౌలు రైతులు కూడా భూమి యజమానులతో సమానంగా పంట రుణాలు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 7వ జిల్లా కోఆపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ (డిసిసిబి) సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రైతులకు రుణాల మంజూరులో ఎదురవుతున్న అడ్డంకులు, భూముల మార్టిగేజ్ ప్రక్రియ, కౌలు రైతుల గుర్తింపు వంటి అంశాలను సమీక్షించారు. కౌలు రైతులకు సకాలంలో పంట రుణాలు అందేలా సహకార సంస్థలు, బ్యాంకులు సమన్వయంగా పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ యజమాని రైతులు ఉన్న చోట కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. రుణాల మంజూరులో పారదర్శకతతో పాటు ఎన్‌పిఏ, (నాన్ పెర్ఫామింగ్ ఎస్సెట్)లు లేకుండా ఒక సమగ్ర ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని ఆదేశించారు. భూములపై మార్టిగేజ్ ప్రక్రియ సులభతరం చేయాలని, సహకార సంఘాలు రైతులకు మార్గదర్శకత్వం ఇవ్వాలని ఆమె సూచించారు. అలాగే,సిసిఆర్సి కార్డుదారులైన రైతులకు రూ.2 లక్షల నుండి రూ.5 లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నా రు. సహకార బ్యాంకులు సభ్యత రుసుము చెల్లించిన కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని ఆమె సూచించారు. రైతులు, భూ యజమానులు పరస్పర అవగాహనతో వ్యవహరించి సహృద్యంగా రుణాల మంజూరును సులభతరం చేయాల న్నారు. జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ, సహకార బ్యాంకులు మరియు డిసిసిబి శాఖలు కౌలు రైతుల రుణాల మంజూరులో స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. రైతుల ఆర్థిక స్థితి బలోపేతం అవ్వడానికి, వడ్డీ భారం తగ్గేందుకు సహకార రంగం కీలక పాత్ర పోషించాలన్నారు. అన్ని రుణాలు నిజమైన అర్హులకు మాత్రమే చేరేలా పర్యవేక్షణ క్రమం తప్పకుండా జరగాలని తెలిపారు. సహకార, వ్యవసాయ, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల అధికారులు గౌతమి కోఆపరేటివ్ సూపర్ బజార్‌లో ఉన్న భూ సమస్యలపై వివరించారు. ఆ స్థలానికి సంబంధించిన లీజు ఒప్పందం, బకాయిలు, కోర్టు వ్యవహారాలు, మరియు ఆస్తుల రక్షణ చర్యలపై వివరించారు. ఆర్థిక నష్టం నివారించేందుకు, లీజు అమలులో లోపాలను పరిశీలించేందుకు సెక్షన్ 52 కింద తనిఖీ జరుగుతోందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, జిల్లా సహకార అధికారి ఎం.వెంకట రమణ, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవ రావు, జిల్లా పశు సంవర్ధక అధికారి టి.శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఎస్.ఈ బాలకృష్ణ, తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాల డిసిసిబి బ్యాంకు అధికారులు సిఈవోలు మాధవి (ఏలూరు) ప్రవీణ్ కుమార్ (కాకినాడ) గౌతమి సూపర్ బజార్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాయవరంలో విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు


### మండల వ్యాప్తంగా బాధ్యతలు స్వీకరించిన పదిమంది ఉపాధ్యాయులు



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉపాధ్యాయ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి, వందల మందిని దాటుకుంటూ, బోధనను వృత్తిగా చేపట్టిన నూతన ఉపాధ్యాయులు రాయవరం మండలంలోని పలు పాఠశాలల్లో బాధ్యతలను స్వీకరించారు. రాయవరం మండలం విద్యాశాఖ అధికారి వై సూర్యనారాయణ తెలిపిన వివరాల మేరకు మండలంలో పలు గ్రామాలలోని ఉన్నత పాఠశాలలో సోమవారం నూతనంగా పదిమంది ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారని, వాటిలో రాయవరం జిల్లా పరిషత్ హై స్కూల్ కు హిందీ పండిట్ గా దంగేటి స్వప్న, పిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో చిక్కాల అంజిబాబు, కందర్ప శ్రీనివాస్ లు భాధ్యతలలో చేరగా, చెల్లూరు జిల్లా పరిషత్ హై స్కూల్ కు పిల్లి నాగేశ్వరరావు ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగా, పొలినాటి సునీత ఫిజికల్ ఎడ్యుకేటర్ గా బాధ్యతలు స్వీకరించారన్నారు, మాచవరం జిల్లా పరిషత్ హై స్కూల్ ఫిజికల్ ఎడ్యుకేటర్ గా ధర్నాల అనూష గ్లోరీ చేరారని, పసలపూడి ఫిజికల్ ఎడ్యుకేటర్ గా ములుగు సాంబాబు బాధ్యతలు స్వీకరించారని, వెదురుపాక జిల్లా పరిషత్ హై స్కూల్ ఫిజికల్ ఎడ్యుకేటర్ గా నేరుమిల్లి బ్రహ్మతేజ, కూర్మాపురం జిల్లా పరిషత్ హై స్కూల్ కు వారా సోమశేఖర్ ఫిజికల్ ఎడ్యుకేటర్ గా, వెంటూరు జిల్లా పరిషత్ పాఠశాలలో సోషల్ టీచర్ గా సబ్బవరపు సుజాత బాధ్యతలను స్వీకరించినట్లు ఎంఈఓ సూర్యనారాయణ తెలిపారు.

## బానాసంచా పేలుడు బాధితులను ఆదుకోవాలి...

### గతంలో కార్మికులు చనిపోతే కోటి రూపాయలు ఇచ్చిన చరిత్ర వైసీపీది : ఎమ్మెల్సీ తోట



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట నియోజక వర్గం రాయవరం మండలం కొమరి పాలెం శివారు వి సావరం లో ఇటీవల జరిగిన బాణాసంచా పేలుడులో పదిమంది మృతి చెందారని వారికి వారి కుటుం బాలకు తక్షణమే ప్రభుత్వం సహాయం అందించాలని రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ, మం డపేట నియోజవర్గ వైసిపి ఇన్చార్జ్ తోట త్రిమూర్తులు డిమాండ్ చేశారు. మండపేట విజయలక్ష్మి నగర్ లోని వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి ఎమ్మెల్యేలు ఘటన స్థలానికి చేరుకొని హంగామా చేశారన్నారు. అయితే 24 గంటల లోపు నష్టపరిహారాన్ని ప్రకటించాల్సి ఉండగా దాని ఊసే లేదని ఎద్దేవా చేశారు. గతం లో ఉత్తరాంధ్రా లో ఇలాంటి పేలుడు ఘటన చోటు చేసుకుంటే అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించడం జరిగిందని గుర్తు చేశారు. ఇదే తరహాలో కూటమి ప్రభుత్వం ఉదారంగా స్పందించాలి. కూటమి ప్రభుత్వం అనుకుంటే రాత్రికి రాత్రి జీవోలు విడుదల చేసే పరిస్థితి ఉందన్నారు. కాగా ఘటన గడిచి రోజులు గడుస్తున్న ఇప్పటికీ నష్టపరిహారం ప్రకటించకపోవడాన్ని తప్పుపట్టారు. కాగా బాణాసంచా పరిశ్రమకు సంబంధించి అనుమతులు ఇచ్చేటప్పుడు నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందన్నారు. ఇటువంటి ఘటన లు పునరావృత్తం కాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అదే సమయంలో కార్మికులకు ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. నిర్వాహకులతో ఇన్సూరెన్స్ చేయించే బాధ్యతను అధికారులు చేపట్టి వారికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మనిషి ప్రాణం తీసుకురాలేమని కనీసం ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం ముందు ఉండాలని పేర్కొన్నారు. ఆర్థిక సహాయం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, వైసిపి పట్టణ కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, పిల్ల వీరబాబు, మందపల్లి రవికుమార్, జొన్నపల్లి సత్తిబాబు, తణుకు అశోక్, టి పుల్లేశ్వరరావు, కుడిపూడి రాంబాబు, నాగులపల్లి రామకృష్ణ, చిన్ని గంగాధరం, టేకుమూడి శ్రీనివాస్, కొడమంచిలి భాస్కర్ రావు, ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు ఉన్నారు.

## పెంచిన కుమార్తె కాదంటోంది..

### ఆమెకు రాసిచ్చిన మా ఆస్తి తిరిగి మాకు ఇప్పించండి.. : జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించిన వృద్ధ దంపతులు..



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కడుపున పుట్టకపోయినా కన్న కూతురుగానే చూసుకున్న ఆ వృద్ధ దంపతులకు ఓ పెంచిన కుమార్తె అనుకోని షాక్ ఇచ్చింది. తినో తినకో వారు కష్టపడి సంపాదించిన రెండెకరాలకు పైబడి స్థిరాస్థిని తన పేరున రాయించుకుని ఆపై మోహం చాటేసింది.. ఇప్పుడు ఉన్న ఇంటిని సైతం తనపేరున రాసివ్వాలని పట్టుబడుతోంది.. దీంతో కంటికి రెప్పలా కాపాడుతుందని నమ్మి రాసిచ్చిన భూమీ లేక బ్రతికేందుకు ఆధారం లేక నానా అవస్థలు పడుతున్నారు ఆ వృద్ధ దంపతులు. ఈ క్రమంలోనే తమ కుమార్తెకు రాసిచ్చిన భూమిని వెనక్కు తీసుకుని తమకు అప్పగించాలని జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు ఆ వృద్ధ దంపతులు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. అల్లవరం మండలం మొగళ్లమూరుకు చెందిన వాసర్ల వెంకటనర్సయ్య, లక్ష్మి దంపతులు అండమాన్‌లో టైలరింగ్ పనిచేసుకుంటూ రెండు ఎకరాల 18 సెంట్లు భూమి కూడబెట్టారు. పిల్లలు లేని లోటు పూడ్చుకునేందుకు బంధువుల ఇంట్లోని ఆడపిల్లను పెంచి పెద్దచేశారు. ఆమెకు అన్ని లాంఛనాలతో వివాహం కూడా జరిపించారు. ఈక్రమంలోనే తండ్రి వెంకటనర్సయ్య పేరుమీద ఉన్న 2.18 ఎకరాల భూమిని తన పేరున రాసివ్వాలని పెంచిన కుమార్తె వాసంశెట్టి జ్యోతి అడగడంతో ప్రేమతో ఆమె పేరుమీద రాసిచ్చారు. ఆతరువాత వీరు ఉంటున్న ఇంటిని కూడా తన పేరుమీద రాసివ్వాలని కోరినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా అండమాన్‌లో లీజు ప్రాతిపదికన తమ పేరుమీద ఉన్న షాపులను కుమార్తె జ్యోతి, ఆమె భర్త వీరవెంకట సత్యనారాయణలు స్వాదీనం చేసుకుని దాని ద్వారా వచ్చే అద్దెలను కూడా వారే తీసుకుంటున్నారని, దీంతో తాము బ్రతికేందుకు చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తెలత్తిందని వెంకట నర్సయ్య, లక్ష్మి దంపతులు వాపోయారు. తమ కుమార్తె తమను చాలా కాలంగా చూడడం లేదని, వృద్ధాప్యంలో అనారోగ్యం పాలైనా ఆస్తులు రాయించుకునేందుకు చూస్తుంది కానీ కనీసం పట్టించుకోవడం లేదని కన్నీరు మున్నీరయ్యారు. తమ ఖాతాల్లో ఉన్న డబ్బులు సైతం తమకు తెలియకుండా కాజేశారని, ప్రస్తుతం బ్రతకడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు తెలిపారు. తమ వృద్ధాప్యంలో చూస్తుందన్ననమ్మకంతో ఉన్న ఆస్తిని అంతటినీ పెంచిన కుమార్తె వాసంశెట్టి జ్యోతి పేరున రాసిచ్చామని ఇప్పుడు తమను పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈనేపథ్యంలోనే తమ కుమార్తె పేరుమీద రాసిన దాన సెటిల్మెంట్ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి తమ పేరున తిరగరాయించాలని వారు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేశారు.

## బస్టాండ్‌లో రిక్షా స్టాండ్ బోర్డు తిరిగి ఏర్పాటు...

### రిక్షా కార్మికుల జోలికి వస్తే సహించం : ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రిక్షా కార్మికులు గత కొన్నేళ్లుగా ఇక్కడే రిక్షా స్టాండ్ ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని ఇటీవల కమిషనర్ టీవీ రంగారావు తమ షెల్టర్ కు వున్న బోర్డు అన్యాయంగా తొలగించారని రిక్షా కార్మికులు వాపోయారు. మండపేట బస్ స్టాండ్ లో గతంలో అప్పటి డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్ చంద్రబోస్ రిక్షా కార్మికుల కోసం షెల్టర్ నిర్మించాలని సాధారణ నిధులు రూ 9.70 లక్షలు కేటాయించి శంఖుస్థాపన చేశారు. 2022 మే 5 న ఈ షెల్టర్ ను మండపేట నియోజకవర్గ వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. ఆ బోర్డు పై మాజీ ముఖ్యమంత్రి జగన్ ఫోటో తో బాటు వైసిపి నాయకులు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఫోటోలు ఉన్నాయి. ఈ నేపద్యంలో ఇటీవల మునిసిపల్ అధికారులు, సిబ్బంది ఆ బోర్డును తొలగించారు. రిక్షా యూనియన్, ఏం అర్ పి ఎస్ నాయకులు ధూళి జయరాజు, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ నేతృత్వంలో ఆందోళన చేశారు. కమీషనర్ ను కలిసి ఎక్కడి నుండి బోర్డు తీసేసారో అదే చోట బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అయినప్పటికీ మున్సిపాల్టీ అధికారులు పట్టించుకోలేదు. పైగా అక్కడ స్టాండ్‌లో మెప్మా స్టాల్ ఏర్పాటు చేశారు. దీంతో కార్మికులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును ఆశ్రయించారు. సోమ వారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలు మీడియాతో కలిసి బస్ స్టాండ్‌కు చేరుకున్నారు. కార్మికులతో కలిసి ఆ బోర్డు ను యధాస్థానంలో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపేట మున్సిపాల్టీలో దౌర్జన్యం పెరిగిందని విమర్శించారు. రిక్షా కార్మికులు ఎండ వానకు ఇబ్బందులు పడుతున్నారని పిల్లి సుభాష్ చంద్రబోస్ ఇక్కడ షెల్టర్‌కు శంకు స్థాపన చేశారన్నారు. తను ప్రారంభించామని చెప్పారు. జగన్ పేరిట ఉన్న ఈ బోర్డు తొలగించ వద్దని కమీషనర్ కు ఒకటికి రెండు సార్లు చెప్పినా పట్టించుకోలేదని విమర్శించారు. గత ముఖ్య మంత్రి వున్న ఫోటో బోర్డు తొలగిస్తే, గతంలో పనిచేసిన ముఖ్యమంత్రులు ఎన్టీఆర్, వై ఎస్ రాజశేఖర్ రెడ్డి బోర్డులు ఉన్న అనేక అభివృద్ధి కట్టడాలు ఉన్నాయని వాటిపై వారి ఫోటోలు కూడా తొలగిస్తారా అంటూ ప్రశ్నించారు. బోర్డు లో జగన్ ఫోటో అధికారులకు అభ్యంతరం అనుకుంటూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఫోటో పెట్టుకోవాలని అంతే కానీ రిక్షా కార్మికుల పొట్ట కొట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇపుడు ఇక్కడ బోర్డు తను ఏర్పాటు చేశానని, తీస్తే జరిగే పరిణామాలకు కమీషనర్ బాధ్యత వహించాల్సివుందని హెచ్చరించారు. ప్రభుత్వాలు వస్తు ఉంటాయి, పోతూ ఉంటాయని పేర్కొన్నారు. ఈ నేపద్యంలో కార్మికులు బోర్డు ను యధాస్థానంలో ఏర్పాటు చేశారు. అక్కడ ఉన్న మెప్మ స్టాల్‌ను కార్మికులు తొలగించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, టౌన్ వైసిపి అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, పిల్లా వీరబాబు,జెడ్పీటీసీ కుడిపూడి రాంబాబు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, కౌన్సిలర్‌లు మెండు బాపిరాజు, జొన్నపల్లి సత్తిబాబు, మందపల్లి రవికుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు ధూళి జయరాజు,రిక్షా స్టాండ్ కార్మికులు చాపల సత్తయ్య,ఏడిద ఏసు, ఉదుర్తి పెంటయ్య, వేమగిరి దావీదు,కవులూరి రాంబాబు, వైసిపి నాయకులు ముమ్మిడివరపు బాపిరాజు,నాగుల పల్లీ రామకృష్ణ, చిన్ని గంగాధర్, టెకీముడి శ్రీనివాస్, యారమాటి వెంకన్న బాబు వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కార వేదికలో

## 110 అర్జీలు స్వీకరించి కలెక్టర్





**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చిన అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధి కారులపై వుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు నిర్వహించిన ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సుమారుగా 110 అర్జీలను జిల్లా కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.నిశాంతి, డిఆర్ఓ కే.మాధవి డ్వామా పిడి మధుసూదన్‌లు స్వీకరించారు ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ అర్జీదారులతో సం బంధిత అధికారి మర్యాదగా ప్రవర్తించాలని, ఎండా ర్స్మెంట్ తప్పకుండా ఇవ్వాలని తెలిపారు వ్యవహార శైలి, పరిష్కార సరళి, విధానం సరిగ్గా లేదన్న అభిప్రాయం అర్జీదారుల నుంచి ఎట్టిపరిస్థితుల్లోనూ రాకూడదని ఆయన స్పష్టం చేశారు. రీ ఓపెన్ చేసిన ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టిసారించి, త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. గడువు దాటిన అర్జీలు లేకుండా సకాలంలో క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు.అన్ని అంశాలకు సంబంధించిన అర్జీల పరిష్కారంలో సం తృప్తకర స్థాయిని పెంచాల న్నారు. విజన్ ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి నియోజక వర్గ దార్శనిక కార్యాచరణ ప్రణాళిక యూనిట్ క్రియా శీలతకు సమిష్టిగా కృషిచే యాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్‌తో పాటు కీలక ప్రగతి సూచికల సాధనకై కూడా దృష్టి సారించాలని సూచిం చారు. అర్జీలన్నింటిని క్షుణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ ఆదే శించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసి జి.మమ్మీ, డిఇఓ షేక్ సలీం భాష, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ ఏవీఎస్ రామన్, డిఈ పద్మనాభం డీఎస్ఓ ఏ ఉదయభాస్కర్, జిల్లా రవాణా అధికారి డి శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి వెంకట్రావు, ఎండిఎం కేశవ వర్మ ఆర్ అండ్ బి ఎస్‌సిబి రాము, డిఎఫ్ఓ, ఎంవి.వి ప్రసాదరావు, జిల్లా మత్స్య శాఖ అధికారి పివి శ్రీనివాసరావు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మంగళవారం 14 అక్టోబర్ 2025
www.viswamvoice.com
ఎడిటోరియల్
విశ్వంవాయిస్
VISWAMVOICE TELUGU DAILY

# ఎడిటర్ వాయిస్

## బెదిరింపుల ట్రంప్‌కు అ'శాంతి'

అగ్రదేశ అధినేత డొనాల్డ్ ట్రంప్‌ను పరాభవభారం వేధించింది. గర్వభంగమైనది. శ్వేతసౌధం నివ్వెరబోయింది. నోబెల్ శాంతి బహుమతి అర్హత గల మహిళనే వరించింది. వెనిజులా ఉక్కు మహిళ మరియా కొరినా మచాడో నోబెల్ శాంతి బహుమతి విజేతగా నిలిచింది. అగ్రదేశాధిపతినన్న అహంకారంతోనో, ప్రపంచాధిపత్యం చాటుకోవాలన్న ఆరాటంతోనో, దుగ్ధతోనో అదిరించి, బెదిరించి, విర్రవీగిన ట్రంప్‌ను నార్వేజియన్ నోబెల్ శాంతి కమిటీ నిరాకరించింది. ఎలాంటి ఒత్తిళ్ళకు తలొగ్గకుండా సముచిత నిర్ణయం తీసుకుని నోబెల్ కమిటీ ప్రశంసార్హత సాధించింది. నోబెల్ శాంతి బహుమతులతో అమెరికా ఖ్యాతిని పెంచిన థియోడోర్ రూజ్‌వెల్ట్, వుడ్రో విల్సన్, జిమ్మీ కార్టర్, బరాక్ ఒబామాల సరసన నిలబడాలని ఉవ్విళ్ళూరిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశలపై నీళ్ళుచల్లి, వెనిజులా ప్రజాస్వామ్య హక్కులపై అలుపెరుగని పోరాటం సాగిస్తున్న ఆ దేశ ప్రతిపక్ష నాయకురాలు, పార్లమెంటు సభ్యురాలు, ప్రజాస్వామ్య ఉద్యమకారిణి మరియా కొరినా మచాడోకు 2025 సంవత్సరానికి నోబెల్ శాంతి పురస్కారం ప్రకటించడం హర్షదాయకం. వచ్చే డిసెంబర్ 10వ తేదీన నార్వే రాజధాని ఓస్లోలో మరియా కొరినాకు నోబెల్ శాంతి బహుమతి ప్రదానం చేయబోతున్నారు. 1.2 మిలియన్ డాలర్ల నోబెల్ శాంతి బహుమతి ప్రపంచంలో ఒక అరుదైన గౌరవం. ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడంతో వైట్ హౌస్ నిరాశతో ఇదొక రాజకీయ ప్రేరిత చర్యగా, శాంతిపై రాజకీయాలు సాధించిన విజయంగా పేర్కొనడం విడ్డూరం. వెనిజులాలో ప్రజాస్వామ్య ప్రభుత్వం కోసం, స్వేచ్ఛగా ఎన్నికలు జరగడం కోసం మారియా కొరినా మచాడో ప్రతిపక్షాలన్నింటినీ ఏకత్రాటి పైకి తెచ్చి ఉద్యమిస్తున్న క్రమంలో ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొన్నారు. ప్రాణాలను సైతం పణంగా పెట్టడానికి వెనుకంజ వేయలేదు. న్యాయమైన హక్కుల కోసం, నియంతృత్వంపై ప్రజాస్వామ్యం విజయం సాధించాలనే ధ్యేయంతో ఉద్యమ నాయకురాలిగా, వెనిజులా సిఇ పార్లమెంటు సభ్యురాలిగా శాంతియుత పోరాటం చేస్తూ, మరియా కొరీనా ప్రజల ప్రశంసలందుకుంటూ, వెనిజులా చరిత్రను తిరగరాయడానికి తీవ్రమైన కృషి చేస్తున్నారు. వెనిజులా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగిపోయాయి. కేవలం కొద్దిమంది చేతుల్లోనే సంపదంతా కేంద్రీకృతమైపోయింది. భారీ సంఖ్యలో ప్రజలు పేదరికం తట్టుకోలేక ఇతర దేశాలకు వలసపోతున్నారు. వెనిజులాలో ఇలాంటి అస్తవ్యస్తమైన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరగాలని, పారదర్శకమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడాలని మరియా కొరినా అసమాన ధైర్యసాహసాలతో పోరాడుతున్నారు. ఇన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని నార్వేజియన్ నోబెల్ కమిటీ మరియా కొరినా మచాడోకు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించడం జరిగింది. ప్రపంచంలో ఏడు యుద్ధాలను ఆపగలిగానని, ఇది తనకే సాధ్యమైనదని ట్రంప్ గొప్పగా చెప్పుకున్నారు. ఈజిప్ట- ఇథియోపియా, థాయ్‌లాండ్- కంబోడియా, భారత్- పాక్, ఇజ్రాయెల్ ఇరాన్, ఇజ్రాయిల్- పాలస్తీనా, రువాండా- కాంగో, అజర్ బైజాన్- ఆర్మీనియా తదితర యుద్ధాలను తానే ఆపానంటూ, త్వరలో రష్యా- ఉక్రెయిన్ మధ్య కూడా యుద్ధం ఆగుతుందని ప్రకటిస్తూ, నోబెల్ శాంతి బహుమతి ప్రకటించడానికి ముందు ఇజ్రాయెల్, హమాస్‌ల శాంతి ఒప్పందం కుదిర్చి నోబెల్ కమిటీ దృష్టిలో పడడానికి ట్రంప్ విశ్వప్రయత్నం చేసారు. తుదకు ట్రంప్ ప్రయత్నాలన్నీ విఫలమైనాయి. నోబెల్ శాంతి బహుమతి చేజారిపోయింది. భారత్ వంటి దేశాలను టారిఫ్‌ల మోతతో, వీసాల భారంతో పీల్చిపిప్పి చేస్తూ తాను ఏడు యుద్ధాలను ఆపానని విర్రవీగుతూ, అహంతో రెచ్చిపోతూ, తనకే నోబెల్ శాంతి బహుమతి రావాలని వాంఛించిన ట్రంప్ చివరకు నోబెల్ శాంతి బహుమతి సాధనలో విఫలం కావడం ఒక గుణపాఠం. బెదిరించి నోబెల్ శాంతి బహుమతి సంపాదించాలనుకోవడం మూర్ఖత్వం. ట్రంప్‌లో శాంతి కాముకత్వం ఏకోశాన కనబడదు. రాజనీతిజ్ఞత మచ్చుకైనా కానరాదు. గాజాను విహార కేంద్రం గా మార్చాలని ప్రయత్నించడం, ఉక్రెయిన్‌లో రేర్‌ఎర్త్ మినరల్స్ కాజేయడానికి ఒప్పందం కుదుర్చుకోవడం, అమాయకుల రుధిరంతో మారణహోమం చేస్తున్న పాక్‌తో అంటకాగడం శాంతికి సంకేతమా? రష్యా నుండి చమురు కొనుగోలు చేయవద్దని భారత్‌ను బెదిరించడం, ప్రతీకార సుంకాలు విధించడం రాజనీతిజ్ఞుడి లక్షణమా? గ్రీన్‌లాండ్‌ను వశపరచుకోవడానికి యత్నించడం, పనామా కాలువ తనదేనంటూ హుంకరించడం,




ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# రక్షణరంగ పరిశోధనలో ఆద్యుడు



సూరి భగవంతం (అక్టోబరు 14, 1909 – ఫిబ్రవరి 6, 1989) (వయసు 79) ప్రముఖ శాస్త్రవేత్త. దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనల్లో ఆద్యుడు.ఆయన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో అక్టోబరు 14, 1909 న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ (బి.ఎస్సీ) చదువు పూర్తిచేసి, మద్రాసు యూనివర్సిటీ నుండి బి.ఎస్.సి (భౌతిక శాస్త్రము) డిగ్రీని ప్రథమ శ్రేణిలో ప్రథముడుగా అందు కున్నారు. ఈ సందర్భం గా అనేక పతకాలను అందుకున్న విద్యార్థిగా కలకత్తాలో సర్ సి.వి.రామన్ దగ్గర రీసెర్చ్ స్కాలర్ గా చేరారు. ఆయన తన మేథో సంపత్తితో, శాస్త్రీయ దృక్పథంతో, ఆలోచనా సరళితో, ప్రయోగ శీలతతో సి.వి.రామన్ అభిమానాన్ని చూరగొని ప్రియ శిష్యుడయ్యారు. అక్కడే మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు. ఆయన 1932లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడుగా చేరారు. 1938లో ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు. బోధనా విధానంలో వీరిది చాలా సులభశైలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, కచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభలన్నీ కలగలిపి అయన బోధనా విధానాన్ని ఇతర శాఖల అధ్యాపకులు కూడా నేర్చుకునే వారని చెబుతారు. తమ 28 వ యేటనే యింతటి ఉన్నత పదవిని అదిష్టించటం విశేషం. దీనికి కొద్ది కాలం ముందే యూనివర్సిటీ ఆయనకు డి.ఎస్‌సి డిగ్రీ ప్రదానం చేసింది. ఆయన 1948 వరకు ఈ పదవిలోనే ఉన్నారు. భగవంతం 1941లో కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తన పరిపాలనా కౌశలం చూపి కళాశాలను విజయ వంతంగా నడిపారు. 1948-49 మధ్య లండన్ లోని భారత రాయబారి వి.కె. కృష్ణమీనన్ కార్యాలయంలో వైజ్ఞానిక సలహాదారుగా పని చేశారు. చాలా ఐరోపా దేశాల్లో పర్యటించి వివిధ విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు. 1949లో స్వదేశం తిరిగి వచ్చి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భౌతిక శాఖాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పరిశోధన వైపు దృష్టి కేంద్రికరించి 12 మంది డాక్టరేట్ లను తయారు చేశారు. తరువాత 1952లో విశ్వ విద్యాలయ ఉప కులపతిగా పదవిని చేపట్టారు. 1957లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) సారథిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రొఫెసర్ సూరి భగవంతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గాఉన్నారు. అక్కడ పని చేస్తుండగా కృష్ణ మీనన్ ఒత్తిడి మీద 1961లో రక్షణ శాఖ పరిశోధనా సంస్థకు అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగా చేరారు. ఆ సమయంలో ప్రొఫెసర్ భగవంతం రక్షణ అవసరాలను తీర్చడానికి అనువర్తిత పరిశోధన, అభివృద్ధి దిశలో డీఆర్డీఓ ను నైపుణ్యంగా నడిపించారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు డిఆర్‌డిఓ హెడ్‌గా పనిచేశారు. అక్టోబర్ 1969 లో తన పదవి నుండి పదవీ విరమణ చేసే సమయానికి, సంస్థ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. 1962 చైనా–భారత్ యుద్ధం తర్వాత వై. బి. చవాన్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.) అధిపతిగా చేరి ఎంతో ప్రగతి సాధించారు. భారత దేశమంతా ఇరవైకి పైగా ప్రయోగ శాలలను ప్రారంభించి యుద్ధరంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైన అనేక విషయాలలో విజయం సాధించారు. 1969లో పదవీ విరమణ చేశారు. ఆయన 300 పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఇవి కాక గ్రూపు థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే మూడు గ్రంథాలు రచించారు. 1961 జూలైలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో ప్రవేశించిన ప్రొఫెసర్ భగవంతం రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వయిజర్‌గా నియమితు లైనప్పటికీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) కు డైరెక్టర్ జనరల్ గా కూడా వ్యవహరించారు. భూతలం మీద, సముద్ర జలాల మీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయటానికి డి.ఆర్.డి.ఓని ఒక సమర్థవంత మైన పనిముట్టుగా రూపొందిం చారు. శక్తివంతమైన అయుధంగా మలిచారు. ఆర్.డి.ఓను పటిష్ఠ పరచడంలో ఈయన చేసిన కృషి అసమానం. ఆర్గనైజేషన్ బ్రహ్మాండ మైన ఎదుగుదలను సాధించింది. అనేకానేక ల్యాబరేటరిలను, సుశిక్షితులను రూపొందించారు. రక్షణ శాఖ పరిశోధనలలో అనేక మంది శాస్త్రవేత్తలకు ప్రవేశం కల్పించి, వారి మేధస్సుకు పదును పెట్టారు. డి.ఆర్.డి.ఓకు నేతృత్వం వహించిన 9 సంవత్సరాల వ్యవధిలో మిస్సైల్స్, ఎయిర్ క్రాఫ్ట్, ఏరో ఇంజన్స్, కొంబాట్ వెహికల్స్ (ట్యాంకులు మొదలైనవి) ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్, హై ఎక్స్‌ప్లోజివ్స్, అండర్ వాటర్ వెపన్స్ మొదలగు వాటిని అభివృద్ధి చేయటానికి ల్యాబరేటరీలను స్థాపించారు. ఆధునిక యుద్ధ తంత్ర సాంకేతిక నైపుణ్య రంగంలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇప్పించారు. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. దేశ రక్షణ శాఖకు అద్వితీయమైన సేవలు అందిస్తూనే మరోపక్క అవాంఛనీయ పోకడలను గమనిస్తూనే ఉన్నారు. ఒకసారి నోబెల్ బహుమతి గ్రహీత, భారత మిత్రుడు ప్రొఫెసర్ పి.ఎం.ఎస్. బ్లాకెట్ ప్రధాని నెహ్రూకు ఒక సలహా యిచ్చారు. దేశ రక్షణ శాఖ అభివృద్ధి చెందడానికి దేశీయ ఉత్పత్తుల రూపకల్పనను మినహాయించి ప్రత్యామ్నాయంగా దిగుమతులు చేసుకోవలసినదని, రాడార్స్, మిస్సైల్స్, యుద్ధ ట్యాంకుల కోసం దిగుమతుల మీద ఆధారపడటం ఉత్తమమని సలహా యిచ్చారు. ఈ సలహాను పూర్తిగా నిర్లక్ష్య పరిచేలా చేసిన ప్రొఫెసర్ భగవంతం మన దేశం సర్వదా కృతజ్ఞతగా ఉండాలి. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు శాస్త్ర సలహాదారునిగా విశేష కృషి చేసి, జాతీయ భావాలకు పరిపుష్టి కల్పించి అఖండ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. భౌతిక శాస్త్ర రంగంలో మూడు ప్రామాణిక గ్రంథాలను, అనేక పరిశోధనా పత్రాలను వెలువ రించారు. రామన్ ఎఫెక్ట్ అంశం మీద వివిధ కోణాలలో అధ్యయనం చేశారు. పునః పరిశోధనలు జరిపారు. "మాలిక్యులర్ లాటిస్ వైబ్రేషన్" అంశం మీద గ్రూప్ థియరిటికల్ అప్లికేషన్స్, వాయువుల గూర్చి రామన్ ఎఫెక్ట్ కు సంబంధించిన పరిశోధనలు మీద సునిశిత కృషి జరిపారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ లలో ఫెలోషిప్ మీద పరిశోధనలు నిర్వహించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోషియేషన్ వారి భౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షులుగా (1946) వ్యవహరించారు. "1961 లో క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్" అనే బృహత్తర గ్రంథ రచన చేసి అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. కమిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ద డెవలపింగ్ కంట్రీస్ అధ్యక్షులుగా సి.వి.రామన్ పరిశోధించిన రామన్ ఎఫెక్టు అంశం మీద ప్రామాణిక పరిశోధనలు చేసిన అద్వితీయ శాస్త్రవేత్తగా కీర్తి గడించారు. రామన్ ఎఫెక్ట్, క్రిష్టల్ స్ట్రక్చర్ మొదలగు అంశాల మీద అవిశ్రాంత పరిశోధనలు జరిపి గ్రంథ రచనలు చేశారు. ఆయన 300 పైగా పరిశోధనా పత్రాలను వెలువ రించారు. గ్రూప్ థీరీ, రామన్ ఎఫెక్టు అనే రెండు ఉత్తమ గ్రంథాలను కూడా చేశారు. ఇవి ప్రామాణిక గ్రంథాలుగా అంతర్జాతీయ ఖ్యాతిని పొంది, అనేక భాషలలోకి అనువదించటం జరిగింది. జాతీయ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక సైంటిఫిక్, ప్రొఫెషనల్ సంస్థలు అనేకంలో ఆయన ఎలెక్టెడ్ ఫెలోగా ఉన్నారు. పలు యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. సి.వి. రామన్ అనుంగు శిష్యునిగా, దేశ రక్షణ శాఖను బలోపేతం చేసిన దేశభక్తునిగా పేరొందిన ప్రొఫెసర్ భగవంతం తన 80 వ యేట 1989, ఫిబ్రవరి 6 వ తేదీన మరణించారు.

# దృశ్య మాధ్యమాన్ని అస్త్రంగా మలిచిన వేదగిరి



వేదగిరి రాంబాబు గుంటూరు జిల్లా తెనాలి తాలూకా చుండూరులో 1952 అక్టోబరు 14న పూర్ణచంద్రరావు, భార్గవి దంపతులకు జన్మించాడు. అతని తండ్రి ఎక్సైజ్ శాఖలో ఉద్యోగిగా తన విద్యుక్త ధర్మాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నందున రాష్ట్రంలో అనేక ప్రాంతాలకు బదిలీ పై వెళ్ళవలసి వచ్చింది. అలా రాంబాబు బాల్యం, చదువు అంతా వివిధ ప్రాంతాలలో కొనసాగింది. రాంబాబు నాటకాలలో గానీ, సినిమా ఛాన్సులకోసం ప్రయత్నించడం కానీ అతని తండ్రికి యిష్టముండేది కాదు. డిగ్రీ చదువుతున్నప్పుడే అతనిలో సాహిత్యం పట్ల క్రమంగా అభిరుచి పెరిగింది. సాహితీ కారునిగా అతనికి యర్రంశెట్టి సాయి రచనలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. ప్రముఖ రచయితలైన యర్రంశెట్టి సాయి, ఆదివిష్ణు, విహారిలను గురుతుల్యులుగా భావించాడు. 1974 సంవత్సరంలో డిగ్రీ ఫైనలియర్‌లో చదువు తుండగా ఆంధ్రపత్రిక దీపావళి కథల పోటీకి సరదాగా పంపిన తన తొలికథ 'సముద్రం' బహుమతి సాధించి పెట్టింది. ఇక అదే క్రమంలో అప్పటి ప్రముఖ వార పత్రికలైన యువ, జ్యోతి, స్వాతి, ఆంధ్రపత్రికలకు వరసగా కథలు పంపిస్తుండే వాడు. కొంతకాలం ఆలిండియా రేడియోలో అనౌన్సర్‌గా పనిచేశాడు. రాంబాబు కథానికలకు రేడియో ద్వారా మంచి ప్రాచుర్యం లభించింది. ఆయన ఫ్రీలన్స్ జర్నలిష్టుగా వివిధ దినపత్రికలకు అనేక వ్యాసాలను వ్రాసి పంపించే వాడు. కొంతకాలం ఆంధ్రభూమి వారపత్రికలో సీనియర్ జర్నలిస్ట్‌గా చేశాడు. పల్లకి వారపత్రికకు సంపాదకుడిగా పనిచేశాడు. ఎక్కడ ఏ ఉద్యోగం చేసినా తనలోని రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తునే ఉన్నాడు. దూరదర్శన్ అందుబాటు లోకి వచ్చాక దృశ్య మాధ్యమాన్ని సామాజిక అస్త్రంగా మలిచి జనాలలో మార్పు తేవాలని ఆశించాడు. ఆ క్రమంలోనే 'పాపం పసివాడు' సీరియల్‌ను 52 వారాలపాటు నిరంతరాయంగా దూరదర్శన్‌లో రూపొందించాడు. ఎన్నో కష్టనష్టాల కోర్చి దూరదర్శన్ టెలీ సీరియల్‌ను తన సొంత ఖర్చుతోనే భరించి తీర్చిదిద్దాడు. రాంబాబు తీసిన టెలిఫిల్మ్‌కు ఉత్తమ నిర్మాత, దర్శకునిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున బంగారు నంది అవార్డు దక్కింది. కృష్ణమోహన్ టైటిల్ సాంగ్ కు కూడా నంది అవార్డు వచ్చింది. తర్వాత 'అడవి మనిషి' సీరియల్‌కు రజిత నంది వచ్చింది. దూరదర్శన్‌లో శైలజా సుమన్, రమణీ సన్యాల్ వంటి వారితో కలిసి ఇన్‌హౌస్ సీరియల్ని చేశాడు. దాదాపు రెండు సంవత్సరాల పాటు ఎంతో కష్టపడి జైలు అధికారుల అనుమతి తీసుకుని రాష్ట్రంలోని పలు జైళ్లలో పరిస్థితుల ప్రభావం చేత ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్న ఖైదీల యథార్థ గాథలను తీసుకుని వాటినే తన కథా వస్తువులుగా చేసుకుని 'జైలుగోడల మధ్య' సీరియల్ ను రూపొందించాడు. అంతకు ముందే అది స్వాతి వారపత్రికలో దాదాపు 60-70 వారాల పాటు పాఠకులను అలరించింది. రాంబాబు రాసిన 'జైలుగోడల మధ్య' పుస్తక రూపంలో దాదాపు చాలా భాషల్లో ప్రచురితమైంది. బాలసాహిత్యం లోనూ బాలల కోసం ఆయన చేసిన కృషి అజరామరం. "ఇంద్ర ధనుస్సు" అనే బాలల తొలి వీడియో మేగజైన్‌కు తొలి ఎడిటర్‌గా పనిచేశాడు. తెలుగు కథానికలపై వాటిని చిన్నచూపు చూసే వారిపై ఆయన విమర్శనాస్త్రాలు సంధిస్తూ ఉండేవాడు. ఏనాటికైనా వాటికి కూడా జాతీయస్థాయి గుర్తింపు తేవాలని ఆయన ఉద్దేశం. గ్లోబల్ ఆసుపత్రి మీడియా ఇన్‌ఛార్జిగా పనిచేస్తూ తనవద్దకు సాయం కోసం వస్తే వాళ్లకు ఉదారంగా తనకు సాధ్యమైనంతలో వారికి తక్కువ ఖర్చుతోనే వైద్య సేవలు చేయిస్తూ ఇతోధిక సేవలందిస్తుండేవాడు. వంద కథానికల పూర్తి వివరాలతో 'తెలుగు కథానిక డాట్ కామ్' కూడా ప్రారంభించాడు. 23 జిల్లాల కథానిక తీరుతెన్నులగూర్చి పోటీపెట్టి వ్యాసాల్ని సేకరించాడు. ఈ వ్యాస సంకలనాలను జయంతి సభలో ఆవిష్కరించాడు. అలాగే రచయితల చిరునామాలతో ఒక డైరెక్టరీని తీసుకొచ్చాడు. తప్పక చదవాల్సిన వంద కథానికలు అనే పేరుతో ఒక పుస్తకం వెలువరించారు. మహాకవి గురజాడ అప్పారావు 153వ జయంతి పురస్కరించుకుని సెప్టెంబర్ 21, 2015 న గురజాడ పురస్కారం అందజేసారు. ఆయన సుమారు రెండు వేలకు పైగా గురజాడకు సంబంధించిన కథలు, కథానికలు రచించారు. సముద్రం గ్రంథానికి తెలుగు విశ్వ విద్యాలయం ఉత్తమ కథానిక సంపుటి పురస్కారం, పాపం పసివాళ్ళు ధారావాహికం – రాష్ట్ర ప్రభుత్వ బంగారు నంది, అడవి మనిషి – టెలిఫిల్మ్ – రజత నంది, ఆకాశవాణిలో జింగిల్స్ కు ప్రసార భారతి పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వం నుండి గురజాడ స్మారక పురస్కారం, గిడుగు పురస్కారం, కొండేపూడి శ్రీనివాసరావు సాహితీ సత్కారం అందుకున్నారు. 2018ఆగస్టు 28న రాంబాబు ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.




# ఎమ్మెల్యేకి ఆహ్వానపత్రికను అందజేసిన ఆలయ అధికారులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట ఆత్రేయపురం మండలం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వాడపాలెం గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా సాయంత్రం 6 గంటల నుంచి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు.

# అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి రథయాత్ర



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ర్యాలీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామి రథయాత్ర స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద ఉన్న అన్నపూర్ణాదేవి ఆలయం నుండి ప్రారంభమైంది. సత్య దేవుని దీక్ష ప్రచారంలో భాగంగా వివిధ గ్రామాలను సందర్శిస్తూ నేడు ర్యాలి గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఈ యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో శివాలయం మాజీ చైర్మన్ గోగుల నాగేశ్వరరావు, సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు, సీనియర్ అసిస్టెంట్ రాంజీ, దాసర నరసింహమూర్తి, ప్రధాన అర్చకులు నరసింహమూర్తి, రథసారథుడు గౌతమ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు బ్రోచర్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆత్రేయపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ పోటీల బ్రోచర్‌ను మండల విద్యాశాఖ అధికార్లు పివి వరప్రసాద్ రావు, ఎ.సత్యన్నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్యామ్ జాదుగర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో అక్టోబర్ 18న మండల స్థాయిలో నవంబర్ 1న జిల్లా స్థాయిలో నవంబర్ 23న రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 12 13 14 తారీకుల్లో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అనుమతిని ఇవ్వడం జరిగిందని కాబట్టి చిన్నారుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని తార్కిక ఆలోచనని పెంపొందించడానికి పోటీ తత్వాన్ని అలవర్చడానికి ప్రతి పాఠశాల యందు ఈ పోటీలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షుడు ప్రసాద్,ఎం.రవి, యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, సుధాకర్, వాసుకి, గోవిందు, వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించేందుకు సన్నద్ధం కావాలి

**జిల్లా వ్యాప్తంగా 1.96 లక్షల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు**

**గత అనుభవాల దృష్ట్యా, పరీక్ష పేపర్ల భద్రత విషయంలో జాగురుకతతో వ్యవహరించాలి**

**మండలంలోని పలు పాఠశాలలను సందర్శించిన ఏ.ఎం.ఓ పిల్లి రాంబాబు**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలన్నింటిలో కలిపి జిల్లా వ్యాప్తంగా 1.96 లక్షల మంది విద్యార్థులు సెల్ఫ్ అసెస్మెంట్-2 పరీక్షలను రాస్తున్నారని, ఈ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు ఉపాధ్యాయులకు సూచించారు. రాయవరం మండలంలోని, వెదురుపాక గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి, ప్రధానోపాధ్యాయులు పోలిశెట్టి రాంబాబుతో కలిసి సెల్ఫ్ అసెస్మెంట్%-%1 పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎంవో రాంబాబు మాట్లాడుతూ, జిల్లాలో 2,035 ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా మండల స్థాయిలో మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పరీక్ష పేపర్ల భద్రత విషయంలో అత్యంత జాగురూకత వహించాలని ఉపాధ్యాయులను హెచ్చరించారు. అసెస్మెంట్ బుక్‌లెట్స్‌లో విద్యార్థులు సమాధానాలు రాసే విధానాన్ని ఒకటికి రెండు సార్లు పరిశీలించాలన్నారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలను ఆయన పరిశీలించగా, పరీక్షలు జరుగుతున్న తీరును పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.అర్జునుడు వివరించారు.

# చైర్ పర్సన్ రాణికి పలువురి పరామర్శలు...



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పట్టణం 12వ వార్డులో ఇటీవల మృతి చెందిన బీరక వీర మల్లయ్య కుటుంబ సభ్యులను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సోమవారం పరామర్శించారు. అనంతరం మాతృవియోగంతో బాధపడుతున్న వైస్సార్సీపీ నాయకులు పేపర్తి సాంబుమూర్తిను 1వ వార్డు వీరభద్రపురంలో ఉన్న వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చెల్లూరు గ్రామంలో ఇటీవల మరణించిన బొల్లంరెడ్డి దమయంతి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు యరమాటి వెంకన్నబాబు,అల్లక మహేష్,బీరక సాంబశివరావు, జెట్టి భద్రరావు, కౌన్సిలర్ పోతంశెట్టి ప్రసాద్, వైస్సార్సీపీ పార్టీ మాజీ టౌన్ ప్రెసిడెంట్ ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

# గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి



**- యోగ నరసింహునిగా శ్రీనివాసుడు - వాడపల్లిలో బ్రహ్మోత్సవ వేడుకలు**

**- ఎమ్మెల్యే బండారు తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు నయన మనోహరంగా జరుగుతున్నాయి. నాలుగవ రోజైన విష్వక్సేన పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఋత్వికులు పుణ్యాహవచనము, అష్టకళశారాధన, మహా స్నపనము, ప్రధాన హోమములు నిర్వహించారు.జగత్ కళ్యాణ నిమిత్తం శ్రీ శ్రీనివాస కళ్యాణం జరిపారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తరపున ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు పట్టు వస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. అనంతరం దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం స్వస్తి వచనము, ప్రధాన హోమములు, విశేషార్చన, చతుర్వేద స్వస్తి,దిగ్దేవతా బలిహరణ, నీరాజనమంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ జరిపారు. వాహన సేవలో భాగంగా శ్రీనివాసుడు యోగ నారసింహ స్వామి అలంకరణలో సింహ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. ప్రహ్లాద రక్షకుడైన యోగ నారసింహ రూపంలో స్వామివారి దర్శనానికి భక్తజనం పోటెత్తారు. భక్త బృందాల గోవింద నామస్మరణ, మహిళల కోలాటాల నడుమ స్వామి వారి వాహన సేవ అంగరంగ వైభవంగా జరిగింది.

**సహచర ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తనపై**

# ప్రశ్నించానని వేటు వేశారు..

**జిల్లా కలెక్టర్‌కు ఉపాధ్యాయురాలు ఫిర్యాదు..**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మురముళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న తనను అన్యాయంగా అనేక నిందలు మోపి విధుల నుంచి తొలగించేలా చేశారని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు పద్మకళ్యాణి అనే ఉపాధ్యాయురాలు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆమెకు ఎమ్మార్పీఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురముళ్ల హైస్కూల్‌లో గతంలో పనిచేసిన రామ్మోహనరావు, సుబ్బారావు అనే ఉపాధ్యాయులు విద్యార్థులను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేసేవారని, ఆడపిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నేపథ్యంలో ఆవిషయాలు బయట పెట్టినందుకు వారు తమ పరపతిని ఉపయోగించుకుని ముమ్మిడివరం ఎమ్మెల్యే సుబ్బరాజు ద్వారా తనను విధులనుంచి తొలగించారని వాపోయింది. పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుల గురించి బయట పెట్టినందుకే తనకీ పరిస్తితి తీసుకొచ్చారని, తన వద్ద వారి దుర్చర్యల ఆధారాలున్నాయని తెలిపారు. ఆ ఆధారాలు ఆధారంగా తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుని తనను తొలగించిన చోటే తనకు ఉద్యోగం ఇప్పించాలని ఆమె కోరారు. గత నాలుగు నెలలుగా తన ప్లేస్‌మెంట్ లేక వేతనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని వాపోయారు. ఇదిలా ఉంటే ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు డాక్టర్ సామ్రాట్ మధు మాదిగ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ బడుల్లో పిల్లల పట్లా అసభ్యంగా ప్రవర్తించిన ఉపధ్యాయులపై చర్యలు తీసుకోవడం మానేసి దానిని బయటపెట్టిన ఉపాధ్యాయురాలు పద్మకళ్యాణి ని వేధింపులకు గురిచేయడం అన్యాయమన్నారు. దీనిపై ఎమ్మార్పీఎస్ ఆమెకు అండగా నిలుస్తుందని తెలిపారు. వెంటనే ఆమెకు మురముళ్ల హైస్కూల్‌లో ఉద్యోగం ఇవ్వాలని లేకపోతే ఆమె తరపున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

# కల్తీ మద్యం కేసును సిబిఐకి అప్పగించాలి

**పిల్లి సూర్యప్రకాష్ డిమాండ్**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజి ముఖ్య మంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నకిలీ మద్యం తయారీకి వ్యతిరేకంగా, నియోజకవర్గ ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ మరియు నియోజకవర్గ అబ్జర్వర్ చింతలపాటి శ్రీనివాస రాజు ఆధ్వర్యంలో రామచంద్రపురంలో భారీ ర్యాలి నిర్వహించారు. అందులో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గం వైసీపీ ప్రధాన పార్టీ కార్యాలయం నుండి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి సి.ఐ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిల్లి సూర్యప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అక్రమంగా మద్యం తయారీ చేసింది వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.అలానే ఈ కేసుని సిబిఐ కి అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మండల ఎంపీపీ అంబటి భవాని,మండల కన్వీనర్లు పోలినాటి ప్రసాద్, పెట్టా శ్రీనివాస్, పిల్లి కృష్ణమూర్తి, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

**జీఎస్టీ తగ్గింపుపై**

# రామచంద్రపురంలో విస్తృత ప్రచారం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకువ చ్చిన నూతన జీఎస్టీ సంస్కర ణలపై ప్రజల్లో, వ్యాపారుల్లో అవగాహన కల్పించేందుకు మున్సిపల్ అధికారులు, ఇతర శాఖల అధికారులు ఆధ్వర్యంలో సోమవారం రామచంద్రపురం లో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ బైక్ అవగాహన ప్రచార ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమై రాజగోపాల్ సెంటర్ వరకు సాగింది.జీఎస్టీ తగ్గింపుతో పేద,మధ్యతరగతి ప్రజలకు చేకూరే ప్రయోజనాలు పై వ్యాపారులకు ప్రజలకు అవగాహన కల్పించారు. ధరల వ్యత్యాసం తెలుపుతూ ప్రదర్శించిన ఎగ్జిబిషన్ ను మంత్రి సుభాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. దీని కోసం ఇంటింటా ప్రచార అవగాహన కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టామన్నారు.జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలు,వ్యాపారులు వద్దకు వెళ్లి సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కరపత్రాలు అందచేసి, జీఎస్టీ నూతన సంస్కరణల ద్వారా చేకూరె ప్రయోజనాలను వివరిస్తున్నామన్నారు. జీఎస్టీ స్లాబులు తగ్గింపుతో నిత్యవసరాల వస్తువుల ధరలతో పాటు,సామాన్య ప్రజలకు సైతం ప్రయోజనం చేకూరేలా జీఎస్టీ రేట్లు తగ్గించారన్నారు.జీఎస్టీ సంస్కరణలు దేశ చరిత్రలో నూతన అధ్యయమని మంత్రి పేర్కొన్నారు.ఈనెల 19 వరకు జీఎస్టీ పై ప్రజలకు అవగాహన కలిగేలా అవగాహన సదస్సులు, ర్యాలీలు చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా జీఎస్టీ పై అవగాహన కల్పించే కార్యక్రమాల్లో కూటమి పార్టీ నాయకులు పాల్గొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ రాజు,స్టేట్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ పి సత్యనారాయణ,డిఈ శ్రీకాంత్,కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ డివిజన్ ప్రెసిడెంట్ మృత్యుంజయరావుకి ఘన సన్మానం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం రెవిన్యూ డివిజన్ ఉద్యగుల ప్రెసిడెంట్‌గా ఎన్నికైన రామచంద్రపురం తహసీల్దార్ బండి మృత్యుంజయరావును, డివిజన్ అసోసియేట్ ప్రెసిడెంట్ మేడిశెట్టి. హరిచంద్ర ప్రసాద్, ఉపధ్యక్షులు పంపన రామారావు, డివిజన్ కోశాధికారి పి.శ్రీరాం ప్రసాద్,జాయింట్ సెక్రటరీ ఎస్.మురళీ మరియు మండల తహసీల్దార్ కార్యాలయం విఆర్ఓల బృందం, విఆర్ఎ సిబ్బంది మరియు డీలర్లు ఘనంగా సన్మానించారు. డిప్యూటీ కలెక్టర్ నుండి విలెజ్ రెవిన్యూ అసిస్టెంట్ విఆర్ఎల వరకు అందరూ ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్లో సభ్యులు అని, ఉద్యోగులకు అండగా ఉంటానని డివిజన్ ప్రెసిడెంట్ మృత్యుంజయరావు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వి.మాధురి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ వి.సత్య దేవ్ ప్రసాద్,విఆర్ఓ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ,ఎమ్ఎస్ఓ సోనీ ప్రియ,డివిజన్ విఆర్ఓల నాయకులు పి.సాయి ప్రతిమ,మండలం విఆర్ఓల ప్రెసిడెంట్ పైడిమల్ల సత్తిబాబు, సెక్రటరీ చీకట్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షులు కాకినాడ సత్యవతి, డీలర్ల సంఘం డివిజన్ నాయకులు శీలం గంగరాజు,మండలం నాయకులు వెచ్చా రామకృష్ణ, దేవ ఘణేష్, బాబ్జి, ఎర్రబుజ్జి, విఆర్ఎల మండలం ప్రెసిడెంట్ కొనమంచిలి ఆనంద్ పాలొగొన్నారు.



### వచ్చే ఏటి నుంచే మూడో తరగతి నుంచి

# ఏఐ పాఠ్యాంశాల బోధన ...!



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ప్రభుత్వం విద్యా రంగంలో మరో కీలక నిర్ణయం తీసుకోవడానికి సిద్ధం అవుతోంది. 2026-27 విద్యా సంవత్సరం నుండి మూడో తరగతి నుంచే కృత్రిమ మేధస్సును పాఠశాల పాఠ్యాంశాల్లో భాగంగా చేర్చాలని విద్యా మంత్రిత్వ శాఖ యోచిస్తోంది. ఈ సమాచారాన్ని వార్తా సంస్థ పిటిఐ వెల్లడించింది. అధికారుల ప్రకారం, ప్రస్తుతం దేశ వ్యాప్తంగా అన్ని తరగతుల విద్యార్థులకు అనువుగా ఉండే విధంగా ఏఐని విద్యా వ్యవస్థలో చేర్చడానికి సమగ్ర చట్రాన్ని కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ రూపొందిస్తోంది. ప్రస్తుతం కృత్రిమ మేధ పాత్ర అనివార్యమవుతున్న తరుణంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది (2026-27) మూడో తరగతి నుంచే పాఠ్యాంశాల్లో ఏఐని చేర్చాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఇక అన్ని తరగతుల విద్యార్థుల కోసం ఒక ఏఐ ఇంటిగ్రేషన్ ఫ్రేమ్ వర్కును కేంద్రం అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఏఐకి సంబంధించి వచ్చే రెండు మూడేళ్లలో విద్యార్థులు, టీచర్లు సమన్వయం చేసుకునేలా మేము వేగంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దేశ వ్యాప్తంగా సుమారు కోటి మంది టీచర్లకు ఏఐ టెక్నాలజీ విద్యపై దిశానిర్దేశం చేయడంలో సవాలు ఎదురు కానుంది. అన్ని తరగతులకు సంబంధించి ఏఐ ఇంటిగ్రేషన్ చేయడానికి సీబీఎస్ఈ ఒక ఫ్రేమ్ వర్కు అభివృద్ధి చేస్తోంది" అని కేంద్ర స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాల ప్రణాళికను రూపొందించ డానికి, ఏఐ టూల్స్ ఉపయోగించడానికి ఇప్పటికే ఒక పైలట్ ప్రాజెక్ట్ చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇక దేశ వ్యాప్తంగా ఇప్పటికే 18,000 సీబీఎస్ఈ పాఠశాలలు ఆరో తరగతి నుంచి ఏఐని బోధిస్తున్నాయి. ప్రాథమికంగా ఏఐని అర్థం చేసుకోవడానికి 15 గంటల మాడ్యూల్తో బోధిస్తున్నారు. ఇక 9 నుంచి 12 తరగతి వరకు విద్యార్థులకు ఇది ఆప్షనల్ సబ్జెక్ట్ ఉంది.

# అనుమతులు లేకుండా బాణాసంచా తయారీ



**తాళ్ళరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలంలో అక్రమ మందుగుండు సామాగ్రి తయారీ, నిల్వల కేంద్రాలపై కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ ఉక్కుపాదం మోపారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ప్రత్యేక ఆదేశాల మేరకు కాకినాడ పోలీసు సబ్ డివిజన్, కాకినాడ రూరల్ సర్కిల్, కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక పోలీసు బృందాలచే కోరంగి ఎస్సై అక్రమ బాణాసంచా తయారీ నిలువల కేంద్రాలపై మెరుపు దాడులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం తాళ్లరేవు మండలం సుంకరపాలెం గ్రామంలోని తోట వారి వీధికి చెందిన ఏడిది వీర వెంకట సత్యనారాయణను ఎస్సై సత్యనారాయణ అరెస్టు చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేస్తున్నాడని పక్కా సమాచారం మేరకు ఆయా కేంద్రంపై ఎస్సై మెరుపు దాడి చేశారు. నిబంధనలు పాటించకుండా, కనీసం ప్రభుత్వ అనుమతి కూడా పొందకుండా, యదేచ్ఛగా మందు గుండు సామాగ్రి తయారు చేస్తూ పోలీసులకు పట్టు పడ్డాడు. దీంతో అతనిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి మందు గుండు సామాగ్రిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో దీపావళి సందర్భంగా.. ఏ ప్రాంతంలోనైనా ప్రభుత్వ అనుమతులు పొందకుండా బాణాసంచా నిల్వలు, తయారీ, విక్రయం తదితర కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని ఎస్సై హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తన పరిధిలో ప్రతీ రోజు ప్రత్యేక పోలీసు బృందం అక్రమ తయారీ కేంద్రాలపై ప్రత్యేకంగా నిఘా కొనసాగిస్తూ ఎక్కడైనా అనుమతి పొందకుండా కార్యకలాపాలకు పాల్పడితే తక్షణం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహావాసాల మధ్య ఎవరైనా మందు గుండు సామాగ్రి తయారు చేస్తున్న, విక్రయిస్తున్న స్థానికులు తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సత్యనారాయణ సూచించారు.

### దీపావళి పండుగ విక్రయాలపై

# డివిజన్ అధికారులకు ఆర్డీఓ అఖిల పలు సూచనలు




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం రెవెన్యూ డివిజినల్ అధికారి, రామచంద్రపురం కార్యాలయం నందు ఆర్డీఓ దేవరకొండ అఖిల మరియు బి.రఘువీర్, సబ్-డివిజనల్ పోలీస్ అధికారి అధ్యక్షతన దీపావళి పండుగ దృష్ట్యా మందుగుండు సామగ్రి విక్రయములపై తీసికోవలిసిన తగు జాగ్రత్తలు మరియు భద్రతా చర్యలు నిమిత్తం డివిజన్ లో తహసిల్దార్ లు,మండల పరిషత్ అభివృధి అధికారులు,సర్కిల్ ఇన్స్పెక్టర్ మరియు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, అగ్నిమాపక అధికారులు, వాణిజ్య పన్ను శాఖ అధికారులు, సహాయ లాబర్ అధికారులు తదితర అధికారులతొ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ అఖిల డివిజన్ అధికారులుతో మాట్లాడుతూ రాబోవు దీపావళి పండుగ దృష్ట్యా మందుగుండు సామగ్రి విక్రయముల కొరకు దరఖాస్తుదారులకు ఇచ్చు నిబంధనలకు అనుగుణంగా పరిమితులతొ కూడిన తాత్కాలిక లైసెన్సు ఇవ్వబడునని, అనుమతించబడిన ప్రదేశాలలో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక దుకాణానికి మరొక దుకాణానికి మద్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలని, దుకాణానికి ఎదురుగా మరొక దుకాణం ఉండరాదని చూచించారు.అలానే నిబంధనలు అతిక్రమినిచినచో కఠిన చర్యలు తీసుకునేలా అదేశాలు జారిచేసారు. అలానే రామచంద్రపురం సబ్-డివిజనల్ పోలీస్ అధికారి బి.రఘువీర్ మాట్లాడుతూ మందుగుండు సామగ్రి విక్రయ దుకాణాలలో చిన్న పిల్లలు,వృద్దులు, వికలాంగులు పని చేయరాదని,విక్రయాల అనంతరం మిగిలిపోయిన స్టాక్ ని గృహాములలో నిల్వ చెయ్యరాదని,ఉరు చివర అనుమతులతో కూడిన గుడాము నందు భద్రపరుచుకోవలెను అని విక్రయదారులను పోలీస్ శాఖా వారి కి బైన్దోవర్ చెయ్యబడునని తెలి పారు. అగ్నిమాపక అధికా రులు మాటాడుతూ మందుగుండు సామగ్రి విక్రయ దుకాణం నందు 200 లీటర్ల నీటి నిల్వతో కూడిన డ్రమ్ము,ఇసుక బకిట్లు మరియు ఫైర్ ఎక్స్టింగ్యూషర్ మొదలగు బద్రత పరమైన ఏర్పాట్లు ఉండవలెను అని సూచనలు చేసారు.అదే విధముగా సంబదిత అధికారులు ఆయా శాఖ పరమైన బద్రత సూచనలు తెలీజేశారు.



# ఒమ్మంగిలో సంగం డైరీని ప్రారంభించిన ఎమ్మెల్యే



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామ తెలుగు దేశం పార్టీ యువ నాయకురాలు సుంకర భవాని సంగం డైరీ పాల ఉత్పత్తుల దుకాణంను సోమవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. దుకాణానికి ఎమ్మెల్యే సత్యప్రభ రిబ్బన్ కట్ చేసి, కొబ్బరికాయ కొట్టి దుకాణాన్ని ప్రారంభించారు. అనంతరం భవానిని అభినందిస్తూ, వ్యాపార అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అమ్మకం విభాగంలో యజమాని స్థానంలో ఉండి తొలి అమ్మకాన్ని కూడా ఎమ్మెల్యే చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణ యజమాని భవాని కొనుగోలు దారులతో మాట్లాడుతూ "మా దుకాణంలో పాల ఉత్పత్తులు, స్వీట్స్, పాలు, పెరుగు, లస్సీ, పాల ఉత్పత్తులు, రాగి, జొన్న లడ్డూలు, మలయ్ లడ్డూ వంటి నాణ్యమైన వస్తువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మండల కూటమి కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# సంపద సృష్టిస్తామన్నారు ఆ మాట మరిచారా...?

**కల్తీ మద్యం ఏరులై పారుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుంది... - కల్తీ కుంభకోణంలో సిబిఐ సమగ్ర విచారణ చేపట్టాలి...**
**- ప్రభుత్వ వైఖరిపై అసహనం వ్యక్తపరిచిన ఎమ్మెల్సీ తోట...**




**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నికల ముందు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తాను ఎన్నికల్లో గెలిస్తే సంపద సృష్టిస్తానని చెప్పేవారని తీరా అధికారంలోకి వచ్చిన అనంతరం కల్తీ మద్యం వంటి కుంభకోణాలతో టిడిపి మంత్రులు ఎమ్మెల్యేలు నాయకులు కోట్లకు పడగలు ఎత్తేలా వారికి సంపద దోచి పెడుతున్నారని రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ, మండపేట నియోజక వర్గం వైసీపీ ఇంచార్జ్ తోట త్రిమూర్తులు ఆరోపించారు. మండపేట విజయలక్ష్మి నగర్లోని వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలన్ని ప్రజలు గమనిస్తు న్నారన్నారు. కల్తీ మద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. కల్తీ మద్యం దొరికిన వెంటనే ప్రభుత్వం ఉలిక్కిపడి సర్దుబాటు చేసుకునేందుకు ఆలోచన చేస్తుందని విమర్శించారు. దీన్ని పెద్ద పరిశ్రమల చంద్రబాబు అభివృద్ధి చేశారని ఆరోపించారు. బెల్ట్ షాపులు ఏర్పాటు ద్వారా కోట్లాది రూపాయలు ఆదాయ వనరులుగా మార్చుకున్నారని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో వార్డుల్లో వేలం వేసి మరి బెల్టు షాపులు ఏర్పాటు చేస్తున్నారంటే దీనిపైన వచ్చే ఆదాయం ఏంటో ఇట్టే అర్థం చేసుకోవచ్చని వివరించారు. టిడిపి కార్యకర్తలకు ఆయా గ్రామాల్లో కేటాయిస్తున్నా రన్నారు. ఒకవేళ పోటీ ఉంటే వేలం పాటలు నిర్వహించి మరి షాపులు ఇవ్వడం దేనికి సాంకేతమని ప్రశ్నించారు. గత వైసిపి హయాంలో బెల్ట్ షాపులు అనేవి లేనే లేవని చెప్పారు. ప్రభుత్వమే బ్రాందీ షాపులను నిర్వహించేదన్నారు. పట్టణాలు గ్రామాలకు దూరంగా ఊరికి చివర మద్యం షాపులు నిర్వహించే వారిని పేర్కొన్నారు. ఇప్పుడు పట్టణంలో నడిబోడ్డున జనవాసాల మధ్య వీటిని ఏర్పాటు చేస్తూ ప్రజలను అవహేళన చేస్తున్నారని విమర్శించారు. నకలి మద్యం కేసుకు సంబంధించి నిందితులకు ప్రభుత్వ సహకారం లేకుండా ఇంత పెద్ద ఎత్తున నకిలీ ఎలా తయారవుతుందని ప్రశ్నించారు. విజయవాడ పక్క నియోజవర్గంలో పెద్ద ఎత్తున మద్యం గౌడన్ నడుపుతున్నారా అంటూ ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా అమలాపురం లో పెద్ద ఎత్తున మద్యం ఇటీవల పట్టుకున్నా రన్నారు. గత ప్రభుత్వం తప్పిదాలు ఎత్తిచూపు తున్న చంద్రబాబు తన ప్రభుత్వంలో జరుగు తున్న కల్తిని ఎందుకు అరికట్ట లేకపోతు న్నారని ప్రశ్నించారు. బెల్టు తాట తీస్తాం అనే చంద్రబాబు ఎక్కడ తీశారన్నారు. అధికారులు తీరు మార్చుకోవాలని పదేపదే చంద్రబాబు అంటున్నారని ముందు చంద్రబాబు తీరు మార్చుకోవాలని పేర్కొన్నారు. ఆఫ్రికా నుండి జనార్ధన్ను మద్యం కేసులో తీసుకువచ్చారని ముంబై ఎయిర్పోర్టులో అతని సెల్ ఫోన్ మిస్ అయినట్లు చెబుతున్నారన్నారు. ఆ ఫోన్ దొరికితే అన్ని విషయాలు బయట పడతాయని తెలిపారు. ప్రభుత్వం కు చిత్తశుద్ధి ఉంటే డేటా సేకరించాలని సవాల్ విసిరారు. సిట్ విచారణ వేస్తాం అంటున్నారని సిట్ అధికారులు చంద్రబాబుకు కనుసన్నల్లో ఉన్నవారే కదా అంటూ నిలదీశారు. జనార్ధన్ వైసీపీ నాయకుడనీ తమ కోవర్టు అని ప్రస్తుతం చంద్రబాబు అంటున్నారని దుయ్యబట్టారు. ప్రజలు ఏమనుకుంటున్నారో అనే ధ్యాస లేదని విమర్శించారు. లేకుంటే పార్టీ నుంచి సస్పెండ్ చేశామని చెప్తున్నారన్నారు. టిడిపి పెద్దల భాగస్వామ్యం తోనే ఈ నకిలీ మద్యం రాకెట్ పనిచేస్తుందని ఆరోపించారు. సిబిడి ద్వారా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం లేఖ రాస్తే సీబీఐ విచారణ నిమిషాల్లో చేపడుతారని సలహా ఇచ్చారు. కల్తీ మద్యంతో చంద్రబాబు ప్రజల ఆరోగ్యాలతో చెలగాట మాడుతున్నారని విమర్శించారు. ప్రజలు మోసపోయారన్నారు. సంపద పెరిగేది ప్రజలకు కాదని టిడిపి నాయకులు ఎమ్మెల్యేలకు సంపద వస్తుందని విమర్శించారు. మండపేట పట్టణంలో బ్రాందీ షాపు మున్సిపాలిటీకి అతి సమీపంలో ఏర్పాటు చేసి అక్కడి ప్రజలకు ఇబ్బందులు కలగజేస్తున్నారని విమర్శిం చారు. దీనిపై తాను ప్రశ్నిస్తే మరో షాపు తీసుకొచ్చి అదే చోటులో ఏర్పాటు చేశారని ఇది ఇక్కడి పరిస్థితి కి అద్దం పడుతుందని విమర్శించారు. కల్తీ మద్యం జరుగుతున్న కుట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. గతంలో బెండు తీస్తామన్న చంద్రబాబు ఇప్పుడు బెల్ట్ తీస్తానని అంటున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలో ఉన్న బెల్టు షాపులు రద్దు చేస్తామని ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. ఈ వ్యాపారం చేస్తున్నదే చంద్రబాబని దుయ్యబట్టారు. అందుకే దాని జోలికి పోరని పేర్కొన్నారు. వందల కోట్ల సంపాదించే ప్రణాళికతో పక్కాగా నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్నట్లు విమర్శించారు. తూతూ మంత్రంగా సిట్ వేసాం అని చెబుతూ కేసు నీరు కార్చే కుట్ర జరుగుతుందన్నారు. అసలు ముద్దాయిలకు చంద్రబాబు ప్రభుత్వంలో ఉన్న పెద్దలు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. తక్షణమే నకిలీ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై తమ పార్టీ దశల వారి ఉద్యమానికి శ్రీకారం చుట్టుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, వైసిపి పట్టణ కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, పిల్లా వీరబాబు, మందపల్లి రవికుమార్, జొన్నపల్లి సత్తిబాబు, తణుకు అశోక్, టి పుల్లేశ్వరరావు, కుడిపూడి రాంబాబు, నాగులపల్లి రామకృష్ణ, చిన్ని గంగాధరం, టేకుమూడి శ్రీనివాస్, కొడమంచిలి భాస్కర్ రావు, ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు ఉన్నారు.

# కలెక్టరేట్లో డిప్యూటీ సీఎం పర్యటనపై సమావేశం నిర్వహించిన కలెక్టర్

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 17వ తేదీ శుక్రవారం రాజోలు నియోజకవర్గం లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కే.పవన్ కళ్యాణ్ పల్లె పండుగ 2.0 పనులను ప్రారంభించ నున్నా రని రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి అధికారులతో ఈ నెల 17వ తేదీ శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రాథమిక స్థాయి సమావే శాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ మొట్టమొదటి సారిగా రాజోలు నియోజక వర్గం పర్యటనకు వస్తున్నందున పక్కాగా ఏర్పాట్లు గావించి విజయవంతం చేయాలని జిల్లా స్థాయి అధికారులను ఆయన కోరారు. శంకరగుప్తం మురుగు కాలువ విధ్వంసం మూలంగా 15 గ్రామాల్లో ఉప్పు నీరు పైకి రావడం డ్రైనేజీ పూడిక తీయకపోవ డంతో సుమారు అర్థ కిలోమీటర్ పొడవునా డ్రైనేజీ నీరు పైకి పొంగి ప్రవహించడంతో సుమారు లక్ష కొబ్బరి చెట్లు చనిపోయి రైతులు తీవ్రమైన ఇక్కట్లను ఎదుర్కొన్నారన్నారు. ఇటీవలనే శంకర్ గుప్తం డ్రైన్ ను రాష్ట్ర జలవన రుల శాఖ మాత్యులు నిమ్మల రామానాయు డు సందర్శించి కూడికతీత కొరకు 9 కోట్ల 7 లక్షలు గ్రాంట్ ఇప్పిస్తానని అదే విధంగా గట్లు బలోపేతానికి 6 కోట్లు నిధులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారన్నా రు. ఇదే విషయమై శాసనసభ సమా వేశాలలో ఉప ముఖ్య మంత్రివర్యులతో చర్చించడం జరిగిందని ఈ మేరకు ఆయన స్వయంగా పరిశీలనకు రావాలని ఆహ్వానిం చడం జరిగిందని అదే విధంగా పల్లె పండుగ 2.0 పనులను ప్రారంభించేందుకు సి ఎస్ ఆర్ నేషనల్ గ్రీన్ ట్రిబునల్ నరేగా అనుసంధానంతో చేపట్టబోయే పనులకు శంకుస్థాపనలు నిర్వహించేందుకు వస్తున్నట్లు వెల్లడించారు. ఉప ముఖ్య మంత్రివర్యులు తొలుత కేసనపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్కు చేరుకొని బ్రిడ్జ్ వ్యూపాయింట్ నుండి డామేజీ నీ పరిశీలించి అనంతరం సుమారు 200 మంది రైతులతో ముఖాముఖిగా మాట్లాడ తారని చిన్న ప్రెస్ బ్రీఫ్ ఇస్తారని తెలి పారు. అనంతరం ముల్కీపల్లి సెంటర్ చేరుకొని కాట్రేనిపాడు లంక వద్ద 7 గ్రామాలకు రోడ్డు వేయుటకు రూ 3.20లతో శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అదేవి ధంగా నరేగా అనుసంధానంతో జిల్లా కలెక్టర్ వారు ప్రతిపాదించిన పనులకు శంకుస్థాపన భూమి పూజ కార్యక్రమాలు నిర్వ హిస్తారన్నారు. రూ 3.4 కోట్లతో గుడిమేల్లంక రాపిడ్ పిల్లర్, ఎన్జీటీ నిధులతో రూ 7.5 కోట్లతో ఓహెచ్ఎస్ఆర్ పైప్లైన్ పనులకు శంకుస్థా పన చేస్తారన్నారు పల్లె పండుగ 2.0 లో పూర్తి చేసిన 117 పనులను ప్రారంభిస్తారన్నా రు. ఆర్ అండ్ బి ద్వారా సుమారు రూ.7 కోట్లతో ఆరు పనులు శంకుస్థాపన చేస్తారన్నారు అనంతరం సుమారు పదివేల మంది పాల్గొనేలా శివకోడు జాతీయ రహదారి సమీపంలో ఏర్పా టుచేసిన బహిరంగ సభలో పాల్గొని పల్లె పండుగ 2.0 గురించి ప్రసంగిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ ఆర్డిఓ రామచంద్రపురం కేసనపల్లి హెలిప్యాడ్ వద్ద ఆర్డీవో కొత్తపేట వేదిక ఏర్పాటు జిల్లా ఎస్పీ బహిరంగ వేదిక వద్ద శాంతి భద్రతల పర్యవే క్షణ ఆర్డిఓ అమలాపురం మొత్తం కార్య క్రమం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏపీ ఈపీడీసీఎల్ పర్యటన ప్రదేశాలలో విద్యుత్ సరఫ రాను అందించాలన్నారు. వేదిక వద్ద త్రాగునీటి ఏర్పాట్లు ఆర్డబ్ల్యూఎస్ విభాగం చేప ట్టాలన్నారు. కాన్వాయ్ ఏర్పాట్లు అదనపు ఎస్పి జిల్లా రవాణా అధికారి చేపట్టాలన్నారు. సిపిఓ నివేదిక తయారు చేయాలని జిల్లా పౌర సమాచార శాఖ వారు మీడియా కోఆర్డి నేషన్ చేయాలన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, డిఆర్ఓ కే.మాధవి జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
మంగళవారం, 14 అక్టోబర్ 2025
www.viswamvoice.com





కస్తూరిబా గాంధీ జాతీయ స్మారక ట్రస్టులో

# అంతర్జాతీయ బాలికల దినోత్సవం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల సీతానగరం గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ జాతీయ స్మారక ట్రస్ట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కె.శైలజ రాణి ఆధ్వర్యంలో ఆశ్రమ ప్రతినిధి జి. సుశీల అధ్యక్షతన అంతర్జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆడపిల్లలను రక్షిద్దాం అనే అంశం మీద ఆడపిల్లలకు, వారి తల్లిదండ్రులకు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ కె. శైలజ రాణి మాట్లాడుతూ ఆడపిల్లలను పుట్టిన దగ్గర నుంచి వివక్షత లేకుండా మగ పిల్లలతో సమానంగా జీవన అవకాశాలు మరియు విద్యావకాశాలు కలిగించి వారిని అభివృద్ధి చెందేలా చూసి వారికి అన్ని రంగాలలో భాగస్వామ్యం కల్పించేలాగా చూడడం సమాజంలో అందరి బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీతానగరం ప్రభుత్వ కళాశాల తెలుగు అధ్యాపకురాలు ఎం సుధామయి, ఎం పి హెచ్ ఈఓ వై.యస్. రాయుడు, పిహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి సూపర్వైజర్ కె.సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ పి.నందీశ్వర రావు, ఏఎన్ఎం కె.శారద, ఆశా కార్యకర్తలు దేవి,జ్యోతి అధిక సంఖ్యలో బాలికలు మహిళలు పాల్గొన్నారు.

# ఇనుగంటి వారి పేట గ్రామపంచాయతీలో గ్రామసభ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం గ్రామపంచాయతీలో 2026-2027 సంవత్సరానికిగాను గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ గ్రామసభలో లేబర్ బడ్జెట్కు అనుగుణంగా 25 కాలువ పనులు, రెండు ఫారం పాండ్స్, ఐదు కంపోస్ట్ బిట్స్ గుర్తించడమైనది. అదేవిధంగా జాబ్ కార్డు ఉన్న వారందరూ ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, సెక్రటరీ,ఉపాధి హామీ సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు, ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

# పేద ప్రజల వైద్యం పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది



రాష్ట్ర వాలంటరీ వింగ్ జాయింట్ సెక్రెటరీ

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేద ప్రజల ఆరోగ్యం పట్ల ఏమాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదని రాష్ట్ర వాలంటరీ వింగ్ జాయింట్ సెక్రెటరీ పెదపాటి రమేష్ బాబు (డాక్టర్ బాబు)అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబు మాట్లాడుతూ గతంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేద ప్రజల ఆరోగ్యం పట్ల పెద్ద పీట వేసామని 2014 నుండి 2019 టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆరోగ్యశ్రీ కి పెండింగ్లో ఉన్న బకాయిలను సైతం చెల్లించడం జరిగిందని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పథకం బకాయిలు చెల్లించకుండా పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మారుమూల ఉన్న పేద ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 17 కొత్త మెడికల్ కాలేజీలతో పాటు ఆసుపత్రులను తీసుకువస్తే ఇప్పటి కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పెండింగ్లో ఉన్న బకాయిలు చెల్లించి పేదప్రజల ఆరోగ్య సేవల పట్ల చిత్త శుద్ధితో పనిచేయాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. లేని పక్షంలో ప్రజలందరితో కలసి నిరసనలు చేపడతామని పెదపాటి రమేష్ అన్నారు.

# ప్రైవేటీకరణ కంటే ప్రమాదకరమైనది పిపిపి విధానం..

ప్రభుత్వ మెడికల్ కాలేజీల పరిరక్షణకు విశాల పోరాట వేదిక.. : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు నిర్వహణకు ప్రభుత్వ అనుసరిస్తున్న పిపిపి విధానం ప్రైవేటీ కరణ కంటే ప్రమాదకర మైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు హెచ్చరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల పరిరక్షణకు విశాల పోరాట వేదిక ఏర్పాటు కానుందని తెలిపారు. మోడీ అనుసరిస్తున్న మానిటైజేషన్ విధానానికి పిపి విధానం మరో రూపమని వివరించారు. మానిటైజేషన్ ఫలితంగా ఇప్పటికే రైల్వే రంగంలో వచ్చిన మార్పులను ఉదాహరణగా చెప్పారు. ఎటువంటి పెట్టుబడి లేకుండా ప్రజల సొమ్ముపై ప్రైవేట్ పెత్తనం, ఆర్థిక దోపిడీ జరగనుందని తెలిపారు. సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రెస్ క్లబ్ లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుమాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో 2023 లో జరిగిన అవకతవకలను బహిర్గతం చేసిన సిబిఐ రిపోర్టును ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనూ కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో మాల్ ప్రాక్టీస్ జరిగినట్లు, అనుమతి లేకుండానే సీట్లు ఇచ్చినట్లు బట్టబయలైందని గుర్తు చేశారు. 2024 తర్వాత రాష్ట్రంలో మెడికల్ కాలేజీల నిర్మాణాలను ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం మూడేళ్ల కాలంలో ఆరు కాలేజీలు నిర్మించిందని, తాజా ప్రభుత్వం రాబోయే మూడేళ్లలో 12 కాలేజీలు పూర్తి చేసి తన సమర్ధతను నిరూపించుకోవాలని అన్నారు. ప్రజల సంపదపై ప్రైవేటు వారికి పెత్తనం కట్టబెట్టే తీరు సరైంది కాదన్నారు.కన్వీనర్ కోటాలో రూ 15000 ఉండే మెడికల్ సీటు 8 నుంచి 12 లక్షలకు చేరనుందని ఇది సామాన్యులకు పెను భారం అని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులకు ఈ మెడికల్ కాలేజీలో అనుసంధానంగా ఉన్నాయని ఒకసారి పి పి పి విధానం అమలయితే ఆసుపత్రిలో బెడ్లు సైతం ప్రైవేట్ వారి నిర్వహణలోకి వెళ్లిపోతాయని హెచ్చరించారు. ఫలితంగా పేదలకు బెడ్లు సైతం దొరకని పరిస్థితి రానుందని వివరించారు. రాష్ట్రంలో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ప్రభుత్వం ఇప్పటికైనా ఈ విషయాన్ని గుర్తించి పునరాలోచించుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4.75 లక్షల ఉద్యోగాలు ఇచ్చామంటూ ప్రకటనలతో ప్రజలను మభ్య పెట్టడం సరైనది కాదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో 5000 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉపాధికి దూరమయ్యారని తెలిపారు. ప్రభుత్వ భూములను కారు చౌకగా చేజిక్కించుకున్న టిసిఎస్ సైతం 20 వేలమంది ఉద్యోగులను తొలగించిందని గుర్తు చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలోనూ 12 శాతం పని దినాలు చేరుకోలేదని రాష్ట్రస్థాయి గణంకాలు చెబుతున్నాయన్నారు. కేవలం డీఎస్సీ పోస్టులు తీసి చేతులు దులుపుతున్నారని, ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న రెండున్నర లక్షల ఉద్యోగాలు తక్షణమే భర్తను చేసి నిరుద్యోగ యువతకు భరోసా కల్పించాలన్నారు.2027 పుష్కరాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సజావుగా జరిగేలా కార్యచరణ రూపొందించాలని అన్నారు.రాజమహేంద్రవరం నగరంలో డ్రైనేజీ, ట్రాఫిక్ తాగునీటి సరఫరా వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కలెక్టర్ అధ్యక్షతన అఖిలపక్ష పార్టీలతో సమావేశం అయి ప్రజల భాగస్వామ్యంతో పుష్కరాలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి పవన్,జువ్వల రాంబాబు,జిల్లా కమిటీ సభ్యులు బి పూర్ణిమరాజు, ఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# ప్రతిభ చాటిన గీత కార్మికుల విద్యార్థులకు స్కాలర్ షిప్పులు పంపిణీ







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం స్థానిక త్యాగరాజు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన పదో తరగతిలో ప్రతిభ చాటిన గీత కార్మికుల విద్యార్థులకు స్కాలర్ షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామా నాయుడు, వాసం శెట్టి సుభాష్, కందుల దుర్గేష్, రాష్ట్ర బీసీ,ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పాల్గొన్నారు. టీడీపీతోనే సామాజిక, ఆర్థిక, రాజకీయ గుర్తింపు లభించిందన్న మంత్రి సవిత. బీసీల విద్యకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్న మంత్రి సవిత ను నిర్వాహకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ సత్తిబాబు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటి గురుమూర్తి, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ రెడ్డి అనంతకుమారి, వివిధ కార్పొరేషన్లకు పలువురు డైరెక్టర్లు, టీడీపీ సీనియర్ నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు, కార్యకర్తలు, భారీగా భారీ సంఖ్యలో గీత కార్మికులు, సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

# మునికూడలి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

## మరో 15 ఏళ్లు కూటమిదే అధికారం : పరిటాల శ్రీరామ్





**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం నియోజకవర్గం, సీతానగరం మండలం, మునికూడలి గ్రామం ఉత్సవ వాతావరణంలో నిండిపోయింది. తెలుగుదేశం పార్టీ (టీడీపీ) వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి పరిటాల శ్రీరామ్ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం (ఎన్.డి.ఎ.) రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉందని, మరో 15 ఏళ్లపాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానిదే అధికారం అని ధీమా వ్యక్తం చేశారు. కూటమి పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం ప్రధాన లక్ష్యంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాజమండ్రి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజానగరం నియోజకవర్గం శాసన సభ్యులు బత్తుల బల రామకృష్ణ గారితో కలిసి, రుడా చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాజనగరం నియోజకవర్గ ఇన్చార్జి & రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి బొబ్బిలంక నుంచి మునికూడలి వరకు భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఒక వ్యక్తి కాదు, ఆయనో చరిత్ర అని, తెలుగు ప్రజల గుండెల్లో ఆయన చిరస్మరణీయంగా నిలిచిపోతారని కొనియాడారు. టీడీపీకి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్టీఆర్ చేసిన సేవలను ఆయన స్మరించుకున్నారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం కూటమి శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని పార్టీ నాయకులు తెలిపారు.

# 'కె -రాంప్' సినిమా ఈనెల 18న దీపావళికి విడుదల..

- సినిమా మాస్, కామెడీ ఎంటర్ టైనర్ అందరికీ నచ్చుతుంది. - అన్నిహంగులున్న వినోదాత్మక చిత్రం 'కె - రాంప్'
- కుటుంబాలతో థియేటర్ కి రప్పిస్తుంది - ఘటోత్కచుడు లాంటి పాత్రలు చేయాలని ఉంది - హీరో కిరణ్ అబ్బవరం





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్ని హంగులతో కూడిన వినోదాత్మక చిత్రంగా 'కె - రాంప్' చిత్రం రూపొందిందని చిత్ర హీరో కిరణ్ అబ్బవరం చెప్పారు. సినిమా ఆద్యంతం స్పీడుగా నడుస్తుందని అందుకే రాంప్ అని పెట్టినట్లు తెలిపారు. హాస్య మూవీస్ పతాకంపై జైన్స్ నాని దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన 'కె -రాంప్' సినిమా ఈనెల 18వ తేదీన దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్ లో భాగంగా రాజమండ్రి వచ్చిన కిరణ్ అబ్బవరం స్థానిక హెూటల్ షెల్టాన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సినిమా టీజర్, ట్రైలర్ కి మంచి స్పందన వచ్చిందన్నారు. యుక్తి తరేజా, నరేష్, సాయికుమార్, అలీ, వెన్నెల కిషోర్, అజయ్ అనన్య, తదితరులు నటించిన ఈ సినిమా మాస్ కామెడీ ఎంటర్ టైనర్ గా అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని కిరణ్ అబ్బవరం చెప్పారు. బాలయ్య సాంగ్‌తో ఎంట్రీ ఉంటుందని ఆయన తెలిపారు. పండగ సీజన్ కావడంతో కుటుంబ సమేతంగా వీక్షించాలనుకునేవాళ్లంతా ఖచ్చితంగా ఈ సినిమాకు వస్తారన్న నమ్మకం ఉందని ఆయన ధీమా వ్యక్తంచేసారు. సినిమాటోగ్రఫీ సతీష్ రెడ్డి, ఎడిటర్ చోటా కె.ప్రసాద్, సంగీతం చైతన్ భరద్వాజ్ సినిమాకు మంచి రెస్పాన్స్ తెచ్చారని తెలిపారు. ఘటోత్కచుడు వంటి పాత్రలతో కూడిన సినిమా చేయాలని ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా కిరణ్ అబ్బవరం తెలిపారు. చెన్నై లవ్, ఉగాది రోజు టైటిల్స్ తో సినిమాలు చేస్తున్నానని మరో మూడు సినిమాలు కూడా చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంత ప్రమోషన్ చేసినా ఈరోజుల్లో ప్రేక్షకులను థియేటర్ కి రప్పించడానికి ఎంత ప్రయత్నించినా రావడం చాల కష్టంగా మారిందని మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.ఓటిటి ఫ్లాట్ ఫారం బాగానే ఉందని చెప్పారు.

# పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రుడా చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జి, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన చేతులు మీదుగా మిర్తిపాడు గ్రామానికి చెందిన వాకలపుడి హనుమంతరావుకు రూ. 1,13,193/-సిగవరం గ్రామానికి చెందిన నాగోతు కృష్ణమూర్తికి రూ. 82,950/-,సంగన వెంకటేశ్వర్లు కు రూ. 56,910/లు,సీతానగరం గ్రామానికి చెందిన పోలిపర్తి బంగారమ్మకు రూ. 43,823/లు, మునికూడలి గ్రామానికి చెందిన ముసలపల్లి మహాలక్ష్మికు రూ. 30,000/- సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

# కల్తీ మద్యం స్కాంపై సిబిఐ ఎంక్వయిరీ వెయ్యాలి

**కల్తీ మద్యం అమ్మకాలు అరికట్టాలి - ఆంధ్రను మద్యంఆంధ్రగా మార్చిన చంద్రబాబు**
**పెదబాబు, చినబాబు, మామూళ్ల కోసం ఎమ్మార్పీ రేట్లు కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు చేస్తున్న సిండికేటు..**
**నకిలీ మద్యం అరికట్టాలని డిమాండ్ చేస్తూ..మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో ఆందోళన**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కల్తీ మద్యం తయారీ అమ్మకాలపై సీబీఐ ఎంక్వయిరీ వెయ్యాలని రాజమండ్రి మాజీ పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు కల్తీ మద్యం అరికట్టాలని కోరుతూ రాజమండ్రి మాజీ పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కటారి నగర్ రామాలయం సెంటర్ కు చేరుకుని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మానవహారం నిర్వహించి,రాస్తారోకో చేశారు.చంద్రబాబు దాహానికి నకిలీ మద్యంతో ప్రజలు ప్రాణాలు బలి, మా కొద్దు బాబు మాకొద్దు ఎన్ బ్రాండ్ మాకొద్దు బాబు, నాణ్యమైన మద్యం అంటే నకిలీ మద్యమా, రాష్ట్రంలో కుటీర పరిశ్రమలాగా నకిలీ మద్యం తయారీ కేంద్రాలు .. అంటూ నినాదాలు చేశారు.చంద్రబాబు చిత్రపటానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు మద్యాభిషేకం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. రాజమండ్రి ప్రకాష్ నగర్ లో ఉన్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపర్డెంట్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ రామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం తయారుచేసి అమ్మకాలు నిర్వహిస్తున్న నకిలీ మద్యం స్కామ్ పై సిబిఐ తో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలను హరిస్తున్న కల్తీ మద్యం అమ్మకాలను అరికట్టాలని కోరారు. కల్తీ మద్యం తయారుచేసి అమ్మకాలు చేస్తు పట్టుబడిన వ్యక్తికి 2024 అసెంబ్లీ ఎన్నికలలో తంబాలపల్లి నియోజకవర్గం పోటీ చేసే విధంగా టిడిపి పార్టీ బి ఫారం ఇచ్చిందని తెలిపారు. టిడిపి నాయకులు కోవర్ట్ లకు బి ఫారం ఇస్తారా అని ప్రశ్నించారు. అతనికి బి ఫోరం ఇవ్వడమే కాకుండా అతని గెలుపు కోసం కోట్లాది రూపాయలు నిధులు కేటాయించారని విమర్శించారు. సిగ్గు లేకుండా వైసిపి పార్టీ కోవర్ట్ లు అని అంటారా ? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీలో ఎంపీలుగా గెలిచిన మాగుంట శ్రీనివాస్ రెడ్డి, వేమూరి ప్రభాకర్ రెడ్డి, లావు శ్రీకృష్ణ దేవరాయలు అనేకమంది తెలుగుదేశం పార్టీలో చేరారని, ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పనిచేస్తున్నారని వారంతా వైసిపి కోర్టులా అని ప్రశ్నించారు. దారుణంగా ప్రజల ప్రాణాలు అంటే కూటమి నాయకులకు లెక్క లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఉంటే ఉంటారు, పోతే పోతారు అనే విధానం తో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నకిలీ మద్యంపై రాష్ట్ర ప్రభుత్వం సిట్ వేసారని, సీట్ ఎందుకు వేశారు, గాడిదలు కాయడానికా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ అమ్మకాలపై సిబిఐ చేత నిజాయితీగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దీని వెనక ఉన్న సూత్రధారులు పాత్రధారులు ఎవరు నిగ్గు తేల్చాలని కోరారు. ఎమ్మార్పీ రేట్లు కంటే లోకేష్, బాబు చంద్రబాబు మామూళ్ళు ను షాపులు వద్ద నుంచే వసూళ్లు చేస్తున్నారని విమర్శించారు. బాటిల్ పై అదనపు ధరలు వసూలు చేసి పేదల నడ్డి విరుస్తున్నారని పేర్కొన్నారు. నకిలీ మద్యం త్రాగడం వలన మృతి చెందిన, అనారోగ్యం పాలైన వారికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.నకిలీ మద్యం వ్యవహారంపై సిబిఐ ఎంక్వయిరీ వెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.

# క్రీడాకారిణికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వితరణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక క్రీడాకారిణికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే సహకారం అందించారు. రాజమహేంద్రి మహిళ కళాశాలలో చదువుతున్న 40వ డివిజన్‌కు చెందిన సున్నం భార్గవి రాష్ట్ర స్థాయి మహిళ క్రికెట్ పోటీలకు ఎంపికైంది. బౌలింగ్ ను అద్భుతంగా చేసే సదరు క్రీడాకారిణి ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది, కనీసం కాళ్లకు సరైన షూ కూడా లేదని సదరు డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఒక జత షూ అందించడంతో పాటు ఆ క్రీడా కారిణికి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని తమ భవానీ ఛారిటబుల్ ట్రస్టు తరపున అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు కావాల్సిన ఫీజులు చెల్లించడం, క్రీడా కారులను ప్రోత్సహించడం తమ ట్రస్టు ఆనవాయితీగా చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, కాశీ నవీన్ కుమార్, యిన్నమూరి దీపు, శెట్టి జగదీష్, మొకమాటి సత్యనారాయణ, మదన్ సింగ్, సింహా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### భగవాన్ శ్రీసత్య సాయిబాబా హైస్కూల్

# పూర్వ విద్యార్థుల భేటీ..

**ఆత్మీయ కుశల ప్రశ్నలతో సందడి - ఆనాటి గురువులకు సత్కారం..**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భగవాన్ శ్రీ సత్య సాయిబాబా హైస్కూల్ పూర్వ విద్యార్థులు స్థానిక నిర్మల గ్రాండ్ ఫంక్షన్ హాలులో భేటీ అయ్యారు. ఆత్మీయ పూరిత వాతావరణంలో జరిగిన ఈ భేటీలో ఒకరినొకరు కుశల ప్రశ్నలతో పలకరించు కున్నారు. పాఠశాలలో 1996-97 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులమైన తాము 28 సంవత్సరాల తరవాత కలుసుకున్నామని నిర్వాకులు రాయుడు, సుధ,మంగ, వాసు ఆనందంతో తెలిపారు. ఈసందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన అప్పటి గురువులను సగౌరవంగా సత్కరించారు. తెలుగు మాస్టర్ శర్మ, డ్రిల్ మాస్టర్ మూర్తి ,సోషల్ టీచర్ ఉదయ లక్ష్మీ జగన్నాధం, విజయ లక్ష్మిలకు మొమెంటోలు అందజేసారు.అనంతరం ఉపాధ్యాయులు వారి స్పందన తెలియజేసి... విద్యార్థులను ఆశీర్వదించారు. రోజంతా పాత మిత్రులతో ఆద్యంతం ఆనంద గా సాగింది. వాసు ఆధ్వర్యంలో సాగిన సంస్కృత కార్యక్రమాలలో ఇప్పటి వయసు నుండి28 సంవత్సరాలు వెనక్కి వెళ్లారు.సుధ, మంగతాయారు వందన సమర్పణ చేశారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి.. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నేత్రదానం

**కావలి, విశ్వం వాయిస్ న్యూస్ :** కావలి పట్టణం వైకుంఠపురానికి చెందిన పాలవల్లి పద్మనాభరెడ్డి (58) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. వీరి నేత్రాలను మాజీ శాసనసభ్యుడు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి సహకారంతో జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ పాలకమండలి ఆధ్వర్యంలో నేత్రదానం చేశారు. మృతుడు పద్మనాభరెడ్డి భార్య పాలవల్లి మాధవి, కుమార్తెలు లిఖిత, తనూజ అంగీకారంతో పద్మనాభ రెడ్డి నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేశారు. పద్మనాభరెడ్డి కార్నియాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. నేత్రదాత కుటుంబసభ్యులకు కావలి రెడ్ క్రాస్ నేత్రదాన విభాగం కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి కృతజ్ఞతలు తెలిపారు. ఇది కావలి రెడ్ క్రాస్ ద్వారా జరిగిన 150వ నేత్రదానమని రెడ్ క్రాస్ ప్రతినిధులు రవిప్రకాష్, కె.హరినారప రెడ్డి తెలిపారు.

### వసతి గృహంలోని బాలికలకు

# సీపీఆర్‌పై అవగాహన..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీపీఆర్ అవగాహన వారోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక కంబాల పేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో ప్రకాశం నగర్ ఎస్టీ బాలికల వసతి గృహంలోని బాలికలకు సీపీఆర్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూహ్య మల్లాది మాట్లాడుతూ అత్యవసర పరిస్థితి లలో ప్రాణాలను రక్షించడానికి ఉపయోగించే ఒక జీవ రక్షక ప్రక్రియ సీపీఆర్( కార్డియో పల్మనరీ రిససెటేషన్) అని,ఈ ప్రక్రియ ద్వారా ఎవరైన ఒక వ్యక్తి గుండె పోటు వల్ల గాని, విద్యుత్ షాక్ వల్ల గాని, నీటిలో మునిగిపోవడం వల్ల గాని శ్వాస లేదా గుండె పనిచేయడం ఆగిపోయినప్పుడు ఈ సీపీఆర్ చేసి ప్రాణాలను రక్షించవచ్చని అన్నారు.ఈ సీపీఆర్ లో వ్యక్తి కి కృత్తిమ శ్వాస ను అందించడం,ఛాతీ పై కుదింపులు చేయడం జరుగుతుందని,దీని ద్వారా మెదడు మరియు ఇతర ముఖ్య అవయవాలకు రక్త ప్రసరణ కొనసాగి వ్యక్తికి ప్రాణాపాయం తప్పుతుందని అన్నారు.సైకాలజిస్ట్ ప్రియాంక బాలికలలో ఇబ్బంది పడే మానసిక ఆరోగ్య పరిస్థితిలపై అవగాహన కల్పించారు.డీపీఎమ్ఓ వీరయ్య లెప్రసీ పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో 262 మంది బాలికలను పరీక్షించి అందులో 125మంది కి సికిల్ సెల్ అనీమియా రక్త పరీక్షలు చేసారు.సూపర్వైజర్ డీడీ భవాని, ఎఎన్ఎమ్ లు,ఆశాలు,హాస్టల్ వార్డెన్ త్రివేణి పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం అమలు చేయాలి

- ఆదివాసీలకు డీఎస్సీ ప్రకటించాలి
- రంపచోడవరం ఐటీడీఏ పీఓ బి.స్మరణ్ రాజుకి వినతి పత్రం అందజేత
- ఆదివాసీ సంఘాలు ఆధ్వర్యంలో రంపచోడవరం ఐటీడీఏ ముట్టడి



**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం తక్షణమే ప్రకటించి ప్రత్యేక ఆదివాసీ డిఎస్సి ప్రకటించాలని, ఆదివాసీ హక్కులు ,చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.సర్మణ్ రాజ్ కి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశామని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లంశేఖర్, డిఎల్ఓ రాష్ట్ర నాయకులు వంతు బాలకృష్ణ, మడి మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు కంగాల శ్రీనివాస్,మడకం బంగారు బాబు, లోతా రామారావు, రాజ్ కుమార్, టి.పద్మ, మద్దేటి అంజిరెడ్డి,సిరిమల్లి రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు అరకులో ఆదివాసీ నిరుద్యోగులకు వందశాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీ నిరుద్యోగులతో భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేసి ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ (టీఏసీ) ద్వారా తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని,ప్రత్యేక ఆదివాసీ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని, ఆదివాసీ ప్రాంతంలో ఉన్న 1/59,1/70చట్టం,పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం, 2013 పోలవరం భూసేకరణ చట్టం మొదలైన హక్కులు,చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని ముందుగా ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ సెంటర్ మీదుగా ర్యాలీగా రంపచోడవరం ఐటీడీఏకు చేరుకొని ఐటీడీఏ ముందు నాలుగు గంటలపాటు ట్రాఫిక్ జామ్ చేసి ఐటిడిఏ ముట్టడి చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జి.లోవ ప్రసాద్, రాజ్ కుమార్, రత్నాకర్, ఎం.సూర్య కుమారి, సిహెచ్.శశి ప్రీతం, కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావు, కోసు లచ్చన్నదొర, కత్రం దాసు, ఎస్.బాబురావు, సిహెచ్.సన్యాసిరెడ్డి, సిహెచ్ విద్యాసాగర్, ఆదివాసీ నిరుద్యోగులు ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువతీ యువకులు, ఆదివాసీ సంఘాల నాయకులు పెసా కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు మొదలైన వారు పాల్గొన్నారు.

# సున్నంబట్టి లేఅవుట్ రోడ్డులో చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలి..

- ఈ మార్గంలో వీధి లైట్లన్ని వెలిగేలా చర్యలు చేపట్టాలి..
- కార్పొరేషన్ పిజిఆర్ఎస్‌లో వినతిపత్రం అందచేసిన బర్రే కొండబాబు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్వారీ ప్రాంతం సింహాచల నగర్ సమీపంలోని సున్నంబట్టి లే అవుట్ రోడ్డులో చెత్త చెదారం వేస్తుండడంతో అక్కడ మరో డంపింగ్ యార్డు మాదిరిగా ఉందని రాజమండ్రి నగరపాలకసంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఎవరూ చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఉదయం నగరపాలకసంస్థలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బర్రే కొండబాబు మాట్లాడుతూ క్వారీ ప్రాంతం సున్నంబట్టి నుంచి లే అవుట్ కు వెళ్లే రోడ్ మార్గంలో పంచాయతీ నుంచో లేదా మున్సిపాలిటీ నుంచో తీసుకు వచ్చిన చెత్త అక్కడ వేస్తుండడంతో ఈ ప్రాంతంలో దుర్గంధం వస్తూ ఆ ప్రాంతం చాలా దారుణంగా మారుతోందని, దీంతో స్థానిక నివాస గృహాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ రోడ్డులో ఉన్న వీధిలైట్లు కొన్ని వెలగడం లేదని దీంతో రాత్రి సమయంలో ఈ మార్గంలో చీకటి రాజ్యమేలుతూ ప్రమాదాలకు నిలయంగా మారుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మిగతావి పగలు కూడా వెలుగుతున్నాయని అదనపు కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్ళారు.అక్కడి ట్రాన్స్ ఫారం మార్చి అన్ని లైట్లు రాత్రిపూట వెలిగేలా చేయాలని బర్రే కొండబాబు విజ్ఞప్తి చేశారు.దీనికి స్పందించిన అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ లైట్లన్ని వెలిగే విధంగా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ ఎలక్ట్రికల్ విభాగం అధికారులను ఆదేశించారు.అక్కడ చెత్త వేయకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.బర్రే కొండబాబు వెంట బూతి సత్తిబాబు, జె.లక్ష్మినారాయణ,దడాల సూరిబాబు పాల్గొన్నారు.

# విజయవంతమైన యానిమేషన్ పిక్సెల్ ఈవెంట్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలో ఉన్న,ఆదిత్య డిగ్రీ కళాశాలలోని యానిమేషన్ విభాగంలో ప్రిన్సిపాల్ ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పిక్సెల్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నా రాజమండ్రి పాయింట్ ఆఫ్ వ్యూకు చెందిన ముఖ్య అతిథిలుగా ఇన్ఫులెన్సర్స్ రాజేష్ ఖన్నా, మౌనిక, కృష్ణ, హేమ, చిరాగ్ లు పాల్గొన్నారు. నరుటో అంశం మీద యానిమేషన్ క్లాస్ మొత్తము పెయింటింగ్ వేయడం జరిగింది. తదుపరి విద్యుత్ సంబంధించిన కొన్ని ఆటలను పెట్టి విజేతలను ప్రకటించడం జరిగింది. సింద్రెల్లా అంశం మీద స్టాల్స్ ఆటలు పెట్టి,సిండ్రిల్లా బొమ్మలు తయారు చేశారు. మినియేచర్ కార్యక్రమంలో వారు అనుకున్న భావనలను ఆలోచనలను చిత్రాలుగా రూపొందించడం జరిగింది.హల్విన్ అంతసేపుతో కొన్ని దయ్యాలు భూతాలు, బొమ్మలను తయారుచేసి పెట్టడంలో నైపుణ్యం సంపాదించారు. ఈ కార్యక్రమానికి యానిమేషన్ ల్యాబ్ టెక్నీషియన్ మహాలక్ష్మి సహకరించారు. యానిమేషన్ విభాగంలో ఇంత అద్భుతంగా తయారుచేసి పలువురి ఆకర్షించినందుకు ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ డా.ఎన్.సుగుణా రెడ్డి విద్యార్థులందరినీ అభినందిస్తూ తమ శుభాకాంక్షలు తెలియజేశారు.



### ఎంపిక చేసిన గ్రామాలలో

## పీఎం ఆదర్శ్ గ్రామ యోజన పనులను పూర్తి చేయాలి

### కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన రెండు దశలలో ఎంపిక చేసిన గ్రామాలలో అభివృద్ధి ప్రణాళికలు రచించి అభివృద్ధి పనుల ను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ సంబం ధిత గ్రామీణాభివృద్ధి అధికా రులను ఆదేశించారు. సో మవారం స్థానిక కలెక్టరేట్ నందు పీఎంఏజీవై పథక అమలు తీరుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన గ్రామీణ అభివృద్ధి పథకమని తద్వారా ఎస్సీ ఎస్టీ గ్రామాల అభివృద్ధికి పాటు పడాలన్నారు. కోనసీమ జిల్లాలో మొదటి దశలో 19 గ్రామా లను రెండవ దశలో 34 గ్రామాలను వెరసి 53 గ్రామాలను ఈ యొక్క పథకానికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇప్పటివ రకు 13 గ్రామాలను ఆదర్శ గ్రామా లుగా ప్రకటించడం జరిగిం దన్నారు. మరో 40 గ్రామాలను ప్రకటించాల్సిఉందన్నారు. వీటిలో 20 గ్రామాలకు గ్రామీణ అభివృద్ధి కార్యా చరణ ప్రణాళి కలను జిల్లా స్థాయి సమన్వయ కమిటీ ఫైనలైజ్ చేసిందని తెలి పారు ఈ పథకం ప్రధానంగా షెడ్యూ ల్డ్ కులాల అధిక జనాభా కలిగిన గ్రామాలను లక్ష్యం గా చేసుకుని వాటిని సమగ్ర అభివృద్ధి చేసేందుకు రూ పొందించబడిందన్నారు. ఎస్సీ మెజారిటీ గ్రామాల సమగ్ర అభివృద్ధి, కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల అనేక పథకాలను ఏకీకృతం చేసి నిర్వహించడం ప్రధాన లక్ష్యం కావాలన్నారు. ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, ఆర్థిక అభివృద్ధి, కనెక్టివిటీ, పారిశుద్ధ్యం లాంటి బేసిక్ రంగాల్లో అంతరాలను తగ్గించడం పై దృష్టి పెట్టాల న్నారు గ్రామాల్లో రోడ్లు, విద్యుత్, తాగునీరు, ఆరోగ్య కేంద్రాలు, స్కూళ్లు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, స్వచ్ఛత, పెన్షన్, గృహ నిర్మా ణాలు వంటి అనేక రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. నిధుల వినియోగాన్ని పథకాల సమన్వయంతో, పంచాయితీ రాజ్ సంస్థలు, జిల్లా స్థాయి కమిటీల పర్యవేక్షణతో పటి ష్టంగా అమలు చేయాలన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో అభి వృద్ధి పనులను ప్లాన్ చేసి, ప్రభా వవంతంగా మౌలిక సదు పాయాలు కల్పించాలన్నారు, గ్రామ అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసి. గ్రామీణ ప్రాం తాల్లో అభివృ ద్ధి,సమానత, సామాజిక న్యాయం సాధించ దానికి ప్రధానంగా నిర్దేశించార న్నారు. కేంద్ర ప్రభుత్వ పరిపా లనా సంస్కరణల్లో ముఖ్యమైన పథకమన్నారు కింద ఎంపీలు తమ నియోజకవర్గాలలో ఉన్న గ్రామా లను ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేయడానికి దశల వారీగా బాధ్యత తీసుకోవాల న్నారు.గ్రామాల్లో సామాజిక, ఆర్థిక మౌలిక సదుపాయాలను మెరు గుపరచడం.సమగ్ర గ్రామా భివృద్ధి ద్వారా మానవాభి వృద్ధి సాధించాలని గ్రామాలను మోడ ల్‌గా అభివృద్ధి చేసి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిల పాలన్నారు.ఎంపీ లార్డ్స్ సి ఎస్ ఆర్ నిధులు ఇతర గవర్నమెంట్ స్కీమ్స్ నిధులు వినియో గించ వచ్చునన్నారు గ్రామ స్థాయిలో కమిటీలు అభి వృద్ధికి పట్టం కట్టాల న్నారు గ్రామాల్లో జీవన ప్రమాణా ల్లో పెరుగుదల యువతలో అవకాశాల పెంపు, సామాజిక సమగ్రత డిజిటల్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ గ్రామాభివృద్ధి మోడల్ గా తీర్చిదిద్దాలన్నా రు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధి కారత అధికారి పి జ్యోతి లక్ష్మి దేవి పంచాయ తీరాజ్ గ్రామీణాభివృద్ధి, రహదా రులు మరియు భవనాలు డ్వా మా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'పది' ఫలితాలపై ప్రణాళిక అవసరం


### ఫలితాల్లో మొదటి స్థానంలో నిలిచే విధంగా కృషి చేయాలి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పదవ తరగతి ఫలితాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా, సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీలు దిశానిర్దేశం చేశారు. అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌లతో డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఈవో సలీంబాషా, ఏపీసీ మమ్మీలు మాట్లాడుతూ గతేడాది ఫలితాలను మంచి మరింత మెరుగైన ఫలితాలను సాధించాలన్నారు. గతేడాది పది ఫలితాల్లో డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ ఏడాది మొదటి స్థానంలో నిలిచే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీ,డీ గ్రేడ్ విద్యార్థులను ఏ,బీ విద్యార్థులతో సమానంగా రాణించే విధంగా ప్రయత్నించాలన్నారు. సెల్ఫ్ అసెస్మెంట్%-%1, 2 పరీక్షల ఆధారంగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేసుకుని, అందుకనుగుణంగా వారిని తీర్చిదిద్దాలన్నారు. సబ్జెక్టుల వారీగా పదవ తరగతి విద్యార్థులను ఏ విధంగా తయారు చేయాలో సబ్జెక్టు ఎక్స్‌పెర్ట్స్ చూడాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా స్టడీ మెటీరియల్‌ను రూపొందించాలన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ ఇచ్చే స్టడీ మెటీరియల్‌కు అదనంగా జిల్లా స్థాయిలో సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్ ఇచ్చే స్టడీ మెటీరియల్ అదనపు సమాచారం ఇచ్చే విధంగా ఉండాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను తప్పనిసరిగా నిర్వహించాలని, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. డీసీఈబీ సెక్రటరీ హనుమంతరావు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు సమయం ఆసన్నమవుతుందన్నారు. సబ్జెక్టు ఫోరమ్స్ స్టడీ మెటీరియల్ తయారీలో కీలకపాత్ర పోషించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో సుమారుగా 18వేల మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఈశ్వరరావు, సమగ్ర శిక్షా ఏఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పి.రాంబాబు, జీసీడీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, తెలుగు, ఇంగ్లీషు, హిందీ, గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్ పాల్గొన్నారు.

### 13వ వార్షిక బ్రహ్మోత్సవములు భాగంగా

## నాల్గవ రోజు సింహవాహన సేవ




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ భూ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో 13వ వార్షిక బ్రహ్మోత్సవములు 4వ రోజు శనివారం వరకు అంగరంగ వైభవంగా జరుగుచున్నవి. ఉదయం 9:05 నిమిషాలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము, అష్టకళశారాధన, మహా స్నపనము, ప్రధాన హోమములు, జగత్ కళ్యాణ నిమిత్తం శ్రీ శ్రీనివాస కళ్యాణం దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ. సాయంత్రం స్వస్తి వచనము, ప్రధాన హోమములు, విశేషార్చన, చతుర్వేద స్వస్తి, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ. రాత్రి యోగ నారసింహ అలంకరణలో సింహవాహన సేవ మొదలగు కార్యక్రమములు అత్యంత వైభవంగా జరిగినవి అని ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు స్వామి, అమ్మవార్లకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తరపున పట్టు వస్త్రాలను సమర్పించారు.

# అమరావతి రాజధానికి తొలి శాశ్వతం



మరో వైపు చూస్తే అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించి ఒక రూపు వచ్చేందుకు సీఆర్డీయే ప్రారంభం ఒక అవకాశంగా మారుతుందని అంటున్నారు. విభజన ఏపీకి రాజధాని లేదన్నది తెలిసిందే. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అమరావతి రాజధానిని ప్రకటించారు. భారీ ఎత్తున భూ సేకరణ జరిగింది. ఏకంగా 33 వేల ఎకరాలను రైతుల నుంచి భూ సమీకరణ ద్వారా ప్రభుత్వం తీసుకుంది. 2019 నాటికి తాత్కాలిక సెక్రటేరియట్, అసెంబ్లీ హైకోర్టు వంటివి తయారయ్యాయి. ఈలోగా టీడీపీ ప్రభుత్వం అధికారంలో నుంచి దిగిపోయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి మీద పెద్దగా దృష్టి పెట్టలేదు, పైగా మూడు రాజధానులు అంటూ కొత్త నినాదం అందుకుంది. అలా అయిదేళ్ళూ కాలక్షేపం అయిపోయాయి. ఈసారి తిరిగి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దాంతో అమరావతి రాజధాని పనులు కూడా జోరందుకున్నాయి. తొలి అడుగు పడినట్లేనా : అమరావతిలో తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ సీఆర్డీయే కొత్త ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. అమరావతికి సంబంధించి ఇది తొలి శాశ్వత భవనంగా చెప్పుకోవాల్సి ఉంటుంది. అమరావతిలో ఇప్పటికే కట్టడాలు కొన్ని ఉన్నా అవన్నీ తాత్కాలికమే అని గత ప్రభుత్వం చెప్పిన నేపథ్యం ఉందిఅధికారంలోకి వచ్చిన పదహారు నెలల వ్యవధిలోనే ఒక భారీ పర్మనెంట్ నిర్మాణం పూర్తి అయి ప్రారంభం కావడం మాత్రం ఒక విధంగా అమరావతి రాజధానికి సంబంధించి కీలక పరిణామంగానే చూస్తున్నారు. దాంతో ఈ విధంగా అమరావతి విషయంలో కూటమి ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుంది అని అంటున్నారు. రూపునకు వచ్చినట్లే : మరో వైపు చూస్తే అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించి ఒక రూపు వచ్చేందుకు సీఆర్డీయే ప్రారంభం ఒక అవకాశంగా మారుతుందని అంటున్నారు. ఇదే వరసలో రానున్న రోజులలో మరిన్ని శాశ్వత నిర్మాణాలు కూడా అమరావతిలో చోటు చేసుకునే అవకాశం ఉందని అంటున్నారు కొత్త ఏడాది అంటే 2026 నాటికి అమరావతిలో ఉద్యోగుల భవనాలు కూడా పూర్తి అయి ప్రారంభానికి సిద్ధం అవుతాయని అంటున్నారు. అంటే 2026 మొదటికే అమరావాతిలో యాక్టివిటీ అయితే పెద్ద ఎత్తున మొదలవుతుందని అంచనా వేస్తున్నారు. ధీమా పెరిగిందా : ఇక అమరావతి రైతులలో ధీమా పెరిగింది అని అంటున్నారు ఎందుకంటే వారి భూములను తీసుకున్న తరువాత ఏమి జరిగింది అంటె ఆ మధ్య దాకా పెద్దగా ఎవరూ జవాబు చెప్పలేని పరిస్థితి. ఇపుడు మాత్రం వరసబెట్టి ప్రారంభోత్సవాలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అంతే కాదు ఒక నిర్దిష్ట కాల పరిమితి పెట్టుకుని అమరావతి రాజధానిని సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు దిశా నిర్దేశం చేసింది. అంతే కాకుండా అమరావతి రైతుల సమస్యలను పరిష్కరించే బాధ్యతలను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అలాగే రాష్ట్ర మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ లకు అప్పగించారు ఆ తరువాత తాను కూడా రైతులతో సమావేశం అయి వారి సమస్యలు అనీ పరిష్కరిస్తాను అన్నారు. ఈ రకమైన భరోసా దొరకడంతో రైతులు కూడా ఆనందంగా ఉన్నారు. హైలెట్ అయిన ఫోటో : అమరావతిలో ఏముంది అన్న వారికి జవాబుగా చంద్రబాబు సీఆర్డీఏ భవనం ప్రారంభించిన అనంతరం ఆ భవనం ఎదురుగా ఫోటోని తీసుకున్నారు. అమరావతి రాజధాని ఇదిగో అభివృద్ధి ఇదిగో అని ఆయన అందరికీ తెలియచేస్తున్నట్లుగా ఈ ఫోటో ఉంది దంతో రానున్న రోజులలో అమరావతికి వెలుగులు రావడం తధ్యమని అంతా భావిస్తున్నారు.

# చంద్రబాబు మరో రికార్డు.. సీఎంగా 15 ఏళ్లు!!



ఉమ్మడి రాష్ట్రమైనా, ప్రస్తుత విభజిత రాష్ట్రమైనా చంద్రబాబునాయుడు మాత్రమే అత్యధిక కాలం సీఎంగా కొనసాగగలిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మరో రికార్డు సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అత్యధికాలం ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు.. విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి రికార్డు తనే సొంతం చేసుకున్నారు. ఇక తాజాగా 15 ఏళ్లు సీఎంగా పనిచేసిన తొలి తెలుగు నాయకుడిగా అవతరించారు. అంతేకాదు దక్షిణాదిలో అత్యధికాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన కరుణానిధి, రంగస్వామి సరసన చేరారు. తెలుగు నేలపై జన్మించిన ఏ నాయకుడు 15 ఏళ్ల పాటు సీఎంగా కొనసాగకపోవడం విశేషం. ప్రస్తుతానికి ఈ ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కింది. ఉమ్మడి రాష్ట్రమైనా, ప్రస్తుత విభజిత రాష్ట్రమైనా చంద్రబాబునాయుడు మాత్రమే అత్యధిక కాలం సీఎంగా కొనసాగగలిగారు. 1995 సెప్టెంబరు 1న తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న చంద్రబాబు, 1999లో జరిగిన ఎన్నికల్లో వరుసగా రెండోసారి గెలిచి సీఎం గా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత 2004లో చంద్రబాబు పదవీకాలం పూర్తవగా అప్పట్లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయి సీఎం పీఠం వదులుకోవాల్సివచ్చింది. అయితే 2014లో రాష్ట్ర విభజన తర్వాత మరోసారి చంద్రబాబు నాయకత్వాన్ని ఏపీ ప్రజలు కోరుకున్నారు. అదేవిధంగా గత ఏడాది జరిగిన ఎన్నికల్లోనూ ఘన విజయం కట్టబెట్టారు. ఇలా నాలుగుసార్లు సీఎం అయిన చంద్రబాబు ఈ రోజుతో సీఎంగా 15 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ విడతలో ఇంకా సమయం ఉండటంతో ఆయన సీఎంగా 19 ఏళ్లు పనిచేసే అవకాశం ఉంది. అతిసామాన్య కుటుంబం నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన చంద్రబాబు.. తెలుగునేలపై ఏ నేత సాధించని అరుదైన విజయాలు అందుకున్నారు. రాష్ట్రానికి కష్టం వచ్చినప్పుడు చంద్రబాబు మాత్రమే గట్టెక్కించగలరని నమ్మకాన్ని చూరగొన్నారు. అందుకే 2014లో ఒకసారి, గత ఏడాది రెండోసారి సీఎంగా చంద్రబాబు గెలిచారని విశ్లేషిస్తున్నారు. ఇక దేశంలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారు ఎందో ఉన్నప్పటికీ ఈ ఘనత సాధించిన వారిలో దక్షిణాది నేతలు తక్కువనే చెప్పాలి. ద్రవిడ నాట కరుణానిధి, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో రంగస్వామి మాత్రమే 15 ఏళ్లకు పైబడి ముఖ్యమంత్రులుగా పనిచేశారు. ఎంజీ రామచంద్రన్, ఈకే నయనార్, జయలలిత, రామక్రిష్ణ హెగ్డే, ఎన్టీఆర్ వంటి మహామహులకు కూడా ఇంతటి అవకాశం దక్కలేదని చెబుతున్నారు. ఇక తెలుగు నేలపై ముఖ్యమంత్రులు అయిన వారిలో అత్యధికాలం పనిచేసిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు రికార్డు ఇప్పట్లో ఎవరూ చేరుకునే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. ఈ రోజుతో 15 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న చంద్రబాబు తర్వాత ఎక్కువ కాలం పనిచేసిన తెలుగు వారిలో కాసు బ్రహ్మానందరెడ్డి రెండోస్థానంలో ఉన్నారు. ఆయన ఏడేళ్ల 21 రోజులు సీఎంగా పనిచేశారు. మూడో స్థానంలో ఎన్టీఆర్ నిలిచారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడుగా పార్టీ పెట్టిన 9 నెలల్లోనే చారిత్రక విజయాన్నిఅందుకున్న ఎన్టీఆర్ మూడు విడతల్లో కలిపి 7 ఏళ్ల 194 రోజులు సీఎంగా ఉన్నారు. నాలుగో స్థానంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 5 ఏళ్ల 111 రోజులు, ఐదో స్థానంలో నీలం సంజీవరెడ్డి 5 ఏళ్ల 51 రోజులు సీఎంగా కొనసాగారు.

# రేవంత్ రెడ్డికి అగ్ని పరీక్ష.. ఇటు జూబ్లీహిల్స్.. అటు స్థానికం!



తెలంగాణలో ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలిసారిగా అగ్ని పరీక్షను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు స్థానిక ఎన్నికలు, మరోవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ఎదుర్కోవాల్సిరావడం రేవంత్ రెడ్డికి నిజమైన సవాల్ గా చెబుతున్నారు. ఈ రెండింటిలోనూ పార్టీని విజయతీరాలకు చేర్చడం సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత. ఈ విజయాలే ఆయన భవిష్యత్తును నిర్దేశించనుండటంతో గెలిచి తన నాయకత్వానికి తిరుగులేదని నిరూపించుకోవాల్సివుంటుందని అంటున్నారు. అంతేకాకుండా ఈ రెండు ఎన్నికల ఫలితాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రెఫరెండంగానూ చూస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న రేవంత్ రెడ్డి సుమారు రెండేళ్లుగా అనేక సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. అదే సమయంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన కొన్ని హామీలను అమలు చేయలేక దిక్కులు చూస్తున్నారని విపక్షాలు పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నాయి. అంతేకాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటను ఆయన మంత్రివర్గ సహచరులు లెక్క చేయడం లేదని, పేరుకే ఆయన ముఖ్యమంత్రి అని కీలక శాఖలపై పర్యవేక్షణ అధికారం లేకుండా కాంగ్రెస్ అధిష్టానం కత్తెర వేసిందని కూడా సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వంలో తానే సుప్రీం పవర్ అని నిరూపించుకోవడం సీఎం రేవంత్ రెడ్డికి అత్యావసరంగా చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికతోపాటు స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించి ప్రజల్లో తనపై పరపతి చెక్కుచెదరలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరూపించుకోవాల్సివుంటుంది. అయితే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక సవాళ్లు ఎదుర్కొన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా స్థానిక ఎన్నికలను ఇన్నాళ్లు వాయిదా వేసుకుంటూ వచ్చారు. ప్రభుత్వం వచ్చిన కొద్దిరోజులకే స్థానిక ఎన్నికలను నిర్వహించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి కొన్నాళ్లు సమయం తీసుకోడానికి వాయిదా వేశారు. అలా ఏడాదిన్నర అయిపోయింది. ఇక ఇప్పుడు ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుని పార్టీ మరింత బలపడిందని చాటుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. ఇదే సమయంలో ఊహించని విపత్తులా వచ్చిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కూడా కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఒత్తిడి పెంచుతోందని అంటున్నారు. దీంతో ఈ నెలలో జరిగే స్థానిక ఎన్నికలు, వచ్చే ఎన్నికల్లో జరిగే పంచాయతీ పోరు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అగ్నిపరీక్షగా చెబుతున్నారు. గత ఎన్నికల్లో హైదరాబాదు నగరంలో కాంగ్రెస్ ఒక్కస్థానం కూడా దక్కించుకోలేకపోయింది. ఎన్నికల తర్వాత జరిగిన కంటోన్మెంట్ ఎన్నికల్లోనే ఖాతా తెరిచింది. ఇక గ్రేటర్ ఎన్నికల ముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిస్తే నగరంపైనా కాంగ్రెస్ జెండా ఎగరవేయొచ్చని సీఎం భావిస్తున్నారు. దీంతో జూబ్లీహిల్స్ ను ఎట్టిపరిస్థితుల్లో కైవసం చేసుకోవాలని సీఎం పావులు కదుపుతున్నారు. మొత్తానికి ఒకేసారి ఎదురైన ఎన్నికల్లో గెలవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ గా మారిందని అంటున్నారు.

# గుజరాత్‌లో ఆర్థిక పారదర్శకత సున్నా

హైదరాబాద్

దేశంలోని ఇతర రాష్ట్రాలకు గుజరాత్ 'రోల్ మాడల్' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ తరుచూ వల్లె వేస్తారు. అయితే, గుజరాత్ మాడల్.. ఓ మేడి పండు అని ఇప్పటికే పలు ప్రగతిశీల సూచీలు తేటతెల్లం చేశాయి. ఇప్పుడు ఆ రాష్ట్రంలో భారీఎత్తున నిధులు గోల్‌మాల్ అయినట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుజరాత్‌లోని 8 మునిసిపల్ కార్పొరేషన్లలో నిధుల వ్యయానికి సంబంధించిన లెక్కల్లో స్పష్టత కొరవడింది. నిధుల ఖర్చులో ఆర్థిక పారదర్శకత, వ్యవస్థాగత నిర్లక్ష్యం, ఉల్లంఘనలు జరిగినట్టు తెలిసింది. గడిచిన ఏడేండ్లుగా ఆయా మునిసిపాలిటీల్లో ఆడిటింగ్ అనేదే జరుగలేదని తేలింది. ఈ మేరకు హక్కుల కార్యకర్త, ప్రొఫెసర్ హేమంత్ కుమార్ షా సమాచారహక్కు చట్టం ద్వారా అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం స్పందించింది.

**అసలేం జరిగింది?**

ప్రజలు చెల్లించే పన్నులతో మునిసిపల్ కార్పొరేషన్లు నగరాభివృద్ధి పనులను చేస్తాయి. అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేసిన ప్రతీ పైసాను అధికారులు రికార్డుల్లో నమోదు చేయాలి. ఈ వ్యయం సక్రమంగా జరిగిందా? లేదా? అని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) లేదా లోకల్ ఫండ్ ఆడిట్ ఆఫీసు అధికారులు ప్రతీ ఏటా ఆడిటింగ్ నిర్వహించాలి. అప్పుడే పౌరులు కట్టిన ప్రతీ రూపాయికి జవాబుదారీతనం ఉంటుంది. అయితే, గుజరాత్‌లోని అహ్మదాబాద్, గాంధీనగర్, రాజ్‌కోట్, జామ్‌నగర్, భావ్‌నగర్, జునాగఢ్, సూరత్, వడోదరా మునిసిపల్ కార్పొరేషన్లలో గడిచిన కొన్నేండ్లుగా ఆడిటింగ్ ప్రక్రియ జరుగట్లేదు. దీంతో ఈ కాలంలో ఖర్చు చేసిన రూ. 2 లక్షల కోట్ల ప్రజాధనం ఎందుకు? ఏయే పనులకు? ఖర్చు చేశారన్న విషయంలో స్పష్టత కొరవడింది.



**ఎలా బయటపడింది?**

మునిసిపల్ కార్పొరేషన్ల నిధుల ఖర్చుకు సంబంధించి సాధారణంగా ప్రతీఏటా అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం కాగ్ నివేదికను ప్రవేశ పెట్టాల్సి ఉంటుంది. అయితే, గత కొన్నేండ్లుగా ఇది జరుగట్లేదు. దీంతో హక్కుల కార్యకర్త హేమంత్ కుమార్ షా సమాచారహక్కు చట్టం ద్వారా ఈ మేరకు ప్రశ్నించారు. హేమంత్ ప్రశ్నకు స్పందించిన సంబంధిత అధికారులు.. అహ్మదాబాద్, సూరత్, వడోదర మునిసిపాలిటీలో గడిచిన ఏడేండ్లుగా, రాజ్‌కోట్‌లో గడిచిన ఆరేండ్లుగా, జామ్‌నగర్, భావ్‌నగర్‌లో ఐదేండ్లుగా, గాంధీనగర్, జునాగఢ్ మునిసిపాలిటీలో గడిచిన నాలుగేండ్లుగా ఆడిటింగ్ నిర్వహించలేదని జవాబిచ్చారు. అంటే, ప్రభుత్వం ఇచ్చిన సమాధానం ప్రకారం.. ఈ వ్యవధిలో ఖర్చు చేసిన దాదాపు రూ. 2 లక్షల కోట్ల నిధులు పారదర్శకంగా ఖర్చు చేశారో లేదో తెలియదన్నమాట. దీంతో నెటిజన్లు గుజరాత్ మాడల్‌పై విమర్శలు వ్యక్తం చేశారు. గుజరాత్ రోల్ మాడల్ కాదు.. లూట్ మాడల్ అంటూ మండిపడ్డారు.

## భూటాన్ వల్లే బెంగాల్‌లో వరదలు..

# పరిహారం చెల్లించాలి

ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో భారీ వరదలు బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే జల్‌పాయిగుడీ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక, పునరావాస చర్యలను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూటాన్ నుంచి వెల్లువెత్తిన జలప్రవాహం కారణంగానే వరదలు సంభవించాయని ఆరోపించారు. జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. "భూటాన్ నుంచి ముంచుకొచ్చిన నదీ జలాల కారణంగానే మాకు నష్టం జరిగింది. ఆ దేశం పరిహారం చెల్లించాలి" అని సీఎం మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే అన్ని సహాయక, పునరావాస చర్యలు చేపడుతోందన్నారు. కేంద్రం తరఫున ఎటువంటి ఆర్థిక సాయం లేదని ఆరోపించారు. భారత్–భూటాన్ ఉమ్మడి నదీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, అందులో పశ్చిమ బెంగాల్ (సెవోక్ దీవఅన్నుశ్రీ చీవంశ%)ను భాగం చేయాలని తమ ప్రభుత్వం చాలా కాలంగా డిమాండ్ చేస్తోందన్నారు. తమ ఒత్తిడితో ఈ నెల 16న కేంద్రం ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసిందని, దీనికి రాష్ట్ర అధికారులు హాజరవుతారని వెల్లడించారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్, జల్‌పాయిగుడీ తదితర ప్రాంతాల్లో వర్షాలు బీభత్సం సృష్టించాయి.



భారీ స్థాయిలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో దాదాపు 32 మంది మృతి చెందారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. నేపాల్, భూటాన్‌లోనూ ఎడతెరిపిలేని వర్షాలతో నష్టం వాటిల్లింది. ఈ వరదలు, వాటి వల్ల జరిగిన విధ్వంసానికి మానవ తప్పిదమే కారణమని దీదీ ఇటీవల ఆరోపించారు. వరద ప్రభావిత ప్రాంతాలను ఆమె సందర్శించడం ఇది రెండోసారి.

## ప్రపంచానికి మరింత మంది ట్రంప్‌లు కావాలి

ఇజ్రాయెల్ హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడంలో కీలక పాత్ర పోషించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు బెంజమిన్ నెతన్యాహు సర్కారు ఘనంగా కృతజ్ఞతలు తెలిపింది. ఇజ్రాయెల్ చట్టసభ కనేసెట్ ఆయనకు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చింది. ప్రపంచానికి ట్రంప్ లాంటి వారు మరింత మంది కావాలని ఆకాంక్షించింది. వచ్చే ఏడాది ఆయన పేరును నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదిస్తామని తెలిపింది. ట్రంప్ సోమవారం ఇజ్రాయెల్‌లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ దేశ ప్రధాని నెతన్యాహుతో కలిసి జెరూసలెంలోని చట్టసభకు వెళ్లారు. అక్కడ ఇజ్రాయెల్ చట్టసభ్యులు అగ్రరాజ్య అధ్యక్షుడికి ఘన స్వాగతం పలికారు. కాల్పులు ఒప్పందం చేసినందుకు గానూ.. రెండున్నర నిమిషాలు పాటు లేచి నిలబడి చప్పట్లతో కృతజ్ఞతలు తెలియజేశారు.

**శాంతి బహుమతికి ట్రంప్ పేరు..**

అనంతరం స్పీకర్ అమిర్ ఒహానా మాట్లాడుతూ.. బందీల విడుదలకు కృషి చేసిన ట్రంప్‌ను యూదు ప్రజలు వేల సంవత్సరాల పాటు గుర్తుంచుకుంటారని కొనియాడారు. శాంతి స్థాపన కోసం ఆయన చేస్తున్నంతగా ఎవరూ చేయడం లేదని అన్నారు. దృఢ సంకల్పం, ధైర్యం ఉన్న ట్రంప్ లాంటి నేతలు ప్రపంచానికి మరింతమంది కావాలని అభిప్రాయపడ్డారు. నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ కంటే అర్హులు ఇంకెవరూ లేరని తెలిపారు. వచ్చే ఏడాది నోబెల్ పురస్కారం కోసం అన్ని దేశాలు ట్రంప్ పేరు ప్రతిపాదించేలా తాము కృషి చేస్తామన్నారు.

**ప్రపంచాన్ని కదిలించిన వ్యక్తి ట్రంప్**

అనంతరం నెతన్యాహు ప్రసంగిస్తూ ట్రంప్‌పై ప్రశంసలు కురిపించారు. ప్రపంచాన్ని ఇంత వేగంగా, దృఢనిశ్చయంతో కదిలించిన ట్రంప్ లాంటి వ్యక్తిని ఇంతవరకూ చూడలేదన్నారు. యుద్ధం ముగిసేలా గాజా ఒప్పందం చేసిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. శాంతి స్థాపన కోసం తాము కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. ట్రంప్ తప్పకుండా నోబెల్ శాంతి బహుమతి సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.



**బహుమతిగా బంగారు పావురం**

అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ట్రంప్ కొంతసేపు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడికి నెతన్యాహు అపురూప కానుక ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి స్థాపన కోసం పాటుపడుతున్న ట్రంప్‌కు బంగారు పావురాన్ని బహుమతిగా అందజేశారు. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా హమాస్ తమ చెరలో ఉన్న బందీలను సోమవారం విడిచిపెట్టింది. ఇందుకు ప్రతిగా పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. ఇక, రెండో దశ కాల్పుల విరమణ చర్చల కోసం ఈజిప్టులో చర్చలు జరుగనున్నాయి. ఇందుకు నెతన్యాహుకు ఆహ్వానం లభించగా.. ముందస్తు కార్యక్రమాల దృష్ట్యా ఆయన హాజరుకావట్లేదు. ఈ చర్చల్లో ట్రంప్ పాల్గొననున్నారు.

## రెండో జాబితా విడుదల చేసిన పీకే..

బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ జన్ సురాజ్ పార్టీ అధ్యక్షుడు, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఆ పార్టీ మరో 65 మంది అభ్యర్థుల పేర్లతో రెండో జాబితాను విడుదల చేశారు. అయితే ఆయన ఏ స్థానం నుంచి పోటీ చేస్తారనే విషయంలో మాత్రం ఇంకా సస్పెన్స్ కొనసాగుతున్నది. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌పై బరిలో దిగనున్న రాఘోపూర్ నుంచి పోటీ చేస్తానని గతంలో పీకే ప్రకటించారు. అయితే ఇప్పటికే తన పార్టీ అభ్యర్థులతో రెండు జాబితాలు ప్రకటించిన ఆయన.. రాఘోపూర్ స్థానాన్ని మాత్రం ఇంకా ఏ జాబితాలో పెట్టలేదు. దాంతో ఆయన రాజకీయ వర్గాల్లో ఊహాగానాలకు తెరలేపారు. పీకే నిజంగా రాఘోపూర్ నుంచి బరిలో దిగుతారా..? లేదంటే అది ఆయన ఎన్నికల వ్యూహంలో భాగమా..? అని పలువురు చర్చించుకుంటున్నారు. జన్ సురాజ్ పార్టీ ఈరోజు 65 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను విడుదల చేసింది. సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తూ, అన్ని వర్గాలకు అవకాశం కల్పించినట్లు పార్టీ వెల్లడించింది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ఒకప్పుడు కంచుకోటగా ఉన్న హర్నాట్ స్థానం నుంచి కమలేశ్ పాశ్వాన్ అనే ఎస్సీ అభ్యర్థిని బరిలోకి దింపింది. ఈ సందర్భంగా పీకే మాట్లాడుతూ.. రెండో జాబితాతో కలిపి ఇప్పటివరకు మొత్తం 116 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లు తెలిపారు.

## ఓటర్ల జాబితాల తారుమారుపై సిట్‌కు సుప్రీం నో



న్యూఢిల్లీ

గత ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ సహా కర్ణాటకలోని లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలను తారుమారుచేశారని.. దీనిపై మాజీ న్యాయమూర్తి సారథ్యంలో సిట్ ఏర్పాటుచేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ)ని ఆశ్రయించాలని సూచించింది. ప్రజాప్రయోజనం పేరుతో పిటిషన్ వేశారని.. దీనిపై విచారణకు తాము సానుకూలంగా లేమని స్పష్టంచేసింది. ప్రత్యామ్నాయ చట్టబద్ధమైన మార్గాలను అన్వేషించాలని హితవు పలికింది. ఈసీ, బీజేపీ కుమ్మక్కయ్యాయని.. బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలో భారీగా దొంగ ఓట్లను చేర్చారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలను పిటిషనర్ తన వ్యాజ్యంలో ప్రస్తావించారు.

### బీహార్ ఎన్నికల వేళ సంచలనం..

### లాలూ, తేజస్వీకి బిగ్ షాక్

ఢిల్లీ: బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఐఆర్‌సీటీసీ కుంభకోణం కేసుకు సంబంధించి బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆయన సతీమణి రబ్రీ దేవి, తేజస్వి యాదవ్‌పై అభియోగాలు మోపాలని ఢిల్లీ కోర్టు సోమవారం ఆదేశించింది. అభియోగాలను నమోదు చేసింది. దీంతో కేసు విచారణ దశకు చేరుకుంది. ఈ స్కామ్‌లో లాలూ.. కుట్రకు పాల్పడ్డారని, తన పదవిని దుర్వినియోగం చేశారని కోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే ఈ కేసులో నిందితులపై అవినీతి, క్రిమినల్ కుట్ర, మోసం వంటి పలు అభియోగాలను ఖరారు చేశారు. కాగా, ఐఆర్‌సీటీసీ కేసులో లాలూ కుటుంబంపై సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. పూరి, రాంచీ హోటల్స్ కాంట్రాక్టుల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించింది. ఇదంతా లాలూ ప్రసాద్ యాదవ్ కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో జరిగిందని పేర్కొంది. 2017లో లాలూ కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసిన సీబీఐ, తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేసింది. సీబీఐ ఆరోపణలతో ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఏకీభవించింది. అనంతరం, ఐఆర్‌సీటీసీ కేసులో అభియోగాలు నమోదు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో లాలూ స్పందిస్తూ.. అభియోగాలు మోపినంత మాత్రాన దోషులం కాదు. విచారణను ఎదుర్కొంటామని వెల్లడించారు. కాగా, ఈ కేసు 2004 నుంచి 2009 వరకు లాలూ ప్రసాద్ యాదవ్ కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్న కాలం నాటిది. రెండు ఐఆర్‌సీటీసీ హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టులను సుజాత హోటల్స్ అనే ప్రైవేట్ కంపెనీకి ఇవ్వడంలో అక్రమాలు జరిగాయని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. సీబీఐ చార్జిషీట్ ప్రకారం.. 2004–2014 మధ్య పూరి, రాంచీలోని బీఎన్ఆర్ హోటల్స్‌ను భారతీయ రైల్వేల నుంచి ఐఆర్‌సీటీసీకి బదిలీ చేయడంలో కుట్ర జరిగిందని, ప్రైవేట్ సంస్థలకు అనుకూలంగా నిబంధనలు మార్చినట్లు ఆరోపణలున్నాయి. ఈ హోటళ్లను నిర్వహణ కోసం పాట్నాలో ఉన్న సుజాత హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు లీజుకు ఇచ్చారు. నిబంధనలు మార్చడం ద్వారా సుజాత హోటల్స్‌కు అనుకూలంగా టెండర్ ప్రక్రియను తారుమారు చేశారని సీబీఐ ఆరోపించింది. చార్జిషీట్‌లో ఐఆర్‌సీటీసీ గ్రూప్ మాజీ జనరల్ మేనేజర్లు వీకే అస్థానా, ఆర్‌కే గోయల్‌తో పాటు, సుజాత హోటల్స్ డైరెక్టర్లు, చాణక్య హోటల్ యజమానులు విజయ్ కొచ్చర్, వినయ్ కొచ్చర్‌ల పేర్లు కూడా ఉన్నాయి.

## మద్రాస్ హైకోర్టుకు మందలింపు



ఢిల్లీ: కరూర్ తొక్కిసలాట ఘటనపై సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు అప్పగిస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. నిస్సందేహంగా.. న్యాయసమ్మతమైన, పక్షపాతరహిత విచారణ అనేది పౌరుల హక్కు అని ఈ సందర్భంగా ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ క్రమంలో గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను దేశ సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. కరూర్ తొక్కిసలాట ఘటనపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ టీవీకే పార్టీ వేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు.. సీబీఐ విచారణకు ఆదేశించింది. అయితే ఈ విచారణను పర్యవేక్షించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో ఇద్దరు ఐపీఎస్‌లు ఈ కమిటీలో ఉంటారని పేర్కొంది. ఈ కమిటీకి సీబీఐ ఎప్పటికప్పుడు దర్యాప్తు నివేదికను అందించాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 27వ తేదీన కరూర్‌లో జరిగిన టీవీకే ర్యాలీలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందారు. ఈ ఘటనపై తమిళనాడు ప్రభుత్వం తొలుత రిటైర్డ్ జడ్జి అరుణా జగదీశన్‌తో దర్యాప్తుకు ఆదేశించింది. ఈ కమిటీ మూడు నెలల్లో నివేదికను సమర్పించనుంది. అయితే ఈ కేసులో కుట్ర కోణం ఉందంటూ టీవీకే మొదటి నుంచి వాదిస్తోంది. ఈ క్రమంలో మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా ఊరట దక్కలేదు. దీంతో సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం సీబీఐ విచారణకు లైన్ క్లియర్ చేసింది. అదే సమయంలో.. మద్రాస్ హైకోర్టును సుప్రీం కోర్టు మందలించింది. తమిళనాడులో రాజకీయ పార్టీల ర్యాలీలు, సభల కోసం ఒక ప్రామాణిక విధానాన్ని రూపొందించాలనే అభ్యర్థనతో టీవీకే పిటిషన్ వేస్తే.. మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్(సింగిల్ బెంచ్) ఆ పార్టీ, ఆ పార్టీ అధినేత విజయ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీనిని సుప్రీం కోర్టు ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. అంతేకాదు.. విచారణ జరపకుండానే ఐపీఎస్ అధికారి అస్రా గార్గ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేయడం కూడా పిటిషన్ పరిధిని మించి వెళ్లడమేనని, పైగా డివిజనల్ బెంచ్‌లో ఉండగా సింగిల్ బెంచ్ అలాంటి ఆదేశాలు ఎలా ఇవ్వగలిగింది? అనే అభ్యంతరాలను సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం వ్యక్తం చేసింది.

# బిజినెస్

## అమెరికా అప్పులు తీర్చుకునేందుకే..
## బంగారం ధరను అంతగా పెంచేస్తుందా!



ప్రపంచ మార్కెట్‌లో ఇటీవల బంగారం ధర అనూహ్యంగా పెరిగిపోయింది. ఇలా రికార్డు స్థాయిలో పెరగడం ఒక అడ్డంకి ప్రణాళికా లేదా అమెరికా రుణ సంక్షోభాన్ని అధిగమిం చడానికి ఒక రహస్య నాటకమా అన్న షాడో థియరీ ప్రచారంలో ఉంది.ప్రస్తుత మార్కెట్ ధరతో లెక్క కడితే అమెరికాలో బంగారం పుస్తక విలువ 11 బిలియన్ డాలర్ల నుంచి ఒక ట్రిలియన్ డాలర్‌కు పెరుగుతుంది. ఈ పెరుగుదలతో అమెరికా సులభంగా తన అప్పులు తీర్చేయవచ్చు. దీంతో ఆ దేశానికి ఇప్పుడు కొత్త అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా, ఆస్తుల అమ్మకాలు జరపకుండా ఆకస్మిక లాభం చేకూరుతుందని ఆర్థికవేత్తలు అంటున్నారు. లింక్డ్ ఇన్‌లో వచ్చిన ఒక పోస్ట్ ప్రకారం 1970 నుంచి చూస్తే బంగారం రాబడి 649 రెట్లు ఉంది. ఈ లోహం ఇటీవలి పెరుగుదలకు నిజమైన కారణమేమిటనే లోతైన చర్చకు దారి తీసింది. పెరుగుతున్న రుణాన్ని భర్తీ చేయడానికి అమెరికా తన బంగారు నిల్వలను తిరిగి అంచనా వేయడానికి సిద్ధమవుతుండవచ్చు అన్న సిద్ధాంతం ప్రచారంలో ఉంది. అమెరికా ఇప్పటికీ తన బంగారాన్ని ఫెడరల్ రిజర్వ్ పుస్తకాలలో 1970లో నిర్ణయించిన ఔన్స్‌కు కేవలం 42.22 డాలర్ల ప్రకారం (ప్రస్తుతం 3,000 డాలర్లు) మాత్రమే నమోదు చేసిందని సీనియర్ సలహాదారు ఆసిన్ గుప్తా తెలిపారు. అయితే బంగారం 10 రెట్లు పెరిగిన ప్రకారం లెక్క వేసినా అమెరికా ట్రిలియన్ డాలర్ల రుణాన్ని తుడిచిపెట్టేస్తుందని ఆశిష్ యూ అనే మరో ఆర్థిక నిపుణుడు తెలిపాడు. అయితే ఇది డాలర్ పతనానికి దారి తీస్తుందని, ద్రవ్యోల్బణం ఆకాశాన్ని అంటుతుందని హెచ్చరించారు. ఈ వాదనను మరో ఆర్థిక వేత్త సేనుగుప్తా ఖండించారు. బంగారం బలపడితే డాలర్ కూడా బలంగా ఉంటుందని ఆయన అన్నారు.

## ఎన్‌ఎస్‌ఈపై 40 కోట్ల సైబర్‌దాడులు




నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) పై రోజూ దాదాపు 15- 17 కోట్ల సైబర్ దాడులు జరుగుతున్నాయని ఎన్‌ఎస్‌ఈ సీనియర్ అధికారి తెలిపారు. రోజూ ఇంత భారీ సంఖ్యలో దాడులను సమర్థంగా ఎదుర్కోవడం సవాలే అయినా, సమర్థంగా తిప్పికొడుతున్నట్లు పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఒక రోజులో 40 కోట్ల సైబర్ దాడులను ఎదుర్కొన్నట్లూ ఆయన వెల్లడించారు. ఒక రోజులో ఎదురైన సైబర్ దాడుల్లో ఇప్పటి వరకు ఇదే అత్యధికమని వివరించారు. సైబర్‌దాడులను ఎదుర్కునేందుకు ప్రత్యేకంగా నియమితులైన సైబర్ వారియర్స్.. రోజంతా ఎన్‌ఎస్‌ఈ వ్యవస్థలను కాపాడుతూ ఉంటారని వెల్లడించారు. ఎంత భారీగా సైబర్‌దాడులు జరిగినా, సిబ్బంది అప్రమత్తత.. అధునాతన వ్యవస్థలు - సాంకేతికత కారణంగా ఎన్‌ఎస్‌ఈ కి ఎటువంటి నష్టం చోటుచేసుకోలేదని తెలిపారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సహాయంతో దాడులను సైబర్ వారియర్స్ తిప్పికొడుతున్నారని వెల్లడించారు. తన కార్యకలాపాలు సురక్షితంగా ఉండటం కోసం ఎన్‌ఎస్‌ఈ బలమైన సైబర్ సెక్యూరిటీ ప్రమాణాలను రూపొందించి, అమలు చేస్తోందని తెలిపారు. ఎన్‌ఎస్‌ఈ అకాడమీ ద్వారా సైబర్ సెక్యూరిటీ ఫండమెంటల్స్ ప్రోగ్రామ్‌లో శిక్షణ కూడా నిర్వహిస్తోందని వెల్లడించారు.

# అభివృద్ధికి చిహ్నంగా ముందుకెళ్తోన్న రియల్ ఎస్టేట్

రాష్ట్రంలో అభివృద్ధికి చిహ్నంగా రియల్ ఎస్టేట్ ముందుకు వెళ్తొందని, కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనను చాలా కీలకంగా ముందుకు తీసుకెళ్తొందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో రోడ్ల అభివృద్ధికి రూ. లక్ష 80వేల కోట్ల చేస్తున్నామన్నారు. మన దేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన ఉండాలని ప్రధాని నరేంద్రమోడీ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఆదివారం నేషనల్ రియల్ ఎస్టేట్ మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైటెక్స్ లో నిర్వహిస్తున్న 15వ నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2047 లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ధి చెందిన దేశాల వరుసలో మన దేశం ఉండాలని పేర్కొన్నారు. దేశంలో ప్రతి శాఖకు మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్లో అత్యధిక కల్పన చేస్తున్నామ న్నారు. ప్రపంచంలో 4వ ఆర్థిక ఎకనామిగా అభివృద్ధి చెందుతున్నామని, ప్రధాని నరేంద్ర మోడీ సంస్కరణలు లేకుండా అభివృద్ధి పనులు చేయమని పేర్కొంటున్నారని తెలిపారు. 331 లక్షల కోట్లకు మన దేశ జిడిపి పెరిగిందని, 20 మంది ప్రజలు దారిద్ర్య రేఖ నుంచి బయటకు వచ్చారని తెలిపారు. అవినీతి లేని పాలన మోడీ అందిస్తున్నారని, గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు తగ్గించారని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ సెక్టార్లో రెరా యాక్ట్ మైల్ స్టోన్గా ఉపకరిస్తుందని, జిఎస్టి స్లాబ్ తగ్గడంతో రియల్ ఎస్టేట్కు బాగా లాభం జరిగిందని పేర్కొన్నారు. 2024-25లో రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవల రంగం 15.4 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. 11.97 శాతం వృద్ధి రేటుతో నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80వేల కోట్లకు పైగా సమకూర్చింది. స్టేట్ సర్వీసెస్ జీఎస్ డీపీలో ఈ రెండు రంగాల వాటానే 24.9 శాతంగా ఉంది అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు.





హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాల పరిధిలో 2024 సెప్టెంబర్ లో రూ.2820 కోట్ల విలువైన 4903 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ ఏడాది సెప్టెంబర్ లో రూ.4804 కోట్ల విలువైన 6612 ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇది 35 శాతం అధికం. విలువలో వార్షిక వృద్ధి 70 శాతంగా నమోదయ్యింది. ఇవి కేవలం గణాంకాలు కాదు, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలయ్యిందంటూ మాపై దుష్ప్రచారం చేస్తున్న వారికి ధీటైన సమాధానాలు అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ సెప్టెంబర్ లో రూ. కోటి పైన విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్లలో 151 శాతం పెరుగుదల ఉంది. మొత్తం విక్రయాల్లో విలువ పరంగా వీటి వాటానే 53 శాతం అని చెప్పారు. భారత్లో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది రియల్ ఎస్టేట్ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. అయితే అభివృద్ధి చెందిన దేశాల జీడీపీలో స్థిరాస్తి రంగ వాటా సగటున 10 శాతం 15 శాతం కాగా.. చైనాలో అత్యధికంగా 23 శాతం నుంచి 25 శాతం వరకుంది. మన దేశంలో ఇది 6 శాతం నుంచి 8 శాతమే. ఇది మరింత పెరగాల్సిన అవసరముంద్ది అని అభిప్రాయపడ్డారు.

## భారత మార్కెట్‌లో టాటా మోటార్స్ హవా!



దేశీయ ప్రముఖ ఆటో మొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ భారత ఆటోమొబైల్ రంగంలో తాజాగా ఓ మైలురాయి సాధించింది. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో కంపెనీ చరిత్రలో ఎప్పుడూ లేనంతగా రిటైల్ అమ్మకాలతో సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఇదే సమయంలో మార్కెట్‌లో ఇప్పటికే కీలక స్థానంలో ఉన్న మారుతీ సుజుకీ తన ఆధిపత్యాన్ని మరింత చాటగా.. హ్యుందాయ్, కియా వంటి ఇతర కంపెనీలు అమ్మకాల్లో వెనుకబడ్డాయి. వాహన్ పోర్టల్ విడుదల చేసిన లెక్కల ఆధారంగా ఈ సమాచారం వెల్లడైంది. స్పష్టంగా చెప్పాలంటే సెప్టెంబర్‌లో టాటా మోటార్స్ 40,594 కార్లను విక్రయించింది. అందులోనూ నెక్సాన్ మోడల్ విపరీతంగా డిమాండ్ ఉన్నది. ఈ ఒక్క మోడల్‌నే 22,500 యూనిట్లకుపైగా అమ్ముడయ్యింది. కంపెనీ మార్కెట్ వాటా 11.52 శాతం నుంచి 13.75 శాతానికి పెరిగింది. ఇదిలా ఉంటే.. ప్యాసింజర్ వాహనాల్లో మారుతీ సుజుకీ దూసుకెళ్లింది. మొత్తం 1,23,242 యూనిట్లు విక్రయించి, మార్కెట్‌లో 41.17 శాతం వాటాను సొంతం చేసుకుంది. గతేడాదితో పోలిస్తే సంస్థ విక్రయాల్లో, వాటాలో స్వల్ప మెరుగుదల కనిపించింది. ఇక మూడోస్థానాన్ని స్థానాన్ని మహీంద్రా అండ్ మహీంద్రా దక్కించుకుంది. థార్, స్కార్పియోకు డిమాండ్ రాగా.. 37,659 కార్లు విక్రయించి 12.58 శాతం వాటా సాధించింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా ఈసారి మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. గత సంవత్సరం ఇదే సమయంలో 38,833 కార్లు అమ్మిన సంస్థ.. ఈ సెప్టెంబర్‌లో మాత్రం 35,812 యూనిట్ల అమ్మకాలకే పరిమితమైంది. దీంతో కంపెనీ మార్కెట్ షేర్ 13.72 శాతం నుంచి 11.96 శాతానికి పడిపోయింది. అలాగే కియా ఇండియా, టయోటా కిర్లోస్కర్ మోటార్స్ తమ మార్కెట్ వాటాను కోల్పోయాయి. దేశవ్యాప్తంగా ప్యాసింజర్ కార్ల మొత్తం అమ్మకాలు ఈ నెలలో 6 శాతం పెరిగి 2,99,369 యూనిట్లుగా నమోదయ్యాయి. ఇక ద్విచక్ర వాహనాల విభాగంలో హీరో మోటోకార్ప్ తన మార్కెట్ హోల్డింగ్‌ను 22.48 శాతం నుంచి 25.1 శాతానికి పెంచుకుంటూ ముందంజ వేసింది. మరోవైపు, హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా తన వాటాను 27.7 శాతం నుంచి 25.05 శాతానికి కోల్పోయింది. టీవీఎస్ మోటార్ సంస్థ మాత్రం మార్కెట్ వాటాలో పురోగతి సాధించింది. మొత్తం మీద టూవీలర్ అమ్మకాలు 6.5 శాతం వృద్ధి చెందినట్లుగా డేటా తెలిపింది.

# విండీస్ పోరాటం సరిపోలే..
# క్లీన్‌స్వీప్ దిశగా టీమిండియా

# స్పోర్ట్స్

సొంతగడ్డపై చెలరేగిపోతున్న భారత జట్టు సిరీస్ విజయానికి చేరువైంది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ తేడాతో వెస్టిండీస్‌ను ఓడించిన టీమిండియా ఢిల్లీ టెస్టు (%ణవశ్రీష్ట్రఱవర్%)లోనూ ప్రత్యర్థిని హడలెత్తిస్తూ గెలుపుబాటలో పయనిస్తోంది. కుల్దీప్ యాదవ్, బుమ్రాల ధాటికి కుప్పకూలిన విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో పోరాడినా స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించగలిగింది. 120 పరుగుల ఛేదనలో యశస్వీ జైస్వాల్ (8) త్వరగానే ఔటైనా.. సాయిసుదర్శన్(30 నాటౌట్), కేఎల్ రాహుల్(25 నాటౌట్) మరో వికెట్ పడనీయలేదు.ఇరువురు అజేయంగా రన్స్ జోడించారు. దాంతో.. నాలుగో రోజు ఆట ముగిసే సరికి 63 రన్స్ చేసింది టీమిండియా. ఇంకా విజయానికి అవసరమైన 58 పరుగులను రేపు తొలి సెషన్‌లోనే కొట్టేసి సిరీస్ క్లీన్‌స్వీప్ చేయడం ఖాయం. సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఓటమితో 11 సిరీస్ విజయాల రికార్డును కోల్పోయిన భారత జట్టు మళ్లీ పూర్వవైభవం దిశగా సాగుతోంది. వెస్టిండీస్‌ను తొలి టెస్టులో ఇన్నింగ్స్ తేడాతో చిత్తుగా ఓడించిన టీమిండియా రెండో మ్యాచ్‌లోనూ అదే జోరు చూపించింది.



అయితే..తొలి ఇన్నింగ్స్‌తో పోల్చితే.. ఫాలోఆన్ తర్వాత విండీస్ బ్యాటర్ల ఆట కాస్త మెరుగుపడింది. టాపార్డర్‌లో జాన్ క్యాంప్‌బెల్(115), షాయ్ హోప్(105) శతకాలతో చెలరేగి విండీస్‌ను ఆదుకున్నారు. వీరిద్దరి అసమాన పోరాటంతో లంచ్ వరకూ పటిష్ట స్థితిలో ఉన్న విండీస్ ఆ తర్వాత కుదేలైందిది. కొత్త బంతి తీసుకున్న తర్వాత సిరాజ్(2-43), కుల్దీప్ యాదవ్(3-104) రెచ్చిపోగా.. టపటపా ఆరు వికెట్లు కోల్పోయింది. చివరి వికెట్ కూడా తీసేసి 300లోపే ఆలౌట్ చేయాలనుకున్న భారత బౌలర్లను జస్టిన్ గ్రీవ్స్ (50 నాటౌట్), జైడన్ సీల్స్ (32) విసిగించారు. వీరిద్దరూ 79 పరుగుల భాగస్వామ్యంతో జట్టు స్కోర్ 350 దాటించారు. టీ సెషన్ తర్వాత బుమ్రా(3-44) ఓవర్లో సీల్స్ ఔట్ కావడంతో 390 వద్ద విండీస్ ఇన్నింగ్స్ ముగిసింది.

**సాయి, రాహుల్ నింపాదిగా**

స్వల్ప ఛేదనలో ధనాధన్ ఆడాలనుకున్న యశస్వీ జైస్వాల్(8)ను ఔట్ చేసిన వారికన్ విండీస్ శిబిరంలో జోష్ తెచ్చాడు. కానీ, ఆ తర్వాత వచ్చిన సాయిసుదర్శన్ (30 నాటౌట్) సాయంతో కేఎల్ రాహుల్(25 నాటౌట్) స్కోర్‌బోర్డును నడిపించాడు. నింపాదిగా ఆడిన ఇద్దరూ మరో వికెట్ పడకుండా చూసుకునేందుకే ప్రాధాన్యం ఇవ్వడంతో బౌండరీలు తగ్గిపోయాయి. రోస్టన్ ఛేజ్ ఓవర్లో సాయి రెండు ఫోర్లతో స్కోర్ 50 దాటింది. ఇద్దరూ రిస్క్ తీసుకోకపోవడంతో నాలుగో రోజు ఆట ముగిసే సరికి టీమిండియా వికెట్ కోల్పోయి 63 రన్స్ చేసింది. ఇంకా విజయానికి అవసర మైన పరుగులు 58 మాత్రమే కావడంతో తొలి సెషన్‌లోనే శుభ్‌మన్ గిల్ సేన సిరీస్ అందుకోవడం ఖాయం.

## జట్టుకు ఎంపిక కాకపోతే బాధే మరి..
## వారిద్దరే నాకు స్ఫూర్తి: అభిమన్యు



**ఇంటర్నెట్ డెస్క్:** భారత జట్టులో ఆడాలనేది ప్రతి క్రికెటర్ కల. అందుకోసం దేశవాళీలో భారీగా పరుగులు చేస్తే అవకాశం వస్తుందనేది వారి ఆలోచన. కానీ, ఓ క్రికెటర్‌కు మాత్రం నిరీక్షణ తప్పడం లేదు. అతడేమన్నా సరైన ఆటతీరు ప్రదర్శించడం లేదా? అంటే అదేం కాదు. దేశవాళీలో అభిమన్యు ఈశ్వరన్ పేరు చెబితే ఠక్కున గుర్తుపడతారు. భారత్ జట్టుకూ సారథ్యం వహించిన అనుభవం ఉంది. అలాగని అతడిని జాతీయ జట్టులోకి తీసుకోవడం లేదా? అంటే అదీ కాదు. సిరీస్‌లకు ఎంపికైనా సరే తుది జట్టులో మాత్రం ఛాన్స్ రాలేదు. ఇప్పుడు ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. స్వదేశంలో విండీస్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపిక కాలేదు. ఇప్పటికే అభిమన్యు తండ్రి తీవ్ర అసహనం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అభిమన్యు తన ఆవేదనను వ్యక్తంచేశాడు. "కొన్నిసార్లు ఇలాంటి నిర్ణయాలు తీవ్రంగా బాధిస్తాయి. బాగా ఆడి.. కఠినంగా శ్రమించినా సరే కల నెరవేరకపోతే పరిస్థితి దారుణంగా ఉంటుంది. అయితే, మద్దతుగా నిలిచే కుటుంబం, స్నేహితులు, కోచ్ ఉండటం వల్ల ఆ బాధ నుంచి కోలుకోలుగుతున్నా. నన్ను ఎప్పటికప్పుడు ఉత్సాహపరుస్తూ ఉంటారు. అలా ఉండటం కూడా అదృష్టమే. రాబోయే రంజీ సీజన్ కోసం ఇప్పట్నుంచే సాధన మొదలుపెట్టా. నా చేతుల్లో ఏముందనే దానిపై దృష్టిపెట్టా. కష్టపడతా. ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తా. నన్ను నేను మెరుగుపర్చుకొనేందుకు చూస్తా. ఈ సీజన్ కోసం కొత్త షాట్లను ఆడటంపై దృష్టిపెట్టా. అవేంటనేది ఇప్పుడే చెప్పలేను. తప్పకుండా నాతోపాటు మా జట్టుకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నా. భారత జట్టుకు ఆడటం ఎప్పటికీ మోటివేషన్. అయితే, బెంగాల్ తరఫున ఆడుతున్నా సరే అలాగే గర్వపడతా" అని అభిమన్యు తెలిపాడు.

**అతడికి బిగ్ ఫ్యాన్‌ను..**

30 ఏళ్ల వయసులోనూ అవకాశాలు దక్కించుకున్న మైకెల్ హస్సీ, సూర్యకుమార్ యాదవ్ తనకు స్ఫూర్తి అని అభిమన్యు వ్యాఖ్యానించాడు. "నేను ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు మైకెల్ హస్సీకు పెద్ద ఫ్యాన్‌ను. అతడు ఆసీస్‌కు డెబ్యూ చేయకముందు దేశవాళీలో భారీగా పరుగులు చేశాడు. అతడి క్రికెట్ ప్రయాణం చూస్తే చాలు ఏదైనా సాధించవచ్చని తెలిసిపోతుంది. ఇక టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా 30 తర్వాతనే అరంగేట్రం చేశాడు. ఇప్పుడు జట్టును నడిపిస్తున్నాడు. మాలాంటి క్రికెటర్లకు వీరిద్దరూ మంచి ఉదాహరణలు. నేను కూడా అలా చేయగలనని మా మనసుకు చెబుతూ ఉంటా" అని అభిమన్యు వెల్లడించాడు. దేశవాళీలో అభిమన్యు 7,600కి పైగా పరుగులు చేశాడు. ఇందులో 27 సెంచరీలు, 29 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## రంజీ ట్రోఫీ కోసం బిహార్ జట్టు..
## యువ బ్యాట్స్‌మెన్స్ వైభవ్ సూర్యవంశీకి కీలక బాధ్యతలు!



ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ప్లేట్ లీగ్ సీజన్‌లో బిహార్ జట్టు తమ తొలి మ్యాచ్‌లో అరుణాచల్‌ప్రదేశ్‌ను ఢీకొట్టనున్నది. ఈ లీగ్‌కు బిహార్ క్రికెట్ అసోసియేషన్ జట్టును ప్రకటించింది. బుధవారం నుంచి ప్రారంభంకానున్న రాబోయే రంజీ ట్రోఫీ సీజన్‌లో తొలి రెండు మ్యాచులకు యువ బ్యాట్స్‌మెన్, 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. సకిబుల్ గని కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. 15న మోయిన్-ఉల్-హక్ స్టేడియంలో జరిగే ప్లేట్ లీగ్ సీజన్‌లో బీహార్ తన తొలి మ్యాచ్‌లో అరుణాచల్ ప్రదేశ్‌తో తలపడనున్నది. అయితే, గత రంజీ ట్రోఫీ సీజన్‌లో ఒక్క విజయం కూడా నమోదు చేయకపోవడంతో బిహార్‌ను ప్లేట్ లీగ్ దశకు కుదించారు. సూర్యవంశీ 2023-24 సీజన్‌లో 12 సంవత్సరాల వయసులో రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కాంట్రాక్ట్ పొందిన అతి పిన్న వయస్కుడిగా (13 ఏళ్లు) నిలిచాడు. భారత అండర్-19 జట్టుతో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలో కూడా పర్యటించాడు. ఐపీఎల్ కోసం రాజస్థాన్ రాయల్స్ సూర్యవంశీని ఎంపిక చేసింది. గుజరాత్ టైటాన్స్‌పై టీ20లో సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడిగా (14) ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. కేవలం 35 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఇది ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన సెంచరీ కూడా. వచ్చే ఏడాది ప్రారంభంలో జింబాబ్వే, నమీబియాలో జరగనున్న అండర్-19 ప్రపంచ కప్ కోసం భారత జట్టులో స్థానం కోసం సూర్యవంశీ పోటీ పడుతున్నాడు.

**రంజీ ట్రోఫీకి బిహార్ జట్టు :**

సకిబుల్ గని (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ (వైస్-కెప్టెన్), పియూష్ కుమార్ సింగ్, భాస్కర్ దూబే, అర్ణవ్ కిశోర్, ఆయుష్ లోహరుకా, బిపిన్ సౌరభ్, అమోద్ యాదవ్, నవాజ్ ఖాన్, సాకిబ్ హుస్సేన్, రాఘువేంద్ర ప్రతాప్ సింగ్, సచిన్ కుమార్ సింగ్, హిమాన్షు సింగ్, ఖలీద్ ఆలం, సచిన్ కుమార్.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...






# ఆ కంట్రోల్ ఎప్పుడూ వాళ్లకివ్వొద్దు.. సిద్దుజొన్నలగడ్డ స్టైల్‌లో తెలుసు కదా ట్రైలర్

సిద్దుజొన్నలగడ్డ నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ తెలుసు కదా. నీరజ కోన డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో శ్రీనిధి శెట్టి, రాశీఖన్నాఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ మూవీ అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. నువ్వేరోజైతే నీ ఆడదానికెళ్లి నీకన్నీళ్లు, నీ బాధ చూపిస్తావో.. ఆరోజు నువ్వే నీ జుట్టు తీసుకెళ్లి దాని చేతిలో పెట్టినోడివవుతవ్ బ్రదర్.. ఆ కంట్రోల్ ఎప్పుడూ వాళ్లకివ్వొద్దు.. పవర్ సెంటర్ ఎప్పుడూ ఇక్కడ మెయింటైన్ అవ్వాలి అంటూ సిద్దు స్టైల్‌లో సాగుతున్న డైలాగ్స్‌తో మొదలైంది ట్రైలర్. ఎవరిని ప్రేమించాలి.. ఎంత ప్రేమించాలి.. ఎలా ప్రేమించాలి అనేది మన కంట్రోల్‌లో ఉండాలి.. సిద్దు చెప్తున్న డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. నిన్న చూస్తే భయమేస్తుంది అని రాగ (శ్రీనిధి శెట్టి) అంటుంటే..భయపడు అయితే అంటున్నాడు సిద్దు (వరుణ్). నిన్ను చేసుకుంటే నా లైఫ్ బాగుంటుందని గ్యారంటీ ఇవ్వగలుగుతావా.. ? అంజలి (రాశీఖన్నా) అడుగుతుంటే నీకు గ్యారంటీ, వారంటీలు ఇవ్వడానికి నేనేం సేల్స్‌మెన్ కాదంటున్నాడు. సినిమా ట్రయాంగిల్ స్టోరీ నేపథ్యంలో సాగనున్నట్టు ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రంలో వైవా హర్ష కీలక పాత్రలో నటిస్తుండగా.. నేషనల్ అవార్డు విన్నింగ్ ఎడిటర్ నవీన్ నూలి ఈ చిత్రానికి పనిచేస్తున్నాడు. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. స్టైలిష్ట్‌గా పాపులర్ అయిన నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయింది.



# 'జగద్ధాత్రి' సీరియల్ హీరోయిన్‌కి పెళ్లి కళ.. ప్రియుడు ఎవరంటే?

తెలుగు సీరియల్ నటి గుడ్ న్యూస్ చెప్పేసింది. ఆమెనే 'జగద్ధాత్రి' సీరియల్ హీరోయిన్ దీప్తి మన్నె. పదిరోజుల క్రితం తన ప్రేమ విషయాన్ని బయటపెట్టిన ఈమె.. ఇప్పుడు ప్రియుడిని పరిచయం చేసింది. ఇద్దరు జంటగా, రొమాంటిక్‌గా దిగిన ఫొటోలని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. తోటీ నటీనటులు ఈమెకు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఇంతకీ దీప్తి ప్రియుడు ఎవరు? తెలుగులో సీరియల్స్ అనగానే కన్నడ నటులే గుర్తొస్తారు. అలాంటి వాళ్లలో దీప్తి మన్నె ఒకరు. బెంగళూరులో పుట్టిన ఈ బ్యూటీ తొలుత కన్నడలో సీరియల్స్, సినిమాలు చేసింది. తర్వాత తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. గత కొన్నేళ్లలో 'రాధమ్మ కూతురు', 'జగద్ధాత్రి', 'పద్మావతి' తదితర సీరియల్స్ చేసింది. ఇక సెలవ్ అనే తెలుగు మూవీతో పాటు యెవన్, దేవదాస్ బ్రదర్స్, కర్త, హింగ్యాకే, నమ్మూర హైక్లు అనే కన్నడ చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం తాను రోహన్‌తో ప్రేమలో ఉన్నానని దీప్తి.. ఇన్ స్టా వేదికగా బయటపెట్టింది. ఇతడికి ఇండస్ట్రీతో సంబంధం లేనట్లు తెలుస్తోంది. 'డియర్ రోహన్. నీ కోసమే ఇన్నాళ్లుగా నేను ఎదురుచూస్తున్నాను. నాకు దక్కిన మరపురాని బహుమతి నువ్వు. నన్ను కోరుకున్నందుకు థ్యాంక్యూ. ఐ లవ్ యూ' అని ప్రియుడి గురించి దీప్తి చెప్పుకొచ్చింది. ప్రస్తుతానికైతే పరిచయం చేసింది. త్వరలో నిశ్చితార్థం, పెళ్లి ఉండొచ్చని తెలుస్తోంది. బహుశా ఈ ఏడాది పూర్తయ్యేలోపు శుభకార్యాలు చేస్తారేమో!

# నక్సలైట్‌గా ఆనంద్‌దేవరకొండ.. Takshakudu లుక్ వైరల్



బేబి సినిమాతో సూపర్ హిట్టు కొట్టాడు ఆనంద్‌దేవరకొండ. ఆ తర్వాత వినోద్ అనంతోజ్ డైరెక్షన్‌లో నటించిన మిడిల్ క్లాస్ మెలోడీస్ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. వినోద్ అనంతోజ్, ఆనంద్ దేవరకొండ కాంబోలో మరో సినిమా రాబోతుంది. ఈ ఇద్దరూ ఈ సారి విభిన్న కథాంశంతో వస్తున్నట్టు తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్ చెబుతోంది. ఆనంద్ దేవరకొండ నటిస్తున్న నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ Takshakudu. ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఆనంద్ దేవరకొండ నక్సలైట్‌గా కనిపించబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. వేటగాడి చరిత్రలో జింకలు దోషులు.. అనే క్యాప్షన్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీలో లాపతా లేడీస్ ఫేం నటాన్షి గోయెల్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది.



# 'కె. ర్యాంప్' సినిమాతో రీఎంట్రీ ఇస్తున్న ఒకప్పటి హీరోయిన్

టాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోయిన్స్‌గా గుర్తింపు పొందిన వారు ఇప్పుడు మళ్లీ రీఎంట్రీ ఇస్తున్నారు. ఈ క్రమంలోనే జెనీలియా, భూమిక, అన్షు, లయ, రంభ, మీనా, విజయశాంతి,సంగీత వంటి హీరోయిన్లు రీఎంట్రీ ఇచ్చారు. వీరిలో కొంతమంది మెప్పించారు కూడా. అయితే, తాజాగా ముంబై బ్యూటీ కామ్న జెఠ్మలానీ టాలీవుడ్‌లోకి మరో ఛాన్స్ కోసం వచ్చేసింది. కిరణ్ అబ్బవరం సినిమా కె.ర్యాంప్‌తో ప్రేక్షకులను పలకరించనుంది. 2005లో తెలుగులో వచ్చిన ప్రేమికులు సినిమా ద్వారా ఆమె సినీరంగ ప్రవేశం చేసింది. తన మూడో చిత్రమైన రణంతో బాగా పాపులర్ అయింది. అయితే, ఆ తర్వాత కింగ్, సైనికుడు వంటి సినిమాల్లో కనిపించినా పెద్దగా ప్రభావం చూపించలేదు. 2013లో చివరిగా శ్రీ జగద్గురు ఆది శంకర మూవీలో మాత్రమే కనిపించింది. సుమారు 12 ఏళ్ల తర్వాత మళ్లీ తెలుగు వెండితెరపైకి కామ్నా జెఠ్మలానీ రానుంది. కామ్నా జఠ్మలానీ 2014, ఆగస్టు 11న బెంగళూరుకు చెందిన పారిశ్రామికవేత్త సూరజ్ నాగ్ పాల్‌ను వివాహం చేసుకుంది. సినిమా ఛాన్సుల కోసం ఈ విషయాన్ని కూడా ఆమె కొంత కాలం దాచింది. అయినప్పటికీ అవకాశాలు మాత్రం రాలేదు. ఇన్నేళ్ల తర్వాత ఆమె కె.ర్యాంప్‌తో వస్తుంది. అయితే, ఎంతమాత్రం విజయం సాధిస్తుందో చూడాల్సి ఉంది. రీసెంట్‌గా జూనియర్ సినిమాతో జెనీలియా మెప్పించింది. కానీ, తమ్ముడు సినిమాలో లయ పాత్ర అంతగా క్లిక్ కాలేదని చెప్పాలి. మరోవైపు సంగీత మాత్రం రీఎంట్రీలో చాలా సినిమాలతో అదరగొట్టేస్తుంది. అయితే.., భూమిక, మీరా జాస్మిన్, సదా వంటి స్టార్స్ ఇప్పటికే గట్టిపోటీ ఇచ్చేందుకు రేసులో ఉన్నారు.

# దీపిక అడిగితే ఇవ్వాల్సిందే.. మేమూ మనుషులమే!



మిగతా ఇండస్ట్రీల మాదిరిగా సినీ పరిశ్రమ ఓ పద్ధతి ప్రకారం లేదు. ఇక్కడ పనిగంటలు కరెక్ట్‌గా ఉండవు. అన్నిచోట్లా ఉన్నట్లుగానే ఇక్కడ కూడా ఎనిమిది గంటలు పనిచేసే విధానాన్ని అనుసరించాలని బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కొంతకాలంగా డిమాండ్ చేస్తోంది. చిన్న, మధ్యతరహా సినిమాలకు ఈ డిమాండ్లు సెట్ అవుతాయేమో కానీ భారీ బడ్జెట్ చిత్రాలకు వీటిని ఫాలో అవడం కష్టం! ఈ కారణం వల్లే స్పిరిట్, కల్కి 2898 ఏడీ వంటి సినిమాలు దీపిక చేజారిపోయాయి. దీపిక డిమాండ్ గురించి తాజాగా అర్జున్ రెడ్డి హీరోయిన్ షాలిని పాండే స్పందించింది. ఆమె మాట్లాడుతూ.. నాకు దీపికా పదుకొణె అంటే చాలా ఇష్టం. స్కూల్‌లో చదువుకునే రోజుల నుంచి తనను చూస్తున్నాను. ఆమె జర్నీని ఫాలో అయ్యాను. తనొక గొప్ప యాక్టర్. తనకు ఏది అవసరమో దాని గురించి నిర్భయంగా మాట్లాడుతుంది. మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని నొక్కి చెప్పింది. తనవల్లే మేమందరం మానసిక ఆరోగ్యం గురించి ఓపెన్‌గా మాట్లాడగలుగుతున్నాం. తను కోరుకున్నది తనకు దక్కాల్సిందేనని నా అభిప్రాయం అని చెప్పుకొచ్చింది. అటు కొంకణ సేన్ శర్మ మాట్లాడుతూ.. మేమేం సర్జరీ చేసే డాక్టర్స్ కాదు కదా.. మేమూ మనుషులమే! మాకూ చిన్నపాటి బ్రేక్స్ కావాలి అని పేర్కొంది. షాలిని పాండే తొలి చిత్రం అర్జున్ రెడ్డితో బాగా పాపులర్ అయింది. తమిళ, హిందీ భాషల్లో సినిమాలు చేసింది. డబ్బా కార్టెల్ అనే వెబ్ సిరీస్‌లోనూ తళుక్కుమని మెరిసింది. ధనుష్ ఇడ్లీ కొట్టు మూవీలో కీలక పాత్ర పోషించింది. ఈ మూవీ అక్టోబర్ 1న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఓ సినిమా చేస్తోంది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com